తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.APTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

గురువారం 03.07.2025 | సంపుటి : 11 సంచిక : 345 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 98483 28698




# పేదలకు మెరుగైన వైద్యం



## డిసెంబర్ నాటికి టిమ్స్ వరంగల్ హెల్త్ సిటీ : సీఎం రేవంత్‌రెడ్డి



### పది పాసైన ప్రతి విద్యార్థి ఇంటర్‌లో చేరాలి

ఇంటర్మీడియట్ అకాడమిక్‌పై అసెంబ్లీలో చర్చిస్తాం

- డ్రాపవుట్స్‌కు గల కారణాలను పరిశీలించండి
- త్వరలో చాకలి ఐలమ్మ వర్సిటీ నిర్మాణ టెండర్లు
- విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తామని స్పష్టంచేశారు .ఒకప్పుడు ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థపోయి ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజులు వచ్చాయన్నారు. హెల్త్ ప్రొఫైల్ క్రియేట్ చేయడం ద్వారా దీన్ని బ్రేక్ చేయొచ్చని సీఎం అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడగలుగుతున్నామని చెప్పడానికే మిస్ వరల్డ్ పార్టిసిపెంట్స్‌కు ఏఐజీ హాస్పిటల్ విజిట్ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గరంలోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నగర ప్రజలకు రెండో అతిపెద్ద హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు. హైదరాబాద్, తెలంగాణకు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారని.. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందని తెలిపారు. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులన్నారు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. 66 దేశాల నుంచి పేషంట్స్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు వస్తున్నారని ఇది గర్వకారణమన్నారు. ఇకపోతే గోశామహల్ లో నూతన ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించబోతున్నామని.. పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. నిర్మాణంలో ఉన్న వివిధ ఆసుపత్రులు పూర్తయితే మొత్తం 7 వేల పడకలు అందుబాటులోకి వస్తాయని మిగతా 2లో..

#### హెల్త్ ప్రొఫైల్ కార్డులతో కొత్త విధానం

గతంలో ఉన్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ స్థానంలో ఇప్పుడు స్పెషలిస్ట్ డాక్టర్ల యుగం వచ్చిందని సీఎం అన్నారు. ఈ పరిణామాన్ని మార్చేందుకు ప్రతి వ్యక్తికి హెల్త్ ప్రొఫైల్ కార్డు రూపొందించాలని, యూనిక్ ఐడీతో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ఈ కార్డులను అందించాలని ప్రణాళిక వేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం వెల్లడించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో హెల్త్ టూరిజం ఒక ముఖ్య అధ్యాయంగా ఉంటుందని, ఈ లక్ష్యంతో డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుగా నియమించినట్లు తెలిపారు. 66 దేశాల నుంచి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స కోసం రోగులు వస్తున్నారని, ఇది గర్వకారణమని అన్నారు.



### అమెరికాలో అక్రమంగా ప్రవేశిస్తూ..

# పట్టుబడ్డ 10వేల మంది భారతీయులు

### 30 మంది మైనర్లు.. అత్యధికులు గుజరాతీలే..

అమెరికా సరిహద్దుల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం

**వాషింగ్టన్, జులై 2 (జనంసాక్షి) :** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్యలో 10,382 మంది భారతీయులు దొరికిపోయారు. వీరిలో పెద్దల రక్షణ లేని 30 మంది మైనర్లు కూడా ఉన్నారు. అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన వారిలో కూడా అత్యధికంగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారున్నారు. ఈ డేటాను అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం విడుదల చేసింది. ఇటీవల కాలంలో అమెరికా సరిహద్దుల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం కావడంతో అక్రమ వలసదారులను భారీ సంఖ్యలో అరెస్టులు చేస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో మొత్తం 34,535 మంది భారతీయులు అక్రమంగా చొరబడుతూ పట్టుబడ్డారు. ఈ లెక్కన ఈ ఏడాది సుమారు 70శాతం తగ్గుదల నమోదైంది. రోజుకు సగటున 69 మంది అరెస్ట్ అయ్యారు. ఇదే జోబైడెన్ హయాంలో రోజుకు 230 వరకు అరెస్ట్ అయ్యేవారు. ట్రంప్ అధికారం చేపట్టిన తర్వాత మానవ అక్రమ రవాణా ముఠాలు తమ కార్యకలాపాలను గణనీయంగా తగ్గించాయి. వాస్తవానికి అమెరికా ఎన్నికల్లో హారిస్ ఓటమి దాదాపు ఖాయం అనుకొన్న సమయం నుంచి ఈ ముఠాలు తమ కార్యకలాపాలను తగ్గించినట్లు ఓ ఆంగ్ల పత్రిక వెల్లడించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో తల్లిదండ్రులు వదిలేసిన 500 మైనర్లను అధికారులు అదుపులోకి తీసుకొన్నారు. అమెరికా-మెక్సికో, అమెరికా-కెనడా సరిహద్దుల్లో చాలా మంది తమ పిల్లలకైనా అగ్రరాజ్య పౌరసత్వం వస్తుందన్న ఆశతో వారిని వదిలేసి వెళ్లేవారు. కానీ, ట్రంప్ అధికారం చేపట్టాక ఇలా పిల్లలను వదిలేయడంపై మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. తరచూ ఇక్కడ అధికారులు గుర్తించే పిల్లల వయస్సు 12 నుంచి 17 ఏళ్ల మధ్యలో ఉంటోంది. చాలా అరుదుగా అంతకంటే చిన్నవారు ఉంటున్నారు. ఏప్రిల్ 2024 నాటికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ లెక్కల ప్రకారం అమెరికాలో 2.2 లక్షల మంది భారతీయులు ఎటువంటి పత్రాలు లేకుండా జీవిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి 332 మందిని అక్కడి నుంచి వెనక్కి మిగతా 2లో..

# పాక్‌లో బానిస సర్కార్

- అంతకంటే చీకటి జైలు గదే నయం
- నా సందేశాన్ని ప్రజలకు చేరనివ్వడం లేదు : మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్



**ఇస్లామాబాద్ (జనంసాక్షి) :** పాకిస్థాన్ పాలకులు నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నారని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల పార్లమెంటు చేసిన ఓ చట్ట సవరణను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో స్పందించిన ఆయన.. ఈ బానిసత్వాన్ని అంగీకరించడానికి బదులు జైల్లో చీకటి గదిలో జీవించడానికి ఇష్టపడతానని అన్నారు. తన సందేశాన్ని ప్రజలకు చేరకుండా ప్రభుత్వం అన్నివిధాలా అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపాలని తన మద్దతుదారులకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. "ప్రజాస్వామ్యంలో నాలుగు అంశాలకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఓటుహక్కు చట్టబద్ధ పాలన, నైతికత, స్వేచ్ఛాయుత మీడియా. ఇటీవల చేసిన ఇరవై ఆరవ రాజ్యాంగ సవరణ వీటన్నింటినీ నాశనం చేసింది. జులై 6 తర్వాత.. ఈ నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలని దేశం మొత్తానికి ముఖ్యంగా పీటీఐ కార్యకర్తలకు, మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఈ బానిసత్వాన్ని అంగీకరించడం కంటే జైల్లో చీకటి గదిలోనే జీవిస్తా" అని ఇమ్రాన్ పేర్కొన్నారు. తన సందేశాన్ని ప్రజలకు చేరకుండా ప్రభుత్వం అన్ని విధాలా అడ్డుకుంటోందన్నారు.

పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్పైనా ఇమ్రాన్ ఖాన్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓ నియంత అధికారంలోకి వస్తే.. అతడికి ఓట్లు అవసరం లేదని, ట్రయల్-అండ్-ఎర్రర్ పద్ధతిలో పాలన కొనసాగిస్తాడని విమర్శించారు. అక్కడి మిగతా 2లో..

### ఎట్టకేలకు.. జీఎస్టీ భారం తగ్గింపు యోచనలో కేంద్రం

- త్వరలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం!
- కొన్ని వస్తువులకే పరిమితం చేయనున్న కేంద్రం

9



# మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

- అన్ని బీమా క్లెయిమ్‌లు అందిస్తాం
- క్షతగాత్రుల వైద్య ఖర్చుల బాధ్యత మాదే

- ప్రమాదంలో 40 మంది మృతి.. 33మందికి గాయాలు
- ప్రభుత్వ దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తాం
- కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటన

**సంగారెడ్డి,జులై 2 (జనంసాక్షి) :** పాశమైలారంలో జరిగిన ప్రమాదంపై సిగాచీ కంపెనీ స్పందించింది. పరిశ్రమలో పేలుడు కారణంగా 40 మంది మృతి చెందారని, మరో 33 మంది గాయపడినట్లు పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్ని బీమా క్లెయిమ్ ఇస్తామని స్పష్టం చేసింది. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని సిగాచీ కంపెనీ హామీ ఇచ్చింది. ఈ మేరకు సిగాచీ తరఫున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రమాదంలో 40 మంది మృతి చెందారు. 33 మందికి గాయాలయ్యాయి. మృతుల కుటుంబాలకు పరిశ్రమ నుంచి కోటి పరిహారంతో పాటు అన్ని రకాల బీమా క్లెయిమ్ చెల్లిస్తాం. గాయపడ్డ వారికి పూర్తి వైద్యం అందిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. పరిశ్రమ ప్రమాదంపై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి మిగతా 2లో..

# చైనాకు షాకిచ్చిన దలైలామా

- టిబెట్ బౌద్ధగురువు ఎంపికలో చైనా జోక్యం సహించం
- నా వారసత్వం కొనసాగాలా లేదా అన్నది ప్రజలే నిర్ణయిస్తారు
- సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దలైలామా



**న్యూఢిల్లీ, జులై 2 (జనంసాక్షి) :** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తాజాగా చైనాకు షాక్ ఇచ్చారు. 15వ దలైలామా ఎంపిక పక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.తన వారసత్వం కొనసాగాలా, వద్దా అనే విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని తాను 1969లోనే వెల్లడించినట్లు దలైలామా పేర్కొన్నారు. తాజా అభిప్రాయాల ఆధారంగా గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్ మాత్రమే దలైలామా పునర్జన్మను నిర్ణయిస్తుందని.. ఈ పక్రియలో మరెవరికీ జోక్యం చేసుకొనే అధికారం లేదని తేల్చిచెప్పారు. 2011 మిగతా 2లో..

### ఫార్ములా ఈ కేసు

# అరవింద్‌కు మరోసారి ఏసీబీ తాఖీదులు

### నేడు విచారణకు హాజరుకావాలని ఆదేశం



**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేసింది. 2025, జులై 3వ తేదీ ఉదయం 11.30 గంటలకు విచారణకు రావాలని ఏసీబీ నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అరవింద్ కుమార్‌ను పోలీసులు ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది.

కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిగతా 2లో..



# దేశానికి మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

- తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పునర్వ్యవస్థీకరణ
- పరివాహక ప్రాంత నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- రెవెన్యూ,సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి

2లో..

# మరణ శాసనం రాసింది మీరే..

### బనకచర్లపై దుష్ప్రచారాలు ఆపండి

- అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌ను నిలదీస్తాం
- మాజీమంత్రి హరీశ్ రావు ఆగ్రహం



**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ నీటి హక్కులకు మరణ శాసనం రాసిందే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ప్రజాభవన్ వేదికగా సీఎం రేవంత్, బెజవాడ వేదికగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బనకచర్లకు పచ్చజెండా ఊపారని మండిపడ్డారు. నిజాలు బయటకు వస్తాయనే భయంతోనే.. మంగళవారం జరిగిన పవర్ పాయింట్ ప్రజంటేషనకు కేవలం కాంగ్రెస్ ప్రజాపతినిధులనే పిలిచారని తెలిపారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం మిగతా 2లో..

# తెలంగాణకు తగిన యూరియా ఇవ్వండి



### కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత.. జులై నెల సరఫరా ఆందోళన

**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడే యూరియా సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర మంత్రులు జగత్ ప్రకాశ్ నడ్డా, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు రాసిన లేఖలో యూరియా కొరతను అధిగమించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో తెలంగాణలో యూరియా అవసరం గణనీయంగా పెరిగిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు కేంద్రం 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోటాను నిర్దేశించగా, ఇప్పటి వరకు కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయ్యాయని వెల్లడించారు. దీంతో 1.94 లక్షల టన్నుల యూరియా కొరత ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

జులై నెలకు కేంద్రం 1.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా ప్లాన్ నిర్దేశించినప్పటికీ, అందులో 60 శాతం దిగుమతి యూరియా ఉండటం ఆందోళన కలిగిస్తోందని మంత్రి లేఖలో పేర్కొన్నారు. దిగుమతి యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరే అవకాశం లేదని, రవాణాకు అవసరమైన నౌకల కేటాయింపు ఇంకా జరగలేదని మిగతా 2లో..

### చేనేత కార్మికుల రుణమాఫీకి రూ.33 కోట్లు



- 5.691 మందికి లబ్ధి.. రుణమాఫీ తర్వాత కొత్త రుణాలు
- ఇందిరా మహిళాశక్తి చీరల పథకం

2

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
3 జూలై 2025
తెలంగాణ




# పేదలకు మెరుగైన వైద్యం

చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నామని.. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని.. అందులో భాగంగానే డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని క్యాన్సర్ కేర్ సలహాదారుడిగా నియమించామన్నారు. తెలంగాణ రాష్ట్రం చేపట్టే ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కూడా భాగస్వాములు కావాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల వరకు ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. సమస్య రాకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఉందని.. ఇందుకు సరైన విధానంతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు హెల్త్ ప్రొఫైల్ కార్డును క్రియేట్ చేయాలని భావిస్తున్నామన్నారు. ఒక యూనిక్ ఐడీతో ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఉంటాయని తెలిపారు. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు కేటాయించామని.. రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించామని తెలిపారు. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాని పేర్కొన్నారు. వైద్యులు ఏడాదిలో ఒక నెల రోజులు సామాజిక బాధ్యతగా ప్రభుత్వ ఆసుపత్రులలో సేవలందించాలన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచంలో హైదరాబాద్ కూడా ఒక వేదికగా మారిందని అన్నారు. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి హైదరాబాద్‌కు డైరెక్ట్ కనెక్టివిటీ పెంచేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతున్నామని.. కనెక్టివిటీ పెరిగితే హైదరాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# పాక్‌లో బానిస సర్కార్

న్యాయవ్యవస్థపైనా మాజీ ప్రధాని మాట్లాడారు. కోర్టుల్లో 'ఎంపిక చేసిన' న్యాయమూర్తులే ఉంటున్నారని.. స్వతంత్రంగా వ్యవహరించే వాళ్లు శక్తిహీనులుగా మారిపోతున్నారని అన్నారు. దేశంలో వాక్ స్వాతంత్ర్యం కనుమరుగవుతోందన్న ఇమ్రాన్.. నిజాయతీ గల జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అనేక కేసులు ఎదుర్కొంటున్నారు. 2023 మే 9న ఆయన అరెస్టు అనంతరం లాహోర్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపైనా అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఆగస్టు 2023 నుంచి జైల్లో ఉంటున్న ఆయన.. బెయిల్ కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ చుక్కెదురు అవుతోంది.

# మృతుల కుటుంబాలకు కోటి పరిహారం



లేఖ రాశాం. మూడు నెలల పాటు కంపెనీ కార్యకలాపాలు మూసివేస్తున్నాం. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదు. ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం దర్యాప్తు చేస్తుంది. ప్రభుత్వం దర్యాప్తు నివేదిక కోసం వేచి చూస్తున్నాం' అని సిగాచీ కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదం ఘటనకు సంబంధించి దర్యాప్తుకు సహకరిస్తామని.. నిబంధనలు పాటిస్తాం అని ప్రకటనలో తెలిపింది. ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేయటంతో పాటు వారి కుటుంబాలకు పునరావాసం కల్పిస్తామని వివేక్ కుమార్ పేర్కొన్నారు. 35 ఏళ్లలో ఎలాంటి ప్రమాదం జరగలేదని.. ఇది ఘోర ప్రమాదని పేర్కొన్నారు. 3 నెలల పాటు కంపెనీని తాత్కాలికంగా మూసివేస్తున్నా ప్రకటించారు. కంపెనీని పదేళ్ల క్రితం ఎలాంగో గౌడకు లీజుకు ఇచ్చామని.. కంపెనీ బాధ్యతలు ఆయనే చూస్తున్నారని తెలిపారు. పేలుడు ఘటనలో ఎలాంగో గౌడ చనిపోవటంతో వివరాలు తెలియడం లేదని తెలిపారు. ప్రమాదంపై స్టాక్ ఎక్ఛేంజ్ కు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక సిగాచి కంపెనీపై 4 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కంపెనీ ఉద్యోగి యశ్వంత్ ఇచ్చిన కంప్లైంట్ తో కేసు నమోదయ్యింది. కంపెనీలో వాడుతున్న పాత మిషనరీ కారణంగా పేలుడు సంభవించినట్లు ఎఫ్ఐఆర్ లో పోలీసులు పేర్కొన్నారు.

# బీహార్‌లో బూత్‌స్థాయి ఏజెంట్ల పెంపు

ఇసి పేర్కొంది. ఎస్ఐఆర్ పక్రియ గురించి రాజకీయ పార్టీలతో బుధవారం జరగాల్సిన సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఇసి వర్గాలు తెలిపాయి. భారీ కసరత్తులో సుమారు లక్షమంది శిక్షణ పొందిన బూత్ లెవల్ అధికారులు, 243 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 38 జిల్లా, ఎన్నికల అధికారులు, 9 డివిజన్‌ల కమిషనర్లు,బీహార్ ప్రధాన ఎన్నికల అధికారి సమన్వయంతో లక్షమంది వాలంటీర్లు పాల్గంటారు. ఇసిఐ ద్వారా నమోదు చేసిన గుర్తింపుపొందిన జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీలు ఇప్పటికే పోలింగ్ స్టేషన్లలో 1.5లక్షలకు పైగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకున్నప్పటికీ, పార్టీలు అదనపు బిఎల్ఎలను నియమించడానికి సమయం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. తర్వాత ఫిర్యాదు చేయడం కన్నా ముందుగానే ఎక్కువ మంది బిఎల్ఎలను నియమించాలని ఇసి వర్గాలు తెలిపాయి. ఇదిలావుంటే ప్రజలు తాము ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. తమకు సొంత ఇల్లు వేరే చోట ఉందని అక్కడ ఓటరుగా నమోదు చేసుకోకూడదన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాలను ప్రత్యేకంగా ముమ్మర తనిఖీ చేస్తున్ననేపథ్యంలో ఆయన ఈమేరకు తెలిపారు. నివాసం ఉంటున్న చోటే ఓటు ఉండాలన్న నిబంధన పాటించాలని అన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రజలు తాము ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారో అక్కడ మాత్రమే ఓటుహక్కు పొందాలని తనను కలిసిన బూత్ స్థాయి అధికారులకు సీఈసీ వివరించారు. ఢిల్లీలో నివాసం ఉంటూ పట్నాలో ఇల్లు ఉందని అక్కడ ఓటుహక్కు పొందలేరని పేర్కొన్నారు. ప్రజలు తాము వలస వెళ్లిన చోట ఓటరుగా నమోదు చేసుకోవచ్చుని, కాని పాత నియోజకవర్గంలో ఓటరు కార్డును ఉంచుకోవడం శిక్షార్హమైన నేరమని ఈసీ అధికారులు తెలిపారు.

# మరణ శాసనం రాసింది మీరే..




హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ .. హైదరాబాద్‌లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు. ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీష్‌రావు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. బీఆర్ఎస్ హయాంలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు.

# చైనాకు షాకిచ్చిన దలైలామా

సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..? అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. స్పందించిన వారిలో టిబెట్ మతపెద్దలు, చైనాలోని వారు కూడా ఉన్నట్లు వెల్లడించారు. తన వారసత్వం భవిష్యత్తులో కొనసాగాలని వారంతా కోరుకున్నట్లు తెలిపారు. చాలా ఏళ్ల క్రితం దలైలామా ఒక దశలో తనతోనే ఈ సంప్రదాయం ముగిసిపోతుందని ఆందోళన చెందారు. కానీ, ఆ తర్వాత తన పునర్జన్మ టిబెట్ బయట జరగొచ్చని చెప్పారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే కీలుబొమ్మను దలైలామా వారసుడిగా ఎంపిక చేయాలని చైనా ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది. ఆ ప్రాంతాన్ని 1950లో ఆక్రమించిన చైనా– ఆ తరవాత దాన్ని తన భూభాగంలోకి మార్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసింది. ముఖ్యంగా చైనీస్ మూలాలున్న హన్ జాతి ప్రజలు ఇబ్బడిముబ్బడిగా టిబెట్‌లో స్థిరపడేలా చేసింది. ఆక్రమణ తరవాత లక్షల సంఖ్యలో అక్కడి చిన్నారులను దూర ప్రాంతాలకు తరలించి వారికి బ్రెయిన్ వాష్ చేసింది. అక్కడి పీఠభూమిలో విస్తారంగా బొగ్గు, రాగి, క్రోమియం, లిథియం, జింక్, సీసం, బోరాన్ నిక్షేపాలు ఉండడంతో వాటిపైనా చైనా కన్నేసింది. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావించింది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే పక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

# తెలంగాణకు తగిన యూరియా ఇవ్వండి

వివరించారు.యూరియా కొరత వల్ల ఖరీఫ్ పంటలకు కీలకమైన సమయంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారని మంత్రి తుమ్మల కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కొరత రైతుల పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణ చర్యలతో యూరియా సరఫరాను పెంచాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు. జులై నెలకు కేటాయించిన 0.97 లక్షల మెట్రిక్ టన్నుల దిగుమతి యూరియాకు నౌకలను వెంటనే కేటాయించాలని, ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్–జూన్ నెలల్లో ఏర్పడిన 1.94 లక్షల టన్నుల లోటును భర్తీ చేయడానికి అదనపు కోటాను కేటాయించాలని కోరారు.

# ... పట్టుబడ్డ 10వేల మంది భారతీయులు

పంపారు. భారతీయులు అక్రమ రవాణాదారుల మాటలు విని కఠిన మార్గాల్లో ప్రయాణించి అమెరికాలోకి ప్రవేశించాలనుకొంటారు. భారీ సరిహద్దు గోడ, కంచెలను తప్పించుకొనేందుకు ప్రమాదకరమైన సముద్ర మార్గాన్ని కూడా ఆశ్రయిస్తున్నారు. మే 9వ తేదీన ఇలా ప్రయాణిస్తూ కాలిఫోర్నియాలోని డెల్ మార్ సమీపంలో పడవ బోల్తాపడి భారత్ 14 ఏళ్ల బాలుడు, 10 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ అన్నా చెల్లెళ్లు, ఇలాంటి పడవలు తరచూ మెక్సికో తీరం నుంచి బయల్దేరి అమెరికాలో జలాల్లోకి చొరబడతాయి.

# అరవింద్‌కు మరోసారి ఏసీబీ తాఖీదులు

**నేడు విచారణకు హాజరుకావాలని ఆదేశం**

హైదరాబాద్ లో ఫార్ములా ఈ కార్ రేసింగ్ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని.. నిబంధనలకు విరుద్ధంగా నిధుల చెల్లింపు జరిగిందన్న అభియోగాలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏ1, ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏ2, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3 నిందితులుగా చేర్చారు. ఇప్పటికే కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ విచారించింది. 2025, జూన్ లో కేటీఆర్ ను ఏసీబీ రెండోసారి విచారించింది. కేటీఆర్ ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా ఐఏఎస్ అరవింద్ కుమార్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది.

# ప్రతి విద్యార్థి ఇంటర్ పూర్తి చేయగలగాలి

హైదరాబాద్,జులై 2 **(జనంసాక్షి) :** పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి ఒక్క విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పదో తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తోందని ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున.. ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం లభించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటుందని.. అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఇంటర్మీడియట్ వేరుగా.. 12వ తరగతి వరకు పాఠశాలలు ఉన్న రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం చేసి ఈ విధానంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ విద్య మెరుగుకు అన్ని దశల్లో చర్చించి శాసనసభలోనూ చర్చకు పెడతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టిపెట్టాలన్నారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పాఠశాలల నిర్మాణం పక్రియను వేగవంతం చేయాలని , నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయినందున, రెండో పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ పక్రియపై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నిర్మాణ నమూనాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల పక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిత, జేఎన్టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# సొమాలియాలో హెలికాప్టర్ కూలి ముగ్గురి మృతి

సొమాలియా రాజధాని మొగడిషు విమానాశ్రయంలో బుధవారం మిలిటరీ హెలికాప్టర్ కూలి ముగ్గురు మృతి చెందారు. లోయర్ షెబెల్లే రీజియన్ లోని బల్లిడూగుల్ నుంచి ఎనిమిది మందితో వచ్చిన ఈ హెలికాప్టర్ కూలిపోయిందని మొగడిషు ఏడెన్ అబ్దుల్లే విమానాశ్రయం ఇమ్మిగ్రేషన్ ఆఫీస్ అధిపతి అర్తాన్ మొహమ్మద్ చెప్పారు. అసలు ఈ హెలికాప్టర్ ఉగాండా ఎయిర్‌ఫోర్స్‌కు చెందినది. కానీ ఆఫ్రికన్ పీస్‌మేకింగ్ మిషన్ దీన్ని వినియోగిస్తోంది. ఇంకా మృతులను గుర్తించడానికి దర్యాప్తు సాగుతోందని సొమాలియా సివిల్ ఏవియేషన్ అధారిటీ డైరెక్టర్ జనరల్ అహ్మద్ మొయలిమ్ హస్సాన్ తెలిపారు.

# ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాల విడుదల

**ఉస్మానియా యూనివర్సిటీ :**
ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను విడుదల చేశామన్నారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

# జూలై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ముర్ము ఆమోదించినట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృష్ట్యా, ఆగస్టు 13, 14 తేదీల్లో ఉభయసభలు నడవబోవని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం జరిగే మొదటి పార్లమెంట్ సెషన్ ఇవే కావడం గమనార్హం. ఈ సారి ఈ సారి సమావేశాల్లో గందరగోళం ఉంటుందని భావిస్తున్నారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అలాగే ఆపరేషన్ సిందూర్‌పై చర్చించడానికి ప్రతిపక్షాలు పట్టుబట్టనున్నాయి. దీంతో ఈ సారి పార్లమెంట్ సెషన్‌పై ఆసక్తి నెలకొంది.

# 339 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి

తెలంగాణ విద్యుత్ శాఖ నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్తెలంగాణ ( టీజీ ఎన్పీడీసీఎల్ ) పరిధిలో 339 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిందని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా బుధవారం జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇంత క్రితం ఇంధన శాఖలో 217 మంది జూనియర్‌అసిస్టెంట్‌పోస్టులతో పాటు మరో 216 ఇతర కేటగిరీ పోస్టులు ఉండేవని తెలిపారు. గ్రేడ్%-% 1 డీఎం పోస్టు నుంచి మొదలుకొని స్టోర్ కీపర్ ఉద్యోగి వరకు ఉన్న పోస్టులను క్రోడీకరించి అవసరమైన వాటిని ఉంచుకుని మిగతా వాటిని తొలగించామని, వీటికి మరి కొన్ని పోస్టులు కూడా చేర్చడం ద్వారా ఈ సంఖ్య 339కి చేరిందని సందీప్ కుమార్ సుల్తానియా ఆ ప్రకటనలో తెలిపారు. కాగా ట్రాన్స్కో సంస్థ 2022 సంవత్సరం పే స్కేల్స్‌ను రివైజ్‌చేస్తున్న క్రమంలో ఆర్థిక శాఖ ఈ 339 పోస్టులను అనుమతించడం గమనార్హం.

# దేశానికి మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

- తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పునర్వ్యవస్థీకరణ
- పరివాహక ప్రాంత నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- రెవెన్యూ,సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి



హైదరాబాద్,జులై 2 (జనంసాక్షి) :
ప్రకృతి వైపరీత్యాలను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంత వరకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ఉండేలా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్ అధారిటీని బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దేశానికి ఒక మోడల్‌గా ఉండేలా వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణా సంస్థ ను పునర్‌వ్యస్థీకరించినట్లు వెల్లడించారు. ఈ సంస్థకు గౌరవ ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉంటారని ఇందులో రెవెన్యూ, హోమ్, ఆర్థిక, వైద్య ఆరోగ్యం, భారీ నీటిపారుదల, రహదారులు భవనాలు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ది శాఖల మంత్రులు సభ్యులుగానూ, చీఫ్ సెక్రటరీ మెంబర్ కన్వీనర్‌గాను, రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ప్రత్యేక ఆహ్వానితునిగా ఉంటారని తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గోదావరి మరియు కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణపై ఆయా జిల్లాల కలెక్టర్లు , ఇతర ఉన్నతాధికారులతో చీఫ్ సెక్‌లటరీ కె. రామకృష్ణారావు, విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ 'వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని ఐఎండీతో సమన్వయం చేసుకొని శాస్త్రీయంగా విశ్లేషించుకొని ఎప్పటికప్పుడు పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందించేలా వ్యవస్థను రూపొందించుకోవాలి. సమాచార వ్యవస్థ మరింత బలోపేతం కావాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో వర్షాలు, వరదలకు సంబంధం ఉన్న ఇరిగేషన్, విద్యుత్, హెల్త్, వ్యవసాయం, పోలీస్, రవాణా తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలను మనం అడ్డుకోలేం కానీ వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతాం. ప్రధానంగా కృష్ణా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. దీనివలన మనం నష్టాన్ని తగ్గించిన వారమవుతాం అన్నారు. నదీపరివాహక ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏఏ గ్రామాలు ముంపునకు గురౌతాయోనన్న సమాచారాన్ని నీటిపారుదల శాఖ ముందుగానే అందించాలి. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్థానికంగా పడిన వర్షం వివరాలు, ఎంత నీటిని విడుదల చే?స్తారనే విషయాలు సవివరంగా ఉండాలి. నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులను వరదలు వచ్చిన ప్రతిసారీ సురక్షిత ప్రాంతాలకు తరలించడం కంటే వారికి శాశ్వత నివాసం కల్పించాలి. ఇందుకు సంబంధించి నివాసితుల వివరాలను గుర్తిస్తే అదనపు కోటా కింద ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని తెలిపారు. భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలి. ఈ ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల గత ఏడాది నా నియోజకవర్గం పాలేరులో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిర్ లిఫ్ట్ మెకానిజం ఏవిధంగా ఉండాలి, విపత్తు సంభవించిన ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సెక్రటరీ శివశంకర్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పంచాయితీరాజ్ కమిషనర్ సృజన, సిపి డిసిఎల్ డైరెక్టర్ ముష్రాఫ్ అలీ, వ్యవసాయ సహకార శాఖ డైరెక్టర్ బి. గోపి. ఐఎండీ అధికారిణి నాగరత్నం. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ ముజముల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల రుణమాఫీకి రూ.33 కోట్లు

**హైదరాబాద్, జులై 2:** తెలంగాణలో చేనేత కార్మికులకు రూ.1 లక్ష వరకు రుణమాఫీ కోసం రూ.33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా 5,691 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి హామీ మేరకు, 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు బ్యాంకులు మరియు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి చేనేత వస్త్ర ఉత్పత్తి, వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం తీసుకున్న రూ.1 లక్ష వరకు రుణాలు (అసలు మరియు వడ్డీ కలిపి) మాఫీ అవుతాయని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల వారీగా లబ్దిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే రుణమాఫీ మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

రుణమాఫీ అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే, బ్యాంకులు కొత్త రుణాలను మంజూరు చేస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ సౌకర్యం కార్మికులకు తమ వృత్తిని కొనసాగించడంలో సహాయపడుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.920 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అన్ని ప్రభుత్వ శాఖలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు, ఇందుకు రూ.579 కోట్ల విలువైన ఆర్డర్లు ఇప్పటికే వివిధ శాఖల నుంచి అందినట్లు తెలిపారు.సిరిసిల్లలోని 16,000 మరమగ్గాలకు నిరంతర పని కల్పించేందుకు ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం చేనేత కార్మికులకు ఆర్థిక స్థిరత్వం కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

చేనేత అభయహస్తం మరియు నేతన్నకు చేయూత

రూ.193 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వం చెల్లించని రూ.290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పునరుద్ఘాటించారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# అలకనంద హాస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో మరో నిందితుడు అరెస్ట్




**హైదరాబాద్, జులై 2:** అలకనంద హాస్పిటల్ కిడ్నీ రాకెట్ కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐడీ ఏడీజీపీ చారు సిన్హా తెలిపారు. ఈ కేసులో 16మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుడు విజయనగరానికి చెందిన కోండగోర్రి మురళీ కృష్ణ వివరాలు వెల్లడించారు. అవయవ మార్పిడి ముసుగులో జరుగుతున్న అక్రమాల పై డిప్యూటీ డీఎం అండ్ హెచ్వో ఫిర్యాదు ఆధారంగా సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిపారు. ఏప్రిల్ నెలలో కేసును సీఐడికి బదిలీ చేశారని తెలిపారు. సీఐడీ టీం నిందితుడిని మంగళవారం విజయనగరంలో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తమిళనాడు నుంచి అమాయకులను, ఆర్థికంగా వెనుకబడిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని అవయవ దానం పేరుతో అక్రమాలకు పాల్పడ్డ గుర్తించిన్నట్లు తెలిపారు. బెంగుళూరుకు చెందిన ప్రదీప్ , పవన్ అతని సహచరులు సహాయంతో అక్రమ కిడ్నీ మార్పిడిని నిర్వహించిన్నట్లు వెల్లడించారు. ప్రతి అక్రమ మార్పిడికి నిందితులకు రూ. 10 లక్షల కమిషన్ తీసుకునే వారని, అందులో రూ. 4–5 లక్షలు దాతలకు ఇవ్వబడ్డయని దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుడి నుంచి బీఎండబ్ల్యూ కారు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని జుడీషియల్ రిమాండ్ కోసం బుధవారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు.

# తెలంగాణలో విస్తారంగా వర్షాలు

### అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండురోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం సైతం పడనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. విత్తనాలు వేసి వర్షం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న రైతులకు ఇది శుభవార్త అనే చెప్పాలి. ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గురువారం వర్షాలు కురవనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30-40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీయనున్నాయి. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడనుంది. రాష్ట్రంలో ఉరుములతో కూడిన వర్షం పడనున్న నేపథ్యంలో జనాలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. మంగళవారం మహబూబాబాద్ జిల్లా గార్లలో 85.3 మిమీ వర్షం కురిసింది. భద్రాద్రి జిల్లా బుర్గంపహాడ్‌లో 72.3 మిమీ, ఖమ్మం జిల్లా సింగరేణి ప్రాంతంలో 62 మిమీ వర్షం పడింది. జీహెచ్ఎంసీ పరిధిలోని సెంట్రల్ / సౌత్ సిటీలో మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. షేక్‌పేట 43.8 మిమీ, బంజారాహిల్స్ 43 మిమీ, ఖైరతాబాద్ 40 మిమీ, గన్‌ఫౌడ్రీ 37 మిమీ, మలక్‌పేట 37 మిమీ వర్షం కురిసింది.

# నెలరోజుల్లో నివేదిక అందించండి

### సిగాచి పేలుడు ఘటనపై నిపుణుల కమిటీ ఆదేశం

**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పేలుడు ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో సభ్యులుగా చీఫ్ సైంటిస్ట్ టి. ప్రతాప్‌కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, పుణెకి చెందిన భద్రతాధికారి సంతోష్ ఘుగే ఉన్నారు. పాశమైలారం ప్రమాదానికి గల కారణాలతో పాటు కర్మాగారాల భద్రతా నియమావళి పాటించారా? లేదా? అనే అంశాలను కమిటీ తెలుసుకోనుంది. ఈ ఘటనపై నెలరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. భవిష్యత్తులో రసాయన కర్మాగారాల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని ప్రభుత్వం కోరింది. ఈ కమిటీకి డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సహకారం అందించాలని ఆదేశించింది.మరోవైపు సిగాచి

పరిశ్రమ వద్దకు మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ పరిశ్రమ ప్రతినిధులు వెళ్లారు. ఘటనాస్థలం నుంచి శిథిలాల తరలింపు ప్రారంభమైంది. ఈ కమిటీలో బి.వెంకటేశ్వర్,(ఏమిరేట్ సైంటిస్ట్) చైర్మన్‌గా, ప్రతాప్ కుమార్ చీఫ్ సైంటిస్ట్, డా. సూర్యనారాయణ (రిటైర్డ్ సైంటిస్ట్), సంతోష్, సేఫ్టీ ఆఫీసర్ పూణె సభ్యులుగా ఉన్నారు. ఈ ప్రమాదంపై నెల రోజుల్లో దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 40 మంది మృతి చెందారని, 33 మందికి గాయాలైనట్టు కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంతో పాటు అన్ని రకాల బీమా క్లెయిమ్‌లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇక, ఘటనాస్థలాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఫ్యాక్టరీలో బీహార్, ఎంపి, ఎపి, ఒడిశా ప్రాంతాలకు చెందినవారు పని చేస్తున్నట్టు తెలిసిందని అన్నారు. యాజమాన్యంతో చర్చించి, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు, వికలత్వం సంభవించి విధులకు వెళ్లలేని వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడి పని చేసుకోగలిగిన వారికి ఐదేసి లక్షలు పరిహారం అందేలా చూస్తామని అన్నారు. ఈ దుర్ఘటనలో క్షతగాత్రులకు అయ్యే వైద్య ఖర్చులన్నీ నూటికి నూరు శాతం తమ ప్రభుత్వం భరిస్తుందని భరోసా ఇచ్చారు.

# ఫార్మా భూములపై కాంగ్రెస్ గద్దలు

### అడ్డంగా దోచుకుంటున్న నేతలు

### రైతులను మోసం చేస్తున్నా పట్టించుకోరా: కెటిఆర్



**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** హైదరాబాద్ ఫార్మాసిటీ భూములను కాంగ్రెస్ పార్టీ నేతల దోపిడి చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవగానే ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి, భూములను రైతన్నలకు తిరిగి ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని కేటీఆర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, తమ కాంగ్రెస్ లీడర్లతో కలిసి ఫార్మా సిటీ భూములను కొట్టేస్తున్నారు. ఫార్మా సిటీ భూములపై కాంగ్రెస్ నేతలు గద్దల మాదిరి వాలి దోచుకుం టున్నారు. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతన్నలకు నష్టపరిహారంగా కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ నేతలు తమ పేర్లపై అక్ర మంగా రిజిస్ట్రేషన్ చేసు కుంటున్నారు. రైతన్నలకు దక్కాల్సిన ఇండ్ల స్థలాలను అతి తక్కువ రేట్లకు బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకుం టున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు మరిచి పోయి, ఇప్పుడు రైతులకు ఇవ్వాల్సిన భూములను కాంగ్రెస్ నేతలు స్వాధీనం చేసుకుంటున్నారన్న ఆరోపణ లు చేశారు. కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్‌లో, 'రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇప్పటి వరకు హక్కుగా రావాల్సిన ఇంటి స్థలా లను ఇవ్వలేదు. మీర్‌ఖాన్‌పేట లేఅవుట్‌లో పొజిషన్ ఇవ్వడమైతే ఫలించలేదని గుర్తు చేశారు.రాష్ట్ర అభివృద్ధికి తమ భూములిచ్చిన రైతన్నలను వదల కుండా, నష్టపరిహారంగా ఇచ్చే భూముల్ని కూడా దోచుకుంటున్న తీరు సిగ్గుచేటు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు.

# రూ.110 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులు

### మహా జాతర తేదీల ప్రకటన పట్ల మంత్రి సీతక్క హర్షం

### పూజారుల సంఘానికి ధన్యవాదాలు తెలిపిన మంత్రి

**హైదరాబాద్, జులై 02 (జనంసాక్షి) :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం మహా జాతర తేదీలను పూజారుల సంఘం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తేదీలను ప్రకటించిన పూజారుల సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. కోట్ల మంది భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి సీతక్క ప్రకటించారు. ఇప్పుడు మహాజాతర తేదీలను ప్రకటించడంతో పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రూ.110 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరగనుంది. 28న సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలకు వస్తారు. 29న సమ్మక్క తల్లి చిలకలగుట్ట నుంచి గద్దెలకు చేరుకుంటారు. 30న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. 31న సాయంత్రం 6 గంటలకు అమ్మవార్ల వనప్రవేశం తో జాతర ముగుస్తుంది. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహా జాతర ఏర్పాట్లను మంత్రి సీతక్క పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహిస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారు. మేడారంలో శాశ్వత అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు.



### మేడారం సమ్మక్క జాతర తేదీలు ఖరారు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల మహా జాతర తేదీలు ఖరారయ్యాయి. మేడారం మహా జాతర 2026 తేదీలను కోయ పూజారులు ప్రకటించారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగనుంది.మేడారంలో 2026లో నిర్వహించే శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర తేదీలను పూజారులు ఖరారు చేశారు. జాతర తేదీలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రకటించారు. బుధవారం మేడారంలోని ఎండోన్‌మెంట్ కార్యాలయంలో పూజారులు, పుర ప్రజలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడారు.2026 జనవరి 28వ తేదీ నుంచి మేడారం జాతర ప్రారంభం అవుతుందని తెలిపారు. 28న బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుండి సారలమ్మ, పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజు, కొండాయి నుండి గోవిందరాజులను గద్దెలపైకి తీసుకొస్తారని, జనవరి 29వ సాయంత్రం చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని గద్దె మీదకు తీసుకొస్తారని తెలిపారు. అదేవిధంగా జనవరి 30వ తేదీన వన దేవతలకు మొక్కులు చెల్లింపులు, జనవరి 31వ తేదీన తల్లుల వన ప్రవేశం ఉంటుందని ప్రకటించారు. అనివార్య కారణాల రీత్యా 2024 జాతర తేదీలను 9 నెలల ముందుగానే ప్రకటించారు. నాలుగు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. ఆపై 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని కోయ పూజారులు వెల్లడించారు. ఈ జాతరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూజారులు కోరుతున్నారు. కాగా.. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం జాతర జరుగుతుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ జాతరను నిర్వహిస్తుంటారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది.

# రాష్ట్రానికి సరిపడా యూరియాను కేంద్రం ఇచ్చింది

### ఇప్పటికే 12 లక్షల టన్నుల యూరియా పంపింది

### మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రబీ సీజన్ కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 12 లక్షల టన్నుల యూరియా పంపిణీ చేసిందని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. నిజానికి ఈ సీజన్ కోసం రాష్ట్ర రైతాంగానికి సరిపోగా దాదాపు 1.5 లక్షల టన్నుల యూరియా మిగులుతుందని ఆమె అన్నారు. ఇంకా అదనంగా అవసరం అయితే ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ సిద్ధంగా ఉందని ఆమె అన్నారు. డీఏపీ కోటా 1.50 లక్షల మెట్రిక్ టన్నులు కాగా కేంద్ర ప్రభుత్వం 1.72 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేసిందని అరుణ పేర్కొన్నారు. 2014 నుంచి ఇప్పటి దాకా 12 లక్షల కోట్ల కు పైగా ఎరువుల సబ్సిడీ రూపం లో కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసిందని ఆమె చెప్పారు.

# శంషాబాద్‌లో వర్షాలతో మేఘావృతం

### విమానాలకు ప్రతికూల వాతావరణం

**హైదరాబాద్, జులై2 (జనంసాక్షి) :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో నిన్న సాయంత్రం నుంచి కుండపోత వర్షం కురుస్తోన్న సంగతి తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రి ప్రతికూల వాతావరణం ఏర్పడడం కారణంగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల ల్యాండింగ్‌కు అధికారులు అనుమతివ్వలేదు. దీంతో కొన్ని విమానాలు బెంగళూరు, విజయవాడ వైపు మళ్లించారు. లక్నో, కోల్‌కతా, ముంబై, జైపూర్ నుంచి వచ్చే విమానాలను బెంగళూరు ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. బెంగళూరు నుంచి హైదరాబాద్ వచ్చే ఫ్లైట్‌ను విజయవాడకు మళ్లించారు. ఇక బుధవారం ఉదయం నాటికి వాతావరణం అనుకూలంగా ఉండడంతో.. అన్ని విమానాలు యథావిధిగా కొనసాగుతున్నాయని శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

# పాశమైలారం ఘటనపై దర్యాప్తు చేపట్టాలి: ఓవైసీ



**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లాలోని సిగాచీ ఫార్మా కంపెనీలో పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు మరణించిన ఘటనపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అదొక దురదృష్టకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ ఘటనలో 38 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది బాధాకరమైన ఘటన అని అన్నారు. మృతుల్లో ఎక్కువగా జార్ఖండ్‌కు చెందిన వారు ఉన్నారని తెలిపారు. గుర్తించలేనంతగా కాలిపోయిన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సందర్శించిన తర్వాతనైనా ఘటనపై వేగంగా దర్యాప్తు జరుగుతుందని ఆశిస్తున్నానని అన్నారు. ఈ ప్రమాదంలో సిగాచీ ఫార్మా ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పిదం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ఒవైసీ డిమాండ్ చేశారు. కాగా సిగాచీ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలిపేయి పెద్ద సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది.

# ఎపి కేడర్ ఐపిఎస్ సిద్దార్థ కౌశల్ రాజీనామా

### వ్యక్తిగత కారణాలతో తప్పకుంటున్నట్లు వెల్లడి



**అమరావతి, జులై 2 (జనంసాక్షి) :** తాను ఐపీఎస్‌కి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు సిద్దార్థ్ కౌశల్ బుధవారం అమరాతిలో వెల్లడించారు. తన రాజీనామా లేఖను డీజీపీకి పంపినట్లు ఆయన తెలిపారు. తాను ఐఐఎం విద్యార్థినని.. ఈ నేపథ్యంలో తనకు మంచి ఆఫర్ రావడంతో ఈ ఐపిఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సిద్దార్థ్ కౌశల్ వివరణ ఇచ్చారు. తాను ఒత్తిళ్ల కారణంగా ఈ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు వస్తున్న వార్తల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. తనపై వస్తున్న వార్తలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. కుటుంబ సభ్యులతో చర్చించిన తరువాతే ఉద్యోగానికి రాజీనామా చేయాలని తాను నిర్ణయానికి వచ్చానని కౌశల్ వెల్లడించారు. ఇక ఆంధ్రప్రదేశ్.. తన సొంత రాష్ట్రంగా పరిగణిస్తానని ఆయన చెప్పుకొచ్చారు. తనకు సేవ చేసేందుకు అవకాశం ఇచ్చిన ఏపీ ప్రభుత్వానికి, సీనియర్లకు, సహచరులకు ఈ సందర్భంగా సిద్దార్థ్ కౌశల్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సైతం సమాజానికి సేవ చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

# మంత్రి జూపల్లికి ఓయూ విద్యార్థి నేతల వినతి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో జరిగిన నేషనల్ సెమినార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఓయూ విద్యార్థి నేతలు విద్యారంగ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు.గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్స్,స్కాలర్షిప్ నిధులు విడుదల చేయాలని, పీహెచ్‌డీ సీట్లను పెంచాలని,వర్సిటీలో ఖాళీల్లో కేవలం 249 పోస్టులే భర్తీ చేస్తామనడం అన్యాయమని,సంవత్సరాలగ రిక్రూట్‌మెంట్ లేక 1200కు పైగా ఉన్న ఖాళీలను వెంటనే భారీ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని వినతిలో పేర్కొనగా, మంత్రి సానుకూలంగా స్పందించారు.కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆజాద్,కార్యదర్శి యాదగిరి,తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ ఓయూ ప్రెసిడెంట్ నూకల మధు యాదవ్,లా స్టూడెంట్స్ జేఏసి బెల్లం ఉదయ్ వివిధ విద్యార్థి సంఘాల నేతలు నరేష్, ప్రశాంత్, సంతోష్,శ్రీధర్,అశ్వణ్,కళ్యాణ్ పాల్గొన్నారు.

# సెట్విన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తాం

### రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల రావు తో కలిసి రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోతిగల్లి శిక్షణ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కేంద్రంలో నిర్వహింపబడుతున్న కోర్సుల వివరాలు, నిరుద్యోగ యువతకు అందిస్తున్న శిక్షణ, శిక్షణ అనంతరం వారికి జాబ్ మేళ ద్వారా ఉద్యోగ అవకాశాలను అందిస్తున్న తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. త్వరలో మరి కొన్ని కేంద్రాలలో సెట్విన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కోర్సుల్లో మార్పులు తీసుకువస్తూ సెట్విన్ సంస్థ ఇతర సంస్థలకు తీసిపోని విధంగా ముందడుగు వేస్తూ యువతకు ఎక్కువ ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభించాలనే సంకల్పంతో అతి తక్కువ ఫీజుతో దేశవిదేశాల్లో విపరీతంగా డిమాండ్ ఉన్న రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్ ఎలక్ట్రిషియన్ డీజిల్ మెకానిక్ ఆటో ఎలక్ట్రిషియన్ మొబైల్ సర్వీసింగ్ సీసీ కెమెరా వంటి కోర్సుల్లో నాణ్యమైన శిక్షణ అందిస్తూ నిరుద్యోగ యువతీ యువకులకు విజయతీరాలవైపు వెళ్లేందుకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. మోతిగల్లి శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం పురాని హవేలీ లోని సెట్విన్ ప్రధాన కార్యాలయంలో సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు. సూపరింటెండెంట్ రాధా కృష్ణ, ట్రైనింగ్ ఇంచార్జి ఎం. నవీన్ కుమార్, మోతిగల్లి శిక్షణ కేంద్రం ఇంచార్జి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వీసా విద్యార్థులకు మరో గండం

### పరిమిత కాల వీసాలను విధించే యోచనలో ట్రంప్




**వాషింగ్టన్, జులై 2 (జనంసాక్షి) :** అమెరికాలో చదువుల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థులకు అగ్రరాజ్యం మరో షాక్ ఇవ్వబోతోంది. అగ్రరాజ్యంలో ఉంటున్న విదేశీ విద్యార్థులపై మరో ఆంక్షల కత్తి వేలాడుతోంది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలుచేస్తోన్న అగ్రరాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. విద్యార్థి వీసాలకూ పరిమిత కాల గడువు విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు చేసింది. దీంతో విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు పట్టుకుంది. దీనిప్రకారం చదువుకునే సమయం వరకే వీసా అనుమతులు ఉండనున్నాయి. ఈ ప్రతిపాదన లపై న్యాయ నిపుణులు, విద్యార్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ మార్పుల వల్ల విద్యార్థులపై అదనపు భారం పడుతుందని, అనవసరపు గందరగోళానికి దారితీస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ విద్యార్థులపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రస్తుతం 3.3లక్షల మందికి పైగా భారతీయులు అమెరికా వర్సిటీల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాలనుకుంటే లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండే ఛాన్స్ ఇంతవరకు ఉంది. . ఎక్స్ఛేంజ్ విజిటర్స్‌గా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే, ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్ వీసా సిస్టమ్‌లో మార్పులు తీసుకొచ్చేందుకు ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ విభాగం సిద్ధమైంది. విద్యార్థి వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరుచేయాలని ప్రతిపాదించింది. అంటే, ఇకపై విద్యార్థి వీసాలకు కూడా టైం లిమిట్ విధించనున్నారు. దీంతో గడువు తీరిన తర్వాత వీసా పొడిగింపునకు విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలను సమీక్షించేందుకు ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బ్జడెట్ విభాగానికి పంపించారు. అనంతరం దీన్ని ఫెడరల్ రిజిస్ట్రీలో పబ్లిష్ చేస్తారు. ఆ తర్వాత ప్రతిపాదనలపై 30 లేదా 60 రోజుల వరకు ప్రజాభిప్రాయాలను స్వీకరించి తుది నిర్ణయం తీసుకుంటారు. ప్రజల నుంచి ఎలాంటి అభిప్రాయాలు తీసుకోకుండానే తక్షణమే అమల్లోకి వచ్చేలా దీనిపై మధ్యంతర ఉత్తర్వులు కూడా జారీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# ఐదేళ్ల వరకు నేనే ముఖ్యమంత్రిని

### మార్చడానికి బిజెపి, జెడిఎస్‌లు కాంగ్రెస్ అధిష్టానమా

### మీడియా సమావేశంలో వెల్లడించి సిఎం సిద్ధరామయ్య

### సిద్దరామయ్యకు మద్దతు ఇవ్వడం నా విధి అన్న డికె శివకుమార్



**బెంగళూరు, జులై 2 (జనంసాక్షి) :** కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. 'నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయని బుధవారం మీడియాకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు భాజపా, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. సిఎంకు అండగా ఉండటం తప్ప నాకు మరో గత్యంతరం లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలని అన్నారు. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్.రాజన్న కూడా ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తృత చర్చ నడిచింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది. అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే.

## భవిష్యత్తుకు ప్రగతిపథం బాటలు వేసే విద్యా విధానం కావాలి



**విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యారంగం, నేడు అనేక సవాళ్లతో సతమతమవుతోంది. వ్యాపార కేంద్రాలుగా మారిన విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, కేవలం మార్కులు, ర్యాంకులకు ప్రాధాన్యతనిస్తూ జ్ఞాన వికాసాన్ని నిర్లక్ష్యం చేయడం వంటివి ప్రస్తుత విద్యావిధానంలోని లోపాలు. ఈ నేపథ్యంలో, సమూలమైన మార్పులు ఆవశ్యకం.**

**వ్యాపారీకరణకు అడ్డుకట్ట, నాణ్యతకు పెద్దపీట**

ప్రస్తుతం, విద్య అనేది ఒక వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేటు విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తూ, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయి. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలి. విద్యను మళ్లీ ఒక సేవా దృక్పథంతో చూడాలి. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆధునిక బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా వాటిని బలోపేతం చేయాలి. తద్వారా, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించి, ఒకే విధానంలో విద్యా బోధన జరిగేలా చూడాలి.

**జ్ఞాన వికాసానికి, వృత్తి నైపుణ్యాలకు ప్రాధాన్యత**

నేటి విద్యావిధానం కేవలం మార్కులు, ర్యాంకుల చుట్టూ తిరుగుతోంది. ఇది విద్యార్థులపై అనవసరమైన ఒత్తిడిని పెంచుతోంది తప్ప, వారికి నిజమైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించడం లేదు. నూతన విద్యా విధానంలో జ్ఞాన వికాసానికి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సిద్ధాంత పరిజ్ఞానంతో పాటు, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించే వృత్తి విద్యా వర్క్‌షాప్‌లు కలిగిన విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. ఇది విద్యార్థులను భవిష్యత్తులో ఉద్యోగాలకు సిద్ధం చేయడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.

**ఆవిష్కరణాత్మక బోధనా పద్ధతులు, ఉపాధ్యాయుల శిక్షణ**

బోధనా పద్ధతులలో గణనీయమైన మార్పులు అవసరం. కేవలం బట్టీపట్టే విధానానికి స్వస్తి పలికి, ఆవిష్కరణాత్మక, సృజనాత్మక పద్ధతులను ప్రోత్సహించాలి. విద్యార్థులకు ఆసక్తి పెంపొందించే విధంగా, ఆడుతూ పాడుతూ విజ్ఞాన వికాసానికి దోహదం చేసేలా విద్యా సంస్థలు ఉండాలి. దీనికి అనుగుణంగా, ప్రతి ఉపాధ్యాయునికి అవసరమైన ఆధునిక శిక్షణను అందించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో సమర్థవంతంగా వినియోగించుకునేలా ఉపాధ్యాయులను తీర్చిదిద్దాలి. బోధన అనేది కేవలం సమాచారాన్ని అందించడం కాకుండా, విద్యార్థులలో ఆలోచనా శక్తిని, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించేదిగా ఉండాలి.

**తల్లిదండ్రుల భాగస్వామ్యం, బంగారు భవిష్యత్తు**

నూతన విద్యా విధానం విజయవంతం కావాలంటే, తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం. కేవలం పాఠశాలపైనే భారం వేయకుండా, తల్లిదండ్రులు తమ వంతు బాధ్యతగా తమ పిల్లలకు సరైన విద్యావకాశాలు కల్పించాలి. పిల్లల అభిరుచులను గుర్తించి, వారిని ప్రోత్సహించాలి. విద్యార్థులు పాఠశాలలోని అన్ని కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేలా చూడాలి. ఇంటి వద్ద కూడా నేర్చుకునే వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి. నూతన విద్యా విధానం అనేది కేవలం పుస్తకాల బరువును తగ్గించడం కాదు, విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం మాత్రమే కాదు. అది వారిని జ్ఞానవంతులుగా, నైపుణ్యవంతులుగా, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే సమగ్ర ప్రణాళిక. ఈ మార్పులు సాకారమైతేనే, భవిష్యత్ తరాలకు నిజమైన ప్రగతిని అందించినట్లవుతుంది.

**దండంరాజు రాంచందర్ రావు**
**పాత బోయినపల్లి, 9849592958**

## అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం.. ఓ విశ్లేషణ

***జూలై 8, 2025న ట్రంప్ భారతదేశానికి అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం గడువు విధించింది.ఈ నేపథ్యంలో, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత బృందం, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామీసన్ గ్రీర్ నేతృత్వంలోని అమెరికా బృందంతో వాషింగ్టన్ లో రెండు రోజుల చర్చలు జరిపింది. గోయల్ రెండు రోజుల క్రితం భారత్ కు తిరిగి వచ్చారు.మన వాణిజ్య కార్యదర్శి, ఇంకా అమెరికాలోనే ఉన్నారు. అయితే, ట్రంప్ ఏకపక్షంగా భారతదేశంతో ఒక పెద్ద వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. దీనిలో భారతదేశ మార్కెట్ ను మరింత "తెరవాలని" స్పష్టమైన సందేశం(ఆదేశం ) ఇచ్చారు. అందులో వివరాలు ఇంకా స్పష్టంగా వెల్లడి కాలేదు. అయితే ఇది మే 10న అమెరికా మధ్యవర్తిత్వంలో భారత్-పాక్ శాంతి ఒప్పందం కోసం ట్రంప్ ప్రకటనకు కొనసాగింపుగా ఉంది.***

ఈ ఒప్పందం ద్వారా మోదీ సామ్రాజ్యవాదానికి లొంగిపోయే దురదృష్టకరమైన వైఖరిని మరోసారి బహిర్గతం చేస్తుంది. అమెరికా... భారతదేశంపై 26 శాతం స్టీల్ మరియు అల్యూమినియం సుంకాలు విధించడంతో పాటు, భారత మార్కెట్‌కు అడ్డంకులు లేని ప్రవేశం కోసం ట్రంప్ ఏప్రిల్ 2న "రక్షణాత్మక కార్యనిర్వాహక ఉత్తర్వు" ద్వారా "పరిమాణాత్మక పరిమితులను" విధించారు. యూరోపియన్ యూనియన్, కెనడా వంటి పాశ్చాత్య సామ్రాజ్యవాద శక్తుల నుండి తూర్పున చైనా వరకు, లాటిన్ అమెరికాలోని మెక్సికో, ఆఫ్రికన్ దేశాలు వంటి దాదాపు అన్ని దేశాలు ట్రంప్ యొక్క ఏకపక్ష సుంకాలకు వ్యతిరేకంగా తక్షణ ప్రతీకార చర్యలను ప్రకటించాయి. (వెన్నెముక లేని మోదీ సర్కారు తప్ప). చైనా అమెరికా పై తన ప్రతీకార సుంకాలను ప్రకటించి అమెరికా కొమ్ములు ఒంచింది.ఆ తర్వాత, విధిలేని పరిస్థితుల్లో ట్రంప్ సర్కారు అవమానకర రీతిలో రెండు రౌండ్ల వాణిజ్య చర్చల ద్వారా చైనాతో స్టెప్ దిగివచ్చి ఒప్పందం కుదుర్చుకోవలసి వచ్చింది. మన స్వయం ప్రకటిత "విశ్వగురు" మోదీ వాణిజ్య బృందం మాత్రం, "మేక్ ఇన్ ఇండియా", "ఆత్మనిర్భర్ భారత్" వంటి రొటీన్ ఉపన్యాసాలతో, ట్రంప్ యొక్క ఏకపక్ష సుంకాలపై లొంగుబాటు దోరణి లో తల దించుకుని ఇప్పటి వరకు మౌనం గానే ఉంది.

ఈ వాణిజ్య ఒప్పంద నివేదికల ప్రకారం... భారతదేశం టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, చర్మ ఉత్పత్తులు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, ద్రాక్ష, గింజలు, అరటిపండ్ల వంటి శ్రమాధార రంగాలపై అదనపు 26 శాతం సుంకాల నుండి మినహాయింపు కోసం అమెరికాను వేడుకుంటోంది. అయితే, అమెరికా హై-టెక్ సాఫ్ట్‌వేర్‌లు, పారిశ్రామిక ఉత్పత్తులు, ఆటోమొబైల్స్, విద్యుత్ వాహనాలు, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, వైన్, ఆపిల్స్, ట్రీ నట్స్, డైరీ, జన్యుపరంగా సవరించిన పంటలు వంటి వాటిపై సుంకాల సమీకరణలను తనకు లాభదాయకంగా వరల్డ్ వాణిజ్య నిబంధనలకు విరుద్ధంగా సాధించాలని భారత్ పై వాణిజ్య ఆంక్షలు విధించి అధిక లాభాలు పొందాలని చూస్తోంది. అందులో భాగంగా... ఈ ఒప్పందం 2025లో %వి%191 బిలియన్ల నుండి 2030 నాటికి %వి%500 బిలియన్లకు భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త వాణిజ్య ఒప్పందం జూలై 8, 2025 నాటికి పూర్తి వివరాలతో ప్రకటించబడుతుందని భావిస్తున్నారు.

అయితే, స్వతంత్ర అంతర్జాతీయ వాణిజ్య పరిశీలకుల అభిప్రాయం ప్రకారం, ట్రంప్ యొక్క తాజా "భారత మార్కెట్ ను మరింత తెరవాలని" పేర్కొన్న వాదన ఆధారంగా, మోదీ ప్రభుత్వం తన గత రికార్డు ప్రకారం అమెరికా ఉత్పత్తులను భారతదేశంలో డంపింగ్ చేయడానికి రెడ్ కార్పెట్ వేస్తోంది. అమెరికా సామ్రాజ్యవాద ఆదేశాలకు లొంగిపోతూ, మెటా, గూగుల్ వంటి సిలికాన్ వ్యాలీ టెక్ దిగ్గజాలకు కూడా "వ్యాపార సౌలభ్యం" కల్పించే పెట్టుబడిదారుల స్నేహపూర్వక చర్యలను అమలు చేస్తోంది. ఈ చర్యల ఫలితంగా భారతదేశ ఔషధ పరిశ్రమలకు భారీ దెబ్బ తగలనుంది. అలాగే డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి "ఫ్రంటియర్



టెక్నాలజీల" రంగంలో భారతదేశం యొక్క కష్టసాధ్యమైన ప్రయత్నాలు మరింత దెబ్బతినే అవకాశం ఉంది.

అమెరికా విధించిన వాణిజ్య ఒప్పందం వల్ల మొదట నష్టపోయే బాధితులు రైతులే. సోయాబీన్, మొక్కజొన్న, ఆపిల్స్, డైరీ వంటి వాటిపై సుంకాల తగ్గింపు వల్ల మన దేశ రైతు సమాజం తీవ్రంగా నష్టపోనుంది.భారత్ " ప్లానింగ్ కమిషన్‌ను భర్తీ చేసిన ప్రో-కార్పొరేట్ థింక్-ట్యాంక్ "నీతి ఆయోగ్", "కొత్త అమెరికా వాణిజ్య రెజిమ్ కింద భారత్-అమెరికా వ్యవసాయ వాణిజ్యాన్ని ప్రోత్సహించడం" అనే తన ఇటీవలి వర్కింగ్ పేపర్‌లో, వాణిజ్య అసమతుల్యతను తగ్గించడానికి అమెరికా నుండి సోయాబీన్ ఆయిల్ దిగుమతులపై సుంకం తగ్గించడానికి ఆమోదాన్ని తెలిపింది. దీనిని సోయాబీన్ ప్రాసెసర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్.ఓ.పీ.ఏ.) గట్టిగా ఖండించింది. ఎందుకంటే ఇది స్థానిక సాగును ఆర్థికంగా అసాధ్యం చేస్తుంది. మొక్కజొన్న, నూనె గింజలు, ద్రాక్ష, డైరీ ఉత్పత్తులు, జన్యుపరంగా సవరించిన గింజలపై సుంకాల తగ్గింపు అలాగే అమెరికా వ్యవసాయ వ్యాపార బహుళజాతి సంస్థలకు భారత మార్కెట్‌లో స్వేచ్ఛాయుత ప్రవేశం భారత వ్యవసాయానికి మరణ ఘంటికలను మోగిస్తుంది.అయినా మోదీ ప్రభుత్వం ట్రంప్ సర్కారుతో లొంగిపోయి వ్యవహరిస్తుంది. ఇది ముమ్మాటికీ భారత రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టడమే.

ఇది 2020 సెప్టెంబర్‌లో కోవిడ్ మహమ్మారి ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు మోదీ వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఆదేశాల ప్రకారం అమలు చేసిన మూడు దుర్మార్గపు వ్యవసాయ చట్టాలను గుర్తు చేస్తుంది.ఇది మరింత భయానకమైనది. ఇటీవలి భారత్-అమెరికా పౌర అణు ఒప్పందం, ఇది ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంతో పరోక్షంగా సంబంధం కలిగి ఉంది. ఎందుకంటే రెండూ అమెరికా-భారత భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయి. భారతదేశం క్రమంగా అమెరికాకు లొంగిపోయిన దేశంగా మారుతుంది. భారత్-అమెరికా పౌర అణు ఒప్పందం (123 ఒప్పందం) యొక్క ప్రకటిత లక్ష్యం భారతదేశం యొక్క పెరుగుతున్న విద్యుత్ శక్తి అవసరాలను తీర్చడం, సాంకేతిక సహకారాన్ని పెంపొందించడం అలాగే వివిధ రంగాలలో అమెరికా-భారత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం. ఈ దుర్మార్గపు చర్యను సులభతరం చేయడానికి, మోదీ ప్రభుత్వం అణు శక్తి చట్టంలో సవరణలు కూడా చేసి, భారతదేశ పౌర అణు పరిశ్రమలో ప్రైవేటు రంగ పెట్టుబడులకు అనుమతించడం. అంతే కాదు... ఒకవేళ "అణు ప్రమాదం జరిగిన సందర్భంలో విదేశీ అణు విద్యుత్ ప్లాంట్ విక్రేతలను బాధ్యత నుండి విముక్తి చేయడానికి" ... పౌర అణు నష్ట బాధ్యత చట్టంలో సవరణలు చేయడానికి భారత్ కట్టుబడింది.ఇలాంటి దుర్మార్గమైన ఒప్పందాన్ని ఏదేమైనా చేసుకుంటుందా? భారత ప్రజల ప్రాణాలు అంటే అంత లెక్కలేని తనమా!!?

మోదీ ప్రభుత్వం యొక్క 2025 బడ్జెట్ ప్రతిపాదనలు కూడా విదేశీ అణు సంస్థలకు చిన్న మాడ్యులర్ రియాక్టర్ల నిర్మాణాన్ని అనుమతిస్తాయి, ఇందుకు అమెరికా నియంత్రణలోని వరల్డ్ బ్యాంక్ అణు ప్లాంట్లకు నిధులు సమకూర్చాలని నిర్ణయించడం ముందస్తు చర్యగా ఉంది. ఇవన్నీ "అమెరికా-భారత శక్తి భద్రతా భాగస్వామ్యం" కోసం మోదీ రెజిమ్ యొక్క దృఢమైన నిబద్ధతను సూచిస్తాయి. ఇందులో చమురు, గ్యాస్ మరియు పౌర అణు శక్తి కూడా ఇమిడి ఉన్నాయి. ఖచ్చితంగా చెప్పాలంటే, మోదీ ప్రభుత్వం...ట్రంప్ ఇజానికి "అవమానకరమైన లొంగుబాటు దోరణి కి ప్రతీకగా ఉంది.

ట్రంప్... అతని అనియంత్రిత విధానాలను ప్రపంచ ప్రజలు, అమెరికాలోని ప్రజాస్వామ్య వర్గాలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సమయంలో, మోదీ నేతృత్వంలో భారత ప్రభుత్వం మాత్రం... ట్రంప్ సామ్రాజ్యవాద ప్రభువు యొక్క ఆశ్రయంలో ఉండటానికి ప్రయత్నిస్తోంది. రైతులు, కార్మికులు అలాగే విస్తృత భారతీయ ప్రజల జీవనోపాధిని పూర్తిగా అగౌరవ పరుస్తోంది.భారత దేశ ప్రగతి పై దీర్ఘకాలం దుష్ప్రభావాలు చూపే పరిణామాలు కలిగిన ఈ సమస్యలను పార్లమెంటులో చర్చించటం లేదు. ఇది కేవలం మోదీ మంత్రి వర్గ నిర్ణయాలు "కార్పొరేట్ బోర్డ్ రూమ్‌లలో " తీసుకోబడుతున్నాయి. కాబట్టి, రాబోయే అమెరికా-భారత వాణిజ్య ఒప్పందాన్ని దృఢంగా వ్యతిరేకించడానికి, దాని నుండి వెనక్కి తగ్గేలా చేయడానికి ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, భారత ప్రజలు స్పష్టమైన అవగాహనతో అందరూ ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది.భారత ప్రజల ప్రయోజనాలను ఎవరు కాపాడుతారో వారే నిజమైన దేశభక్తులు.కేవలం నినాదాలకు పరిమితమై ట్రంప్ సర్కారుకు దాసోహం కావడం దేశ భక్తి అవుతుందా..!!? మోదీని,ఆయన తప్పుడు నిర్ణయాలను గుడ్డిగా సమర్థించే బీజేపీ, ఆరెస్సెస్ కార్యకర్తలు ఆలోచించి అడుగులు వేయండి.వివేకం, విజ్ఞత చూపండి.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## ఆదర్శప్రాయులు.. ఆ నలుగురు శాసనసభ్యులు

ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చేయలేకపోతున్న పని తాము చేసేందుకు ముందుకు వచ్చిన ఆ నలుగురు శాసన సభ్యులు ఆదర్శప్రాయులు. వారి ప్రయత్నాల్లో సమాజంగా మనం సదుద్దేశాన్నే చూడాలి. బహుశా ఇంతకుముందు ఎప్పుడూ లేని విధంగా సాక్షాత్తూ ఎమ్మెల్యేలు అదీ రూలింగ్ పార్టీ చట్టసభ సభ్యులు సర్కారు భూముల పరిరక్షణకు నడుం కట్టడం ఆశ్చర్యకరమే అయినప్పటికీ స్వాగతించాలి. అదే సమయంలో సంబంధిత శాఖల ఆంతర్యాన్ని చర్చించాలి. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు తపిస్తున్న నలుగురు అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు రాజకీయాలు, రాగద్వేషాలకు అతీతంగా తెలంగాణ పౌర సమాజం అర్జెంటుగా ఘన సన్మానానికి పూనుకోవాలి. వారికి నైతిక మద్దతు ఇస్తూ, మరింత కార్యోన్ముఖం చేయాలి. ఏకంగా రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల చెర నుంచి విడిపించాలంటూ వారు ఒకింత బహుముఖ పోరాటం చేస్తున్నారు. సాక్షాత్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ ఖాజాగూడలో సర్కారు ఖజానా జాడ ఎరుకలోకి తెచ్చారు. రూ. వేల కోట్ల విలువ చేసే ప్రజా ఆస్తి రక్షణ కోసం కంకణం కట్టుకున్నారు. అప్పట్లో కూలగొడుతున్న పాత సచివాలయం అడుగులో నిధి నిక్షేపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి పీఠం ఎక్కే కొన్నాళ్ళ ముందు రేవంత్ రెడ్డి సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. పాలనా పగ్గాలు చేపట్టాక కొన్ని రోజులకే లంకె బిందెలు లేవని ప్రకటించారు. అప్పుల కోసం పోతే బ్యాంకర్లు చెప్పుల వంక చూసుకుంటున్నారని సీఎం మళ్ళీ ఈ మధ్యే వాపోతూ సెలవిచ్చారు. ఈ ప్రస్తావనలన్నీ రాష్ట్ర ప్రభుత్వ కోశాగారం దయనీయ స్థితికి అద్దం పడుతున్నాయి. ఇటువంటి ఈతి బాధల తరుణంలో ఎడారిలో ఒయాసిస్సులా ఖాజాగూడలో సర్కారు ఖజానాను వెలుగులోకి తెచ్చి పుణ్యం కట్టుకుంటు న్నారు. ఆ నలుగురు శాసనసభ్యులు. తమ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి కాకున్నా, రాష్ట్ర చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న బాధ్యతగల ప్రజాప్రతినిధులుగా తెలంగాణ ప్రయోజనాల కోసం వారు పాటుపడుతున్నారు.

**యెన్నం ఇంటెలిజెన్స్ మాజీ ఆఫీసర్ కూడా**

ఎవరో కాలక్షేపం కోసం లేవనెత్తిన విలువ లేని అంశం కానేకాదు. రూ. వేల కోట్ల విలువైన జాగాల వ్యవహారం. సాంటిటీ (చిత్తశుద్ధి) గల కంప్లయింటు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని ఫలానా సర్వే నంబర్లలో 27ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ భూక్యా, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్ రెడ్డిలు ఆందోళన చెందుతున్నారు.

పైగా ఆ స్థలాలు చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్.టి.ఎల్.) పరిధిలోనివని పేర్కొంటున్నారు. పరాయి వ్యక్తుల కబంధ హస్తాల్లోంచి తలా ఓ "చేయి" వేసి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని గాఢంగా తపిస్తున్నారు. ఈ విధంగా ఎంతో ఆర్తిగా తండ్లాడుతున్న ఆ నలుగురు శాసనసభ్యులు ఆషామాషీ వ్యక్తులు కాదు. యెన్నం శ్రీనివాసరెడ్డి కేంద్ర సర్వీసుల మాజీ అధికారి. ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఢిల్లీ, ముంబైల్లో ఆఫీసర్‌గా చేశారు. సెంట్రల్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, కస్టమ్స్‌లో సేవలు అందించిన యెన్నం సదరు భూముల విషయంలో లోతుగా అధ్యయనం, పరిశీలన చేయకుండా ఉండరని ఏమాత్రం అనుకోలేం. యెన్నం సహా ఆ నలుగురు శాసనసభ్యులు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టును ఇటీవలే ఆశ్రయించారు. ఫిర్యాదీలకు కొన్ని సూచనలు చేస్తూ, రెండు వారాలపాటు జూన్ 16న వాయిదా వేసినట్లు వార్తలు వచ్చాయి. అంటే, హైకోర్టు ఈ(జూన్) నెలాంతంలో మరోసారి దృష్టి సారించే అవకాశం ఉంది.

**ఫిర్యాదు చేయకుంటే అంతే సంగతులా?**


హైకోర్టు తలుపు తట్టే ముందు సంబంధిత ప్రభుత్వ విభాగాలు, అధికారులకు ఆ ఎమ్మెల్యేల బృందం ఫిర్యాదు చేసినట్లు కథనం. నిజానికి ఏ శాఖలో ఆ శాఖకు సొంత నిఘా వ్యవస్థ ఉంటుంది. మరి అంత బహిరంగంగా ప్రభుత్వ భూములను చెరబట్టింది ఎంతటి బడా వ్యక్తులైనా బడిత పూజ చేయాల్సిందిపోయి నిమ్మకు నీరెత్తినట్లు మసలడంలో మతలబు ఏమిటి? కబ్జాదారులకు ఆయా పత్రాలు ఎట్లా సమకూరాయి, ఎవరి పాత్ర ఏందీ? అనే శోధనతో చీల్చిచండాడాల్సిన నిబద్ధత ఎందుకు నీరుగారిపోయింది?

ఆఫీసర్లుగా, ఉద్యోగులుగా తమవంతు గురుతర బాధ్యతలు ఎక్కడిక్కడ ఎవరికి వారు సక్రమంగా నిర్వర్తిస్తే సాక్షాత్తూ చట్టసభ సభ్యులే రంగంలోకి దిగాల్సిన అగత్యం ఏర్పడేది కాదు. ఫిర్యాదులు రాకముందే తమంతట తాముగా ఆయా విభాగాలు తమ కర్తవ్యాన్ని అనుసరించాలి. అలాంటిది ఫిర్యాదు చేస్తే కూడా ఆక్రమణలు, అక్రమాలు కనిపించక పోవడం కలికాలం మహిమా? హింట్ ఇస్తే చాలు తడాఖా చూపించాల్సింది. ఏకంగా శాసనసభ్యులే హైకోర్టుకు వెళ్లాల్సిన అనివార్యత ఉత్పన్నం అయిందంటే...ప్రభుత్వం మీద, సంబంధిత అధికార యంత్రాంగం మీద సమాజానికి ఎటువంటి సంకేతాలు పోతాయో ఆలోచించాలి. ప్రజలు చెల్లించే పన్నులతో జీత భత్యాలు పొందుతున్న సంబంధిత ప్రభుత్వ ఆఫీసర్లు నిక్కచ్చిగా, నిష్పక్షపాతంగా విధి నిర్వహణ చేయాలి. అసలే కాసుల కటకటతో సతమతం అవుతున్న ప్రభుత్వ గల్లా పెట్టెకు సాంత్వన చేకూర్చాలి.

**ఆ భూములతో ఒక సీజన్ రైతు భరోసా చెల్లించవచ్చు**

సంక్షేమ, అభివృద్ధి పథకాలకు, వేతనాలు వగైరా నెలవారీ చెల్లింపులకు ప్రభుత్వం నానా తంటాలు పడుతోంది. రూ. 2 వేల కోట్లు, రూ. 3 వేల కోట్లు, రూ. 4 వేల కోట్లు..ఇలా తరచూ రుణాలకు ఇండెంట్ ఇస్తోంది. ఈ వానా కాలంలో 1.49 కోట్ల ఎకరాల్లో సేద్యం పెట్టుబడులకై రైతు భరోసా పేరిట 70.11 లక్షల మంది వ్యవసాయదారులకు రూ. 9 వేల కోట్ల నిధులు ప్రభుత్వం చురుకుగా బదిలీ చేస్తోంది. ఇందుకోసం రుణ రూపేణా ఆర్థిక వనరులు మకూర్చుకుంటోంది. కబ్జాల పాలైన అదే ఖాజాగూడ భూములను స్వాధీనం చేసుకొని తనఖా పెట్టినా, లేదా వేలం వేసి అమ్మినా ఈ సీజన్ రైతు భరోసా భారం ఆవగింజంతైనా సర్కారు ఖజానా మీద పడేది కాదు. పైగా మరో రూ.1000 కోట్లు మిగిలేవి. కూకట్ పల్లి లో ఈమధ్యనే గజం ధర సుమారు రూ. 3 లక్షలు పలికిందట. ఆ ప్రకారం చూస్తే సదరు భూముల విలువ రూ. 10 వేల కోట్లు ఉంటుందనే అంచనా కరెక్టే కావొచ్చు. ఆ జాగాల్లో కట్టడాలు గనుక వెలిస్తే ఆ మేరకు విలువ అ"ధన"మేనాయే!

ఈ రూ.10 వేల కోట్లే ఉంటే, రాష్ట్రంలో ఎన్నో రంగాలు, వర్గాల ప్రజల కష్టాలను తీర్చవచ్చు. తక్కిన రైతు రుణ మాఫీ, ఆర్టీసీ కార్మికుల గోస, రిటైర్డ్ ఉద్యోగుల బాధలు, ఉద్యోగుల పీఆర్సీ, కాంట్రాక్టర్ల బకాయిలు, మేనిఫెస్టోలోని పెండింగ్ హామీలు.. ఒక్కటేమిటీ? డబ్బులతో ముడిపడి ఉన్న అనేక సవాళ్లను అధిగమించేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ నలు"గురి" సామాజిక ఆపేక్షను మెచ్చుకొని కబ్జా వివాదంలో నిజానిజాలను తేల్చేందుకు యంత్రాంగాన్ని తక్షణం పురమాయించాలి. తమ పార్టీ ప్రభుత్వ ప్రతిష్ట మిళితమైన ఖాజాగూడ భూ వ్యవహారంపై మన భాష తెలుగు రాని కాంగ్రెస్ ఢిల్లీ అధిష్టానానికి ఎవరైనా ఉన్నది ఉన్నట్లు తర్జుమా చేసి చెప్పాలి. ఢిల్లీ పెద్దలూ దృష్టి సారించాలి.



**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
**వ్యాసకర్త, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్టు**
**హైదరాబాద్,**
**9440850384**

## శ్రమజీవి అంతర్జాతీయ గీతం

'ప్రపంచ పురోగతి సాంతం క్రమజీవి నెత్తుటి బొట్టులోనే ఇమిడివుంది' అని ప్రకటించిన చెరబండరాజు ప్రపంచ పురోగమనంలో శ్రమజీవి నిర్వహించిన పాత్రను చారిత్రకంగానూ, శాస్త్రీయంగానూ అర్థం చేసుకున్నాడు. ఎన్నో కవితల్లో పాటల్లో ఆ అవగాహనను ఎలుగెత్తిచాటాడు. భూగోళం మీద జీవరాశి ఏర్పడినప్పటినుంచి ఆహారాన్వేషణ సాగుతున్నది. ఆహారాన్వేషణలో శ్రమ పాత్రయే మిగిలిన ప్రాణి కోటినుంచి మనుషులకు ఆకృతినిచ్చింది. మనిషి తొలిరూపమయిన గొరిల్లా తన ముందటి కాళ్లను ఆహారాన్వేషణలో ఉపయోగించే నైపుణ్యం పెంచుకున్న క్రమంతో తొలిమానవాకృతి ఏర్పడింది. పనిలో కరచరణాదుల ఉపయోగం, అవయవాల నిర్మాణానికి, ప్రత్యేక పనులకు ఎట్లా పరిణితి చెందిందో అట్లే మనిషి మెదడు అభివృద్ధి చెంది , బుద్ధి వికసించింది. ఊహించే, సృజించే శక్తి వచ్చింది. చాలామంది భ్రమపడేట్లు బుద్ధి, ఊహాలు శ్రమను నిర్దేశించవు. శ్రమయే బుద్ధి. ఊహ, సృజన శక్తి వికసించడానికి తోడ్పడుతుంది. కనుక ప్రపంచ పురోగమనం అనేది బానిస సమాజం నుంచి పెట్టుబడిదారీ (ఒక స్వప్నం ఫలించి ఒక విశాల భూ ఖండంలో కొన్ని దశాబ్దాల పాటు) సమాజం ఏర్పడే వరకు కూడా శ్రమజీవి నెత్తురు చెమటలో, ఎక్కువ సార్లు నెత్తురే చింది ఏర్పడిన నాగరికతయే సాధించిన అభివృద్ధియే, సహజవనర్లు, భూమి, నీళ్లు, ఖనిజాలు వంటివి ప్రకృతిలో ఉన్నవనరు ఒక గింజ ఎన్నో గింజలకాయగా, ఒక పిడికెడు ధాన్యం-పుట్టెడు ధాన్యంగా పండే రహస్యం-మినహాయిస్తే ఈ వనర్లన్నింటినీ సమకూర్చుకుని ఎన్నోరెట్ల సంపదలను సృష్టించే శక్తి మాత్రం మానవ శ్రమకే ఉంది. శ్రమజీవి నెత్తుటి బొట్టు ఏమేమి సాధించి ప్రపంచ పురోగమనానికి బాటలు వేసిందో చెరబండరాజు ఎల్లకులాలకు క్రమజీవి అంతర్జాతీయ గీతమనదగిన పాటలో స్పష్టంగా చెప్పాడు.



కొండలు పగలేసినం.. బండలను పిండినం
మానెత్తురు కంకరగా.. ప్రాజెక్టులు కట్టినం
శ్రమ ఎవడిదిరో.. సిరి ఎవడిదిరో
బంజర్లను నరికినం.. పొలాలను దున్నినం
మా చెమటలు ఏరులుగా.. పంటలు పండించినం
గింజెవడిదిరో.. గంజెవడిదిరో.. మగ్గాలను పెట్టినం
పోగు పోగు వడికినం..
మా నరాలె దారాలుగా.. గుడ్డలెన్నో నేసినం
ఉడుకెవడిదిరో.. వణుకెవడిదిరో
యంత్రాలను తిప్పినం.. ఉత్పత్తులను పెంచినం
మా శక్తే విద్యుత్తుగా.. ఫ్యాక్టరీలు నడిపినం
మేడ ఎవడిదిరో.. గుడిసెవడిదిరో

శ్రమజీవులు పరాయికరణ పొందిన తమ శ్రమనేకాదు, శ్రమఫలితాన్ని, అధికారాన్ని కూడా హస్తగతం చేసుకుంటారు. ఆ విశ్వాసాన్ని ఇచ్చే గొప్ప గీతాన్ని చెరబండరాజు ఇచ్చాడు. శ్రమజీవి గురించి ఇంత శాస్త్రీయమైన అవగాహనతో రాసిన చెరబండరాజు నలగొండ జిల్లా, అంకుశాపురం గ్రామంలో ఒక పేద రైతు కుటుంబంలో పుట్టాడు. తల్లి పదినెలలు మోసి ఎంతో కష్టంతో కన్నబిడ్డ గనుక తండ్రి ఆయనను శెరాబందిరాజుతో పోల్చాడు. బక్కయ్య, బక్కరెడ్డి అని పేరుపెట్టాడు. స్కూల్లో చేర్చేప్పుడు టీచర్ భాస్కరరెడ్డిగా మార్చాడు. అంకుశాపురంలో, ఘటుకేసరులో చదువుకొని, హైదరాబాదులో నల్లకుంట కళాశాలలో తెలుగు ఎంఏల్ చేసి 1965లో దిగంబర కవితా ఉద్యమం ప్రారంభించినపుడు ఆయన తండ్రి పోల్చిన పేరుకు దగ్గరగా చెరబండరాజు అని తన కలంపేరు ఎంచుకున్నాడు. ఆశ్చర్యంగా ఆయన 1971 నుంచి 77 దాకా చెరబండరాజు కింగ్ ఆఫ్ ప్రిజన్ స్టోన్( ఈ శీర్షికతో అమెరికానుంచి వెలువడే గార్డియన్ పత్రికలో ఆయన గురించి ఒక పరిచయవ్యాసం1982లోవచ్చింది) గానే రాజీలేకుండా పోరాడిన జగమొండిగా జీవించాడు. ఈ బక్కయ్యను చిన్నతనంలో తన వెంటపెట్టుకొని తండ్రి పొలం దగ్గరికి తీసుకువెళ్ళేవాడు. మోటకడుతూ.. ఏటికేతంబెత్తి వెయిపుట్లు పండించి.. గంజిలో మెతుకెరుగరన్నా.. అని గొంతెత్తి పాడుకునేవాడు. ఆ పసి మనసులో ఆ రైతు జీవితం అట్లా ఒక దృశ్యమైంది. అందుకే కవిగా చెరబండరాజు.. ఈ మట్టి నాకు పట్టెడన్నం పెట్టి పాలు తాపిందని , రాక్షస భూస్వామ్య రంపపు కోతనుంచి ఈ మట్టిరుణం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేసాడు. ఇవ్వాళ మనం విద్యుత్ చార్జీల పెంపుదలతో, ఆ పుదలకు వ్యతిరేకంగా జరిగిన విశాల ప్రజా ఐక్య ఉద్యమంపై దారుణమైన అణచివేతలో చాలా స్పష్టంగా ప్రపంచ బ్యాంకు ఆదేశాలను, సామ్రాజ్యవాద కుట్రను పోల్చుకుంటున్నాం. ఈ సామ్రాజ్యవాద స్వభావం గురించి చెరబండరాజు 1968లోనే వందేమాతరమ్' గీతం రాసాడు. చెరబండరాజు.. రాజుల సంస్కృతిని కాదని ప్రజల సంస్కృతి గురించి పాడాడు . రాసాడు. ఏది నమ్మాడో అదే రాసాడు. ఏది రాసాడో ఆ ఆదర్శానికి అనుగుణంగా ఆచరించాడు . జీవించాడు. ఆ క్రమంలో ఎన్ని కష్టాలు వచ్చినా ధైర్యంగా నిలిచాడు. తన విశ్వాసాల కోసం, రచన కోసం జైలు పాలయ్యాడు. ఎమర్జెన్సీ చీకటి నిర్బంధాన్ని అనుభవించాడు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే గాంధీ 'రోగ నిలయం'లో (గాంధీ ఆసుపత్రి) కేన్సర్తో బాధపడుతూ నెలల తరబడి గడిపాడు. కోమాలోకి వెళ్లి కన్నుమూసాడు. సికింద్రాబాద్ - కుట్ర కేసులో ముద్దాయిగా జైలు సంకెళ్ళనే లయ బద్ధంగా మోగిస్తూ.. ఈ మట్టిని తొలచుకొని విప్లవాలు లేస్తున్నాయి.. ఎరుపెక్కిన మట్టికి మానెత్తుటి లాల్ సలామ్' అని కటకటాలనుంచి గొంతెత్తి పాడాడు. జైలు, కోర్టు, ఆసుపత్రి-ఎక్కడయినా ప్రజల గురించి ఆలపిస్తూనే ఆఖరి శ్వాసదాకా బతికాడు. ఆగస్టు పదిహేను ద్రోహాన్ని చెప్పకపోతే అన్నం సహించదునాకు ఏరోజైనా ప్రజా పోరాటాల విషయాన్ని రచించకపోతే ఆరోజు జీవించి నట్టుండదు అని రాసిన చెరబండరాజు పీడిత పోరాట ప్రజలకు చిరస్మరణీయుడు.

**వరవర రావు**
**(శ్రమజీవి,జులై-సెప్టెంబర్,2001 లో ప్రచురితం)**

**- చెరబండరాజు**

## మా బంగారుదైవం

గుండెల్లో రగిలే అగ్గిరవ్వల్ని
హిమ శకలాలుగా మార్చి
తియ్యని లడ్డూలా
కన్న బిడ్డల కడుపు నింపే
నిత్య శ్రామికుడు

తను చిరిగిన చొక్కా వేసుకుని
పిల్లల్ని రంగవల్లుల్లా చూడాలని
రంగు రంగుల అంగీలు కుట్టించి
చూసి మురిసిపోయే ఆనందుడు

తనేమో జోళ్ళు వేసుకోకుండా
చిన్నారుల పాదాలు కందకుండా
భుజాలపై పల్లకీలా మోసే సేవకుడు

పిల్లలు తింటుంటే చూస్తూ
వారి ఆనందాన్ని అన్నంగా భావిస్తూ
తన ఉదరం నింపుకునే ఉదారుడు

ఎన్నెన్ని కష్టాలు అవాంతరాలెదురైనా
ప్రతీక్షణం పిల్లల సంక్షేమం కోసం
తాను కొవ్వొత్తిలా కరుగుతూ
వెలుగులు పంచే దివ్యదీపుడు.

**రచన : నాగముని. యం (నాగ్)**
**9490856185**
**గుత్తి. ఆర్.యస్, అనంతపురం జిల్లా**
**ఆంధ్రప్రదేశ్**

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

- పథకాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల నడిగడ్డ, జూలై 2 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గద్వాల మండల సంబంధించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన వారికి అర్హులైన ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యేకి నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాకు రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన గద్వాల మండలం నాకు ఎప్పటికీ ప్రత్యేకము అదేవిధంగా ప్రతి ఎన్నికలలో నాకు గద్వాల మండలం ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలబడడం జరుగుతుందని, నాకు రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడానికి అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు,గతంలో ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనే వారు కానీ నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి మీ ప్రాంతంలోని ప్రజల అభివృద్ధి కొరకు కృషి చేయడం జరిగిందనీ, ఈ ప్రభుత్వాలు వచ్చిన ప్రభుత్వం తో వప్పించి ప్రభుత్వం నుండి నిధులను తీసుకొచ్చి ఈ ప్రాంత అభివృద్ధి కొరకు సాయి శక్తుల చేయడం జరిగినది తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీ లో భాగంగా ఇప్పటికే రెండు గ్యారెంటీ లను పూర్తి చేయడం జరిగింది. మహిళా ఫ్రీ, 500 రూపాయల సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతులకు రైతు రుణమాఫీ,రైతు బంధు, రేషన్ కార్డులు,సన్న బియ్యం, అందించడం జరుగుతుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు సొంత ఇంటి లేక కూలి గుడిసెలో నివసిస్తున్న వారికి ప్రభుత్వము దూర దృష్టితో ఆలోచించి ఐదు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఇందిరమ్మ ఇల్లు ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇల్లును కట్టించి ప్రతి ఒక్క పేద ప్రజల సొంతింటి కలను ఇందిరమ్మ ఇల్లు తోనే సాధ్యమవుతుందని తెలిపారు. గద్వాల నియోజకవర్గ లో మొదటి విడతగా 3500 ఇండ్లు మంజూరు కావడం జరిగింది . ఇందులో గద్వాల మండలానికి 303 ఇండ్లను కేటాయించడంతో ఇల్లు లేని పేద ప్రజలకు ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఇంటి నిర్మాణంలో చేసుకోవాలి ఎవరికీ మధ్యవర్తి లేకుండా ప్రభుత్వము నుంచి వచ్చే డబ్బులను వారి ఖాతాలోని జమ కావడం జరుగుతుంది. సొంతింటి కల నెరవేర్చు కోడానికి ఇందిరమ్మ ఇళ్లు పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి ప్రభుత్వము కృషి చేయడం జరుగుతుంది. ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా సాయ శక్తుల కృషి చేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఈ ప్రాంతంలో గుడిసెలు లేకుండా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు మంజూరైన వారు ఇంటి నిర్మాణాలు పనులను ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా గద్వాల మండల అన్ని రంగాలలో అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేసి ప్రతి రంగంలో మహిళలకు అవకాశం కల్పించడం జరుగుతుంది అదేవిధంగా ప్రతి ఒక్క వ్యాపార సంస్థలను కూడా మహిళలకు భాగస్వామ్యం చేస్తూ మహిళలు కూడా పురుషులతో సమానంగా ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం మహిళా శక్తి వంటి ఈ కార్యక్రమంలో ఏర్పాటుచేసి ప్రభుత్వం అహర్నిశలు మహిళల అభ్యున్నత కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.గద్వాల నియోజకవర్గం లో నన్ను రెండోసారి గెలిపించి అవకాశం కల్పించిన ప్రజల కోసం నేను ప్రభుత్వంలో భాగస్వామ్యం కావడం జరిగింది. గద్వాల నియోజకవర్గ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి ,పటేల్ ప్రభాకర్ రెడ్డి రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీలు ప్రతాప్ గౌడ్,రాజారెడ్డి, మాజీ జడ్పిటిసి రాజశేఖర్, పి ఏ సి ఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, నాయకులు గోపిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,చక్రధర్ ,మజీద్, అశోక్ రెడ్డి,సత్య రెడ్డి, రంగన్న,నీలేశ్వర్ రెడ్డి, వెంకట్ రాములు, లక్ష్మీకాంత్ రెడ్డి, నర్సింహులు,హనుమంత్ రెడ్డి ,గోపాల్, సత్యనారాయణ, కృష్ణ, శ్రీనివాసులు ,పూడూరు శ్యామ్, కేశవ్ రెడ్డి నరేందర్ రెడ్డి, గుర్రం సూరి, మన్యం, జగన్మోహన్ రెడ్డి,కృష్ణ రెడ్డి జగదీశ్వర్ రెడ్డి,గోపాల్ రెడ్డి, రాజారెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఎంఈఓ వెంకటయ్యకు వినతిపత్రం



**తాండూరు, జూలై 2 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపు స్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలలు ప్రారంభమై 15 రోజులకు పైగా అయినప్పటికీ రోజు ఏదో ఒక స్కూల్ దగ్గర పాఠ్యపుస్తకాలు విక్రయించడం జరుగుతున్న విద్యాధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు.ఇప్పటికైనా విద్యాధికారులు మేల్కొని అలాంటి స్కూల్ లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది.తాండూరు పట్టణంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది, అంతేకాకుండా ప్లే స్కూల్ ల పేరుతోటి గల్లికొక పాఠశాల వెలిసి ప్రభుత్వాన్నిబంధనాలను బేకదారు చేస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ఫీజులతో నిర్వహించడం జరుగుతుంది. అలాంటి పాఠశాలలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంఈఓకు ఏబీవీపీ అద్వర్యం లో విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ అధ్యక్షులు నర్సింలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజయ్ నాయకులు నవీన్ శ్రీకాంత్ రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, జూలై 2 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి చేయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్ లో రూ 90 లక్షల రూపాయల నిధులతో స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ పనులకు స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే బండారిలక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా నెరవేరుస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి డి ఈ బాలకృష్ణ , ఏఈ కీర్తి, మాజీ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి , మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, కాలనీవాసులు శ్రీరాములు, సదా లక్ష్మీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




**అబ్దుల్లాపూర్మెట్, జూలై 2 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జులై 9న పిలవబడ్డ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) పిలుపునిచ్చింది.ఈ మేరకు అబ్దుల్లాపూర్మెట్ మండల సిపిఐ కార్యాలయ ఆవరణలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్ నాయక్ ఆధ్వర్యంలో గోడపత్రికను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర ఆచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఔట్సోర్సింగ్, ఫిక్స్డ్ టర్మ్, థర్డ్ పార్టీ, ట్రైనీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి.కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి.పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి. స్కీన్ వర్కర్లకు వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి.వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర చట్టబద్ధత కల్పించాలి,ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించి సంవత్సరానికి 200 రోజుల పని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి.ఈ డిమాండ్ల సాధన కోసం ఏఐటీయూసీ అన్ని కార్మిక సంఘాలతో ఐక్యంగా పోరాటం చేయాలనే పిలుపునిచ్చింది.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కేతరాజు నర్సింహా, మండల అధ్యక్షులు దాసరి ప్రసాద్, నాయకులు యేశాల నర్సింహా, నవనీత, అరుణ, బాల్ రెడ్డి, రాములు, మధురాము, హైమద్, బిచ్చు, యాదగిరి సైదులు ముదిరాజ్, మంగళపల్లి రవి, ముత్తయ్య, దేవమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సభను విజయవంతం చేయండి

- పార్టీ నేతలకు డిప్యూటీ సీఎం పిలుపు



**హైదరాబాద్, జూలై 2 (జనంసాక్షి) :** ఈ నెల 4న హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని గ్రామ శాఖ అధ్యక్షుడు మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. ఈనెల 4న ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటన నేపథ్యంలో బుధవారం ఆయన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు రోహిన్ రెడ్డి లతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించి మీడియాతో మాట్లాడారు. గ్రామ శాఖ అధ్యక్షులతో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా సమావేశం కావడం దేశంలోనే ఇది మొదటిసారి అని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ రాష్ట్రం అనంతరం దేశవ్యాప్తంగా ఈ తరహా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సభ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. నాలుగో తారీఖు సాయంత్రం మూడు గంటలకల్లా రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఒకరికి మరొకరు సమాచారం చేర వేసుకొని సమన్వయంతో సభకు విచ్చేసి విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. గ్రామ శాఖ అధ్యక్షులతో ఏఐసిసి అధ్యక్షుడు మాట్లాడే కార్యక్రమానికి మొదటి అవకాశం తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చినందుకు అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తో నేరుగా కలిసి మాట్లాడే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున తరలిరావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ నేతలకు పిలుపునిచ్చారు.

## ఉద్యోగాల సాధనకు జూలై 4న ఛలో సెక్రటేరియట్



**హైదరాబాద్, జూలై 2 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ను అమలు చేసి ఉద్యోగాలకై నోటిఫికెషన్స్ వేయాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జూలై 4న జరిగే సెక్రటేరియట్ ముట్టడికి డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు యువతీ యువకులు హాజరై చలో సెక్రటరియేట్ ను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్‌లు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ.జావీద్, కృష్ణా నాయక్, నాయకులు రాజు,భరత్, రాజేష్, నరేందర్, ప్రవీణ్, మల్లేష్, శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్



**ఇబ్రహీంపట్నం, జూలై 2 (జనం సాక్షి) :** దేవాలయాలను టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ను రాచకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఏపీ కి చెందిన శివానంద, షరీఫ్ అరెస్టు చేశారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయం రాచకొండ పోలీస్ కమిషనర్ సుదీర్ బాబు మాట్లాడుతూ ఈ ముఠా దేవాలయాల్లో ఉన్న పంచంలోహ విగ్రహాలు చోరీలు చేస్తున్నారని తెలిపారు.ఉప్పల్ లో ఒక బైక్ ను చోరీ చేసి వీరు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. శివానంద్, షరీఫ్ మద్యం మత్తులో నేరాలు చేస్తున్నారని తెలిపారు. దేవాలయాలలో చోరీ చేసిన విగ్రహలు ఉప్పల్ కు చెందిన క్రాంతి కుమార్ అనే వ్యక్తి కి అమ్ముతున్నారని, విగ్రహాలను కొనుగోలు చేసిన క్రాంతి కుమార్ ను కూడా అరెస్ట్ చేసినట్లు సుధీర్ బాబు తెలిపారు. ఈ ముఠా నగర శివారు ప్రాంతాల్లో ఉన్న దేవాలయలను టార్గెట్ చెస్తున్నారని, సీసీటీవీ కెమెరా లేని దేవాలయాలనే వీరు టార్గెట్ చేస్తున్నారన్నారు. ప్రతి దేవాలయాల్లో కూడా సీసీటీవీ కెమెరా లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 61 కేజీల 5 లక్షలు సొత్తు ను స్వాధీనం చేసుకున్నట్టు రాచకొండ కమిషనర్ వెల్లడించారు.ఈ సమావేశం లో మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసిపి కె వి రాజు, ఇబ్రహీంపట్నం ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి మరియు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో విమానాలకు ఇంధనం సరఫరా లక్ష్యం

- 3 కోట్ల లీటర్ల ఇథనాల్, ఈఎన్ఏ కోసం కేంద్రంతో ఒప్పందం
- 20శాతం ఇథనాల్ బ్లెండింగ్లో ఆర్బిఓఎల్ భాగస్వామ్యం
- రూ.500ల కోట్ల టర్నోవర్కు టార్గెట్
- తమ సంస్థ ఆరు నెలల వ్యవధిలోనే అనుకున్న లక్ష్యం కంటే రెట్టింపు

**ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి**







**తాండూరు, జూలై 2 (జనంసాక్షి) :** భవిష్యత్తులో విమానాలకు ఇంధనం సరఫరా లక్ష్యమని బుయ్యని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 2025 నాటికల్లా పెట్రోలులో 20 శాతం ఇథనాల్ కలిపి వినియోగదారులకు అందజేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. తమ సంస్థ ఆరు నెలల వ్యవధిలోనే అనుకున్న లక్ష్యం కంటే రెట్టింపు స్థాయిలో ఉత్పత్తులు చేపట్టి మార్కెట్లో పటిష్టమంతంగా నిలిచామని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని జక్కేపల్లి సమీపంలోని గల ఆర్బీవోఎల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఈవో బుయ్యని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బయో ఇంధనంగా పిలువబడే ఇథనాల్ తయారీకి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహి స్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 60 భారీ కంపెనీలు ఇథనాల్ ఉత్పత్తులు చేపడుతున్నాయని, అందు ఆర్బీవోఎల్ కంపెనీలో తమ సంస్థ కూడా కీలకపాత్ర పోషించడం గర్వకారణంగా ఉందన్నారు. 2010లో ప్రారంభించిన ఆర్బీవోఎల్ రోజుకు 60 వేల లీటర్ల సామర్థ్యంతో ఈఎన్ఏ ఉత్పత్తులు చేపట్టామని వెల్లడించారు. 2020 నాటికల్లా 90 వేల లీటర్ల సామర్థ్యానికి చేరుకున్నామని చేరుకున్నామని తెలిపారు. 2022 నుంచి ఆర్బీవోఎల్ రెండో ప్లాంటు కూడా ప్రారంభించి రోజుకు 2 లక్షల లీటర్ల ఉత్పత్తులకు పెంచామని తెలిపారు. అందులో 1.10 లక్షల లీటర్ల ఇథనాల్, 90 వేల లీటర్ల ఈ ఎన్ఏ తయారు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పలు గ్యాస్ కంపెనీలు సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ఏటా 3 కోట్ల లీటర్ల ఇథనాల్ కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. గ్యాస్ కంపెనీలలో ప్రధానంగా హెచ్పీఎల్, బీపీసీఎల్, ఐవోసీఎల్, ఎంఆర్పీఎల్ ఒప్పందం కుదుర్చుకొని యేటా 3 కోట్ల లీటర్ల ఇథనాల్ ఆర్డర్లు వచ్చాయని వివరించారు. విద్యుత్ వినియోగం కూడా గతంతో పోల్చుకుంటే సగానికి సగం తగ్గించామని, ప్రస్తుతం 3 మెగావాట్లు గ్యాస్ కంపెనీలకు రూ.3 కోట్ల లీటర్ల ఇథనాల్ ఆర్డర్లు పెట్రోలులో 20 శాతం కలిపి విక్రయాలు -విమాన ఇంధనానికీ ఇథనాల్ అందజేస్తామని సీఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ఆయిల్ కంపెనీలు ఆర్డర్లు ఇవ్వడంతో రెట్టింపుస్థాయిలో ఉత్పత్తులు చేపట్టామని వేల్లడించారు. గల్ఫ్ దేశాల నుంచి ముడిచమురు దిగుమతి చేసుకుంటూ ప్రపంచంలో మనదేశం మూడో స్థానంలో నిలిచినట్లు ఆయన గుర్తు చేశారు. విదేశాల నుంచి చమురు దిగుమతుల ద్వారా అధిక ఖర్చు ఏర్పడి ప్రజలపై భారం పడుతుందన్నారు. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలన్న లక్ష్యంగా ఇథనాల్ ఉత్పత్తులకు ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తోందని తెలిపారు. తద్వారా యేటా రూ.50 వేల కోట్ల వరకు ఆదా చేసుకునే అవకాశం లభించిందని ఆయన వివరించారు. ఈఎస్ఏ, ఇథనాల్ ద్వారా ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తుందనీ సమాధానం ఇచ్చారు. చమురు, ఆల్కహాల్, ఫార్మా కంపెనీలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. ఇథనాల్ కలిపి వాహనాలను నడపడం ద్వారా ఎలాంటి పర్యావరణ ముప్పు కలుగదని తెలిపారు. చమురు ఎంతగా నిలిచిపోతే మన దేశ ఆర్థిక వ్యవస్థకు అంతగా మేలు జరుగుతుం దన్నారు. ఆర్బీవోఎల్ రూ.250 కోట్ల నుంచి రూ.450 కోట్ల టర్నోవర్కు చేరుకుందని వెల్లడించారు. సీఎస్ఆర్ నిధుల కింద ప్రతినెలా రూ.2 లక్షల చొప్పున రక్షణశాఖకు అందజేస్తున్నామని తెలిపారు. గత రెండు మాసాల నుంచి రక్షణశాఖకు అందజేస్తున్నట్లు చెప్పారు. తాండూరు నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ నిధులు కేటాయించామని వివరించారు. రాబోయే రోజుల్లో విమానాల ఇంధనానికి కూడా ఇథనాల్ సరఫరా చేస్తామని సీఈవో శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఏ కంపెనీలు ముందుకు వచ్చి ఆర్డర్లు ఇచ్చినా ఉత్పత్తులను మరింత వేగమంతం చేస్తామని వివరించారు.

## ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి



**శామీర్‌పేట్, జూలై 2 (జనంసాక్షి) :** శామీర్‌పేట్‌లో బుధవారం అన్న దాన కార్యక్రమం అఫ్జల్ ఖాన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం మెరుగ్గా సాగుతోందని, దీనికి పారిశుధ్య కార్మికులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బుధవారం అన్న దాన కార్యక్రమంలో సహాయకారిగా ఉంటున్న కిరాణా షాపు యజమాని బన్వర్ ను శాలువా కప్పి సత్కరించి నట్లు అఫ్జల్ ఖాన్ తెలిపారు. నెల రోజుల్లో అప్పుడప్పుడు నాన్ వెజ్, గుడ్లు , కోడి మాంసంతో అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజం లో ప్రతి ఒక్కరు కూడా ఒక మంచి మార్పు కోరుకోవాలని, దానికి సన్నద్ధమై సేవాభావంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ , కిరాణా షాపు యజమాని బన్వర్ తో పాటు నాయకులు, ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల పేరుతో నిలువు దోపిడీ..!

- ప్రైవేటు పాఠశాలల్లో పుస్తక విక్రయ కేంద్రాలు
- ఎల్‌కేజీకి రూ.4000, పదికి రూ.8500పైనే..
- సొంత పుస్తకాలు, స్టడీ మెటీరియల్ పంపిణీ
- నోట్ పుస్తకాలు కొంటేనే పాఠ్యపుస్తకాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలను బాగా చదివించాలనే ఉద్దేశంతో ప్రైవేటు పాఠశాలకు పంపిస్తున్నారు. వీరి బలహీనతను వ్యాపారంగా మార్చుకుంటున్నారు విద్యావ్యాపారవేత్తలు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ఫీజుల రూపంలో తల్లిదండ్రులను నిలువు దోపిడి చేస్తున్నాయి. ఫీజులతోపాటు పుస్తకాలు, యూనిఫాం, బస్ ఫీజుల రూపంలో దగాచేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### యాజమాన్యం చెప్పిందే రేటు..

వాస్తవంగా స్టేట్ సిలబస్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్లో చదివే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో తొమ్మిది నోట్ పుస్తకాలు, నాలుగు టెస్ట్బుక్స్ మాత్రమే ఉండాలి. అదనంగా డ్రాయింగ్, మ్యూజిక్, కంప్యూటర్ పుస్తకాలు ఉంటాయి. ఒక్కో నోట్బుక్ (షార్టు) రూ. 25 లోపు, లాంగ్ నోట్బుక్ రూ.40 నుంచి 50 వరకు ఉంటుంది. పాఠ్య పుస్తకాలు ప్రాథమిక స్థాయిలో ఒక్కొక్కటి రూ. 50 మాత్రమే. కాని విద్యార్థులకు రూ.500 నుంచి రూ.700 లోపు పుస్తకాలు ఖర్చు ఉంటుంది. అయితే పుస్తక విక్రయ కేంద్రాల్లో కొరత పేరుతో పుస్తకాలు ధరలు మోత పుట్టిస్తున్నారు. వారి బ్రాండ్ పేరుతో భారీ ఎత్తున అవసరం లేని నోట్ పుస్తకాలు కొనిపిస్తున్నారు. మార్కెట్లో రూ.25 కూడా ఖరీదు చేయని నోట్ బుక్కు రూ.50 నుంచి రూ.60 కు అంటగడుతున్నారు.

### పాఠశాల ఆవరణలోనే కౌంటర్స్...

నిబంధనల ప్రకారం ఏ పాఠశాలలో కూడా బోధనే తర పనులు చేయరాదు. దాదాపు అన్ని ప్రైవేటు, కా ర్పొరేట్ పాఠశాలలో పుస్తకాలు స్టాల్స్ ఉన్నాయి. ఒకవైపు ఫీజుల దోపిడి మరోవైపు పుస్తకాల పేరుతో రెండు విధాలుగా తల్లిదండ్రులను దోచుకుంటున్నారు. బయట మార్కెట్ కంటే కనీసం 25శాతం అధిక రేట్లుకు పుస్తకాలు అంటగడుతున్నారు. ఎవరైనా బయట పుస్తకాలు కొంటే ఆ విద్యార్థికి నిత్యం వేధింపులే. ఎందుకొచ్చిన గొడవ అనుకుని తల్లిదండ్రులు పాఠశాలలోని కౌంటర్ లో పుస్తకాలు కొంటున్నారు. ప్రైవేటు పాఠశాలలో ఒకటి నుంచి పది వరకు ప్రభుత్వ ఆధ్వ ర్యంలో ముద్రించిన పుస్తకాలు మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలి. అనేక ప్రైవేటు స్కూల్స్ ప్రైవేటు పబ్లిషర్స్ తో కుమ్మకై వారు తయారు చేసిన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ విద్యార్థులు కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకు వస్తున్నారు. పాఠ్య పుస్తకాలుకు ఒక రేటు, స్టడీ మెటీరియల్ కు ఒక రేటు వసూలు చేస్తున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా...

పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు, గాలి, వెలుతురు, ఫ్యాన్లు, మరుగు దొడ్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, క్రీడా మైదానం కూడిన వసతులు ఉండాలి. ఎక్కువ శాతం పాఠశాలల్లో ఇలాంటి వస తులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులు, రేకుల షెడ్లలో తరగతులు కొనసాగుతున్నాయి. నర్సరీకే ఆరువేల రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇక ఆరు, ఏడు తరగతులకు రూ.16 వేలు, తొమ్మిది, పదో తరగతులకు రూ.18వేలు చొప్పున ఫీజులను నిర్ణయించారు. సామా న్య, మధ్య తరగతి కుటుంబాల్లోని వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించాలా వద్దా అనే సందిగ్ధంలో పిల్ల తల్లిదండ్రులు ఉన్నారు.

### జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు దోపిడి..

సంగారెడ్డి జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో యజమాన్యం పుస్తకాల దోపిడీ చేస్తున్నారు. జిల్లాలోని పటాన్చెరు, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్- జోగిపేట్, అమీన్పూర్, రామచంద్రపురం తదితర పట్టణాలలో గల ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల వద్ద పుస్తకాల పేరుతో దోపిడి కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా రావుస్ పాఠశాల, సెంట్ ఆంథోనీస్ , సెయింట్ ఆన్స్, కృష్ణవేణి టాలెంట్, వికాస్ పాఠశాలతో పాటు మరికొన్ని పాఠశాలల్లో పుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్న జిల్లా విద్యాధికారి కానీ సంబంధిత అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆయా పట్టణాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి మండల విద్యాధికారులతోపాటు, జిల్లా విద్యాధికారి కుమ్మకై పుస్తకాల, యూనిఫామ్ వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల, యూనిఫామ్ దోపిడి అరికట్టాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఫీజులు, పుస్తకాల అమ్మకాలు నియంత్రించాలి



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాల అమ్మకాలు నియంత్రించాలి. ఎక్కువ శాతం ప్రైవేటు పాఠశాలల్లో ఎలాంటి వసతులు లేకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. స్కూల్, వ్యాన్, పుస్తకాలు, యూనిఫాం, రూపంలో వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఇబ్బందిగా మారడంతో ప్రైవేటు పాఠశాలల్లో చదువుకోలేకపోతున్నారు. ప్రభుత్వం వెంటనే పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకాలు నియంత్రించాలి.

**శశికుమార్, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, మునిపల్లి**

### చర్యలు తీసుకోవాలి..



ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాశాఖాధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలి. పాఠశాలలను రేకుల షెడ్లలో నిర్వ హిస్తూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. వసతుల లేని పాఠశాలల అనుమతిని రద్దు చేయాలి. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు యూనిఫామ్, పుస్తకాల అమ్మకాలను నియంత్రించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పుస్తకాలను బయట కొనుగోలు చేయకుండా నియంత్రిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు సంబంధిత అధికారులు వెంటనే ఆయా పాఠశాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలి.

**అదెల్లి రవీందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**

## రోడ్లు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** నారాయణపేట పట్టణంలోని 17,22 వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ,అంతర్గత రోడ్లు స్పీడ్ బ్రేకర్ ల సమస్యలపై బుధవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నందు నామాజీ మాట్లాడుతు రెండు వార్డుల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని చిన్న పాటి వర్షానికే మురుగు నీటి రోడ్లపై పారుతుందని వివరించారు. అలాగే రోడ్లు గుంతల మయం అయ్యాయని దాంతో ప్రజలు నడవడానికి నరకయాతన అనుభవిస్తున్నారనీ అన్నారు. స్పీడ్ బ్రేకర్ లు లేక వాహనాలు వేగంగా వెళుతున్నాయి ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అర్జున్ మిస్కిన్,చేతన్,నరేష్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందనీ బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ అన్నారు. బుధవారం రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ కి 50 ఏళ్ల సందర్భంగా హైద్రాబాద్‌లో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావుతో కలిసి నాగురావు నామాజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమర్జెన్సీలో నాగురావు నామాజీ జైలుకు వెళ్లడం పట్ల ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతు అధికార దాహంతో కోర్టు తీర్పును దిక్కరించి ఇందిరా గాంధీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్షాలను ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. నాడు నానమ్మ రాజ్యాంగానికి తూట్లు పొడిచిందనీ అనేక సార్లు వారికి అనుగుణంగా రాజ్యాంగాన్ని మార్చారని అన్నారు. నేడు మనవడు రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతూ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమర్జెన్సీ చీకటి రోజులను కాంగ్రెస్ ఉన్నన్నాల్లు ప్రజలు గుర్తు పెట్టుకుంటారని అన్నారు.

## ఆర్ఐ స్టోర్, ఎంటి సెక్షన్ ఆఫీస్‌లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** నారాయణపేట పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని ఆర్ఐ. స్టోర్‌ను, ఎం టి సెక్షన్ ఆఫీస్, స్టోర్ రూమ్ లను బుధవారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పలు సూచనలు చేశారు. స్టోర్ లోని వస్తువులను అన్ని క్రమ పద్ధతిలో ఉంచాలని, 5ఎస్ ఇంప్లిమెంటేషన్ చేయాలని సూచించారు. పోలీసుల సంక్షేమం కొరకు వచ్చే వస్తువులను అందరికీ లిస్ట్ ప్రకారం ఇవ్వాలని వాటి రికార్డ్స్ మెయింటైన్ చేయాలని ఎస్పీ తెలిపారు. అలాగే భవిష్యత్తులో స్టోర్ నిర్వహణ మరింత పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవా లని స్పష్టం చేశారు. ఉపయో గంలో లేని వస్తులని, ఫర్నిచర్ ని వేలం వేయాలని సూచిం చారు. అనంతరం పోలీసు మోటర్ ట్రాన్స్పోర్ట్ సెక్షన్ ను తనిఖీ చేసి, పోలీసు వాహ నాలకు సంబంధించిన అన్ని రికార్డులను ప్రతిదీ ఆన్లైన్లో నమోదు చేయాలని సూచిం చారు. స్టోర్ నిర్వహణ పద్ధ తులు సుద్ధిగా ఉండాలని తెలిపారు. వాహనాల నిర్వ హణలో నిర్లక్ష్యం చోటు చేసు కోరాదని సూచించారు ప్రతి వాహనానికి సంబంధించిన స్పేర్ వస్తువులను జాగ్రత్తగా ఉంచి అవసరమైన వాహనా లకు పార్ట్స్ మార్చాలని తెలి పారు. మెకానిక్ ,డ్రైవర్స్, స్టాఫ్ అందరు బాధ్యతాయు తంగా పనిచేయాలని ప్రతి వస్తువుకు సంబంధించిన విషయాలను, సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. అన్ని పోలీస్ స్టేషన్లోని నిరుపయోగంగా ఉన్నా వాహనాలను, పాత వాహనాలను త్వరలో వేలం వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్సై శివశంకర్, స్టోర్ ఇంచార్జ్ ఏ ఆర్ ఎస్సై శంకర్‌జి, రైటర్ నరేష్‌లో ఉన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు కూచుకూల రాజేష్ రెడ్డి



**బిజినేపల్లి, జూలై 2 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదలందరికీ ప్రజా ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచి కూల రాజేష్ రెడ్డి అన్నారు బుధవారం మండల పరిధిలోని పాలెం గ్రామంలో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా ఇవ్వలేదని ఆయన అన్నారు ప్రజా ప్రభుత్వం లో అర్హులైన ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిర మ్మ ఇండ్లు వారిని ఆదుకుంటామని అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బలహీన వర్గాలను ఆదుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ ఒక్కటి ఒక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు రాబోయే రోజులలో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు రానివారు ఎవరు కూడా అధైర్యపడవద్దని సెకండ్ లిస్టులో తప్పకుండా వారికి ఇండ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామనే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కథలప్ప, హౌసింగ్ ఏఈ అంజలి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మిద్దె రాములు, వెంకట్ స్వామి, అమృత్ రెడ్డి, పండ్ల పాషా, నజీర్, తిరుపతయ్య, రామకృష్ణ, అవంతి శంకర్, గోవిందు నాయక్, రామన్ గౌడ్, తిరుపతయ్య, వెంకటేష్ గౌడ్, మస్కూరి బంగారయ్య, ఈశ్వర్, జయకృష్ణ, శ్రీకాంత్, మోహన్ రెడ్డి, తదితరులున్నారు.

## పాలెం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా టీకాల అధికారి



**బిజినేపల్లి, జూలై 2 (జనం సాక్షి) :** మండల పరిధిలోని పాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని గర్భిణీ స్త్రీలు పిల్లల కు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందుతున్నావా లేవా అని తెలుసుకోవడం జరిగింది. రికార్డులను పరిశీలించారు అదేవిధంగా షుగర్ బిపి పేషెంట్లకు అందుతున్న సేవలు గురించి హారా తీశారు. అదేవిధంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్ 2025 గురించి ఆరా తీశారు జూన్ 16 నుండి జూలై 31 వరకు నిర్వహించే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా 0 నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ముందస్తుగా రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లను 14 జింక్ మాత్రలను అందజేయాలని సూచించారు. అన్ని అంగన్వాడి కేంద్రాలలో ఆరోగ్య ఉప కేంద్రాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ జింకు కారణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా 10 నుండి 12 కుటుంబాలను ఒక దగ్గర సమావేశపరిచి డయేరియా నివారణ పరిశుభ్రమైన నీరు చేతుల పరిశుభ్రత ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసే విధానం వయస్సును బట్టి ఎంత పరిమాణం ఇవ్వాలో ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. అన్ని అంగన్వాడి కేంద్రాల్లో మరియు పాఠశాలల్లో కళాశాలలో హ్యాండ్ వాష్ డిమానిస్ట్రేషన్ చేసి చూపించాలని తెలియజేశారు. బహిరంగ మలవిసర్జన నష్టాలు వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించవలసిన ఆవశ్యకత గురించి అవగాహన కలిగించాలని సూచించారు అనంతరం స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ విధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటి వల్ల వచ్చే టైఫాయిడ్ జాండీస్ నీల విరేచనాల గురించి వివరించారు. దోమల వల్ల కలిగే మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా ఫైలేరియా మెదడువాపు వ్యాధులు వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత కాపాడుతూ ప్రతి ఒక్కరూ సుఖమయ జీవితం గడపాలని తెలిపారు ప్రతి శుక్రవారం పొడి దినం (డ్రై డే) ప్రతి ఒక్కరూ నిర్వహించాలని సూచించారు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తెలియజేశారుఇట్టి కార్యక్రమంలో ఎంపీహెచ్వో బాదం రాజేశ్వర్ హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ ఏఎన్ఎం గజవర్ధనమ్మ మల్లిక ఆశా వర్కర్లు జయమ్మ పార్వతి విజయ లీల వరలక్ష్మి శమేం పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** రోగులకు మెరు గైన వైద్య సేవలు అందిస్తేనే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం, భరోసా కలుగుతా యని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో విస్తృతం గా పర్యటించి అర్బన్ హెల్త్ సెంటర్,అంగన్ వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను తని ఖీ చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో గల అర్బన్ హెల్త్ సెంటర్ కు వెళ్లి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అర్బన్ హెల్త్ సెంటర్ కు రోజు కు ఎంతమంది ఓపి (అవుట్ పేషంట్స్,), ఐ పీ (ఇన్ పేషం ట్స్) వస్తుంటారని అక్కడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర సింహారావు నగరిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి రికార్డులను,మందుల పంపి ణీ రిజిస్టర్లను పరిశీలించారు. అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచుకోవా లని సూచించారు. సెంటర్ కి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతు న్నాయని అడిగి తెలుసుకు న్నారు. అంగన్ వాడీ కేంద్రానికి వెళ్లి పట్టణంలోని ధూల్ పేటలో గల అంగన్వాడి కేంద్రానికి ఆకస్మికంగా వెళ్లిన అదనపు కలెక్టర్ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, బోధన తీరును పరిశీలించా రు. కేంద్రంలో మొత్తం ఎంత మంది చిన్నారులు ఉన్నారని అడిగి, చిన్నారుల ఎత్తు, బరు వు ను చూశారు. కేంద్రానికి వచ్చిన ఆట పరికరాలు, బోధనా పరికరాలతో పాటు బియ్యాన్ని, కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఉర్దూ పాఠశాలను మార్చాలని ఆదేశం దూల్‌పేటలోని ఓ అద్దె భవనంలో కొనసాగుతున్న హాజిఖాన్‌పేట ఉర్దూ ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య( 25 మంది) ను బట్టి హాజిఖాన్ పేటలోని ఆ ఉర్దూ పాఠశాలను ధూల్ పేటలోని అద్దె భవనంలో గత కొన్నేళ్ళ నుంచి కొనసాగిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఆ భవనం కూలి పోయే స్థితికి చేరింది. బుధ వారం ఆ ఉర్దూ పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, వెంటనే ఆ ఉర్దూ పాఠశాలను కూరగాయల మార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గల ప్రాథమిక పాఠశాలలోకి మార్చాలని ఎంఈఓ బాలాజీని ఆదేశించారు.

## లింగ వివక్షత లేకుండా మగవారితో సమానంగా అన్ని రంగాలలో రాణించాలి

- విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందేల విద్యా బోధన సాగించాలి
- స్టేట్ చైల్డ్ ప్రొటెక్షన్ కమీషన్ చైర్పర్సన్ సీతాదయాకర్ రెడ్డి
- బిజినేపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శన



**బిజినేపల్లి, జూలై 2 (జనం సాక్షి) :** లింగ వివక్షత లేకుండా మగవారితో సమానంగా అన్ని రంగాలలో బాలికలు రాణించాలని, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందేలా విద్యాబోధన సాగించాలని స్టేట్ చైల్డ్ ప్రొటెక్షన్ కమీషన్ చైర్పర్సన్ సీతాదయాకర్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం కమీషన్ సభ్యులతో కలిసి సందర్శించి బాలికలకు అందుతున్న పౌష్టికాహారం, విద్యబోధన, మౌళిక వసతుల కల్పనను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. లింగవివక్షత లేకుండా మగవారితో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. పాఠశాల విద్య భవిష్యతుకు పునాదిగా మల చుకోవాలన్నారు. సమాజంలోని మంచి చెడులపై అవగాహన కల్గి ఉండి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా ధైర్యంగా అడుగు వేస్తేనే విజయం సాధిస్తామని పురుషుల కన్నా మహిళలే అన్ని రంగాల్లో రాణించగలరనే విధంగా ప్రతిరంగంలో ప్రతిభ చూపాలని ఉద్బోధించారు. పదవ తరగతి తర్వాత బాలబాలికలు చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు లోనవ్వకుండా లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని అన్నారు. అలాగే ఉన్నత పాఠశాలను ఇంటర్ వరకు అప్గ్రేడ్ చేసేలా ప్రభుత్వం ఆలోచిస్తుందని త్వరలో ఆదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహారి, సరిపడ బోధన సిబ్బంది ఉండడంతో పాటు గతేడాది వందశాతం జల్స్ తో పాటు ఐదు వందలకు పైగా మార్కులు సాదించిన విద్యార్థులను అభినందించారు. అలాగే ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట కమీషన్ సభ్యులు వేదన్కుమార్, ప్రేమలత అగర్వాల్, అపర్ణ, సరిత, వందన, లక్ష్మణ్ గౌడ్, డీఈవో రమేష్కుమార్, నాయాబ్ తహసీల్దార్ చిక్కుడు రవికుమార్, ఎం. ఈవో రఘునాద్ శర్మ. జీహెచ్ఎం నివేదిత తదితరులు ఉన్నారు.

# కబ్జా చేయడంలో న్యూ 'విజన్'

- డబ్బు పడేస్తే ఏ స్థాయి పనులైన అవుతాయని ధీమా
- ఏ పార్టీ అధికారంలో ఉంటే వారితో జత
- కనీస విలువలు లేని యాజమాన్యం
- కబ్జాకు సహకరించిన వారి పై చర్యలు శూన్యం
- జిల్లా కేంద్రంలో అధికారుల మీనమేషాలు
- కాల్వలో సెప్టిక్ ట్యాంక్ తొలగింపు ఎప్పుడు?





**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ఖమ్మం నగరంలో కబ్జా చేయడంలో న్యూ విజన్ స్టైలే వేరు. పిల్లలకు ప్రమాదం జరిగితే కాని స్పందించని న్యూ విజన్ యాజమాన్యం భావిస్తున్నట్లుగా స్పష్టమవుతుంది. కబ్జా చేసి నిర్మించినట్లుగా అతని మ్యాప్‌లో స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక్కసారి చెబితే పని జరిగిపోతుంది అలాంటిది న్యూ విజన్ స్కూల్ ఆక్రమణలు తొలగించమని గతేడాది చెప్పినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేయడానికి కారణం ఏమై ఉంటుందో అంతు చిక్కని ప్రశ్నగా మారింది. మళ్లీ వరదలు వచ్చే అవకాశం ఉంది. గత కొన్ని రోజుల నుంచి వర్షం కురుస్తున్న నేపథ్యంలో కాల్వలో వరద స్థాయి పెరిగింది. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవహిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో వరద కింది వరకు సాఫీగా వెళ్లకుండా ఈ కబ్జా చేసి కట్టిన న్యూ విజన్ స్కూల్ బిల్డింగ్ అడ్డంగా ఉన్నది. స్కూల్ కు సంబంధించిన సెప్టిక్ ట్యాంకులను ఏకంగా కాల్వలో నిర్మించాడు. ఆ అనుమతులు ఎవరిచ్చారో వారి పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాటిని వెంటనే తొలగించాల్సిన అవసరం ఉంది. కమీషనర్ నోటీసులు ఇచ్చిన బిల్డింగ్ ఖాళీ చేయకుండా వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతుంది యాజమాన్యం. పిల్లలకు ఏదైనా జరిగితే ప్రభుత్వం పై నింద మోపి ప్రభుత్వానికి వ్యతిరేకత రావాలని న్యూ విజన్ యాజమాన్యం భావిస్తున్నట్లుగా కుట్ర కోణం కనిపిస్తుంది. చిన్న పిల్లలు అందులో చదువుతున్నారు. తల్లిదండ్రులు ప్రాణంగా భావించి తమ పిల్లలను ఉన్నత పాఠశాలల్లో చేర్పించి వారికి మంచి చదువు అందించాలని కోరుకుంటున్నారు. అలాంటి వారి కలలను చెల్లాచెదురు చేసేందుకు న్యూ విజన్ యాజమాన్యం ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది.

### డబ్బు పడేస్తా అంత అయిపోద్ది

సామాన్య ప్రజల నుంచి విద్య పేరుతో దోచుకున్న కోట్లాది రూపాయల సొమ్ముతో విర్రవీగుతున్నది న్యూ విజన్ యాజమాన్యం. విద్యను అక్రమ వ్యాపారంగా మార్చుకొని విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం తాగిన సంస్థగా పేరుంది. స్కూల్ కు గ్రౌండ్ లేదు. వెంటిలేషన్ లేదు. మురుగు కాల్వ పక్కన భవనం ఉండటంతో పిల్లలు దుర్వాసన పీలుస్తున్న పట్టించుకునే పరిస్థితిలో యాజమాన్యం లేదు. ఆ దుర్వాసనకు అనేక మంది పిల్లలు మధ్యాహ్న భోజనం చేసే పరిస్థితి లేదు. పాఠాలు బోధించే సమయంలో ఆ దుర్వాసనతో అనేక మంది ఉపాధ్యాయు లు ఇబ్బంది పడుతున్నారు. ఎంత చెప్పిన మా పిల్లలు కాదుగా అన్నట్లుగా న్యూ విజన్ యాజమాన్యం వ్యవహరి స్తున్నది. విధ్యార్థుల ప్రయోనార్ధం న్యూ విజన్ పై డిఈఓ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

### ఏ పార్టీ ఉంటే పవర్ లో వారితో..

న్యూ విజన్ విద్యా సంస్థకు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో సన్నిహితంగా ఉండటం అలవాటు. చందాలు ఇచ్చామని తమ మాట ఎవరు కాదనరని భావిస్తుంటారు. ఇన్నాళ్లు అలాగే తమ దందాలను కొనసాగిస్తూ వచ్చారు. స్కూల్ ఫీజులు, ఇతరత్రా ఖర్చులు వంటి వాటిపై నియంత్రణ లేకుండా పోయింది. అచ్చం విద్యను వ్యాపారంగా మార్చి నడిబజారులో అమ్మేశారు. అయినా అధికారులు చర్యలు తీసుకోలేదు. దానికి ప్రధాన కారణం గత బిఆర్ఎస్ ప్రభుత్వం అనేది స్పష్టం. అన్ని తెలిసిన మాజీ మంత్రి పిఏ సహకారంతో అన్నింటిని నెట్టుకొచ్చారని తెలుస్తోంది. మాజీలు అధికారంలో లేకపోయే సరికి న్యూ విజన్ తమ అక్రమ సామ్రాజ్య విస్తరణకు ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది.

### డిఈఓ రాడు

న్యూ విజన్ కబ్జా తతంగం , స్కూల్ లో పిల్లలు పడుతున్న ఇబ్బందుల పై ఇంత చర్చ జరుగుతున్నా డిఈఓ స్కూల్ ని పరిశీలించిన దాఖలాలు లేవు. ప్రైవేట్ స్కూల్స్ నుంచి వచ్చే ఆదాయం జీతానికి రెండింతలు ఉండటంతో చర్యలు తీసుకోవడంలో విద్యా శాఖ వెనకడుగు వేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. స్వయాన ముఖ్యమంత్రి చేతిలో విద్యా శాఖ ఉందనే విషయం జిల్లా అధికారులు మరిచి నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా న్యూ విజన్ పై ఖమ్మం విద్యా శాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### రాజధానిలో హైడ్రా .. మరి ఖమ్మంలో

రాష్ట్ర రాజధానిలో హైడ్రా హడలెత్తిస్తుంది. రాజధానికి 200 కిమి దూరంలో ఉన్న ఖమ్మంలో హైడ్రా లాంటి అవసరం ఉన్నట్లుగా కనిపిస్తోంది. చెరువులను , నాలాలను , కాల్వలను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాలని రేవంత్ సర్కార్ సదుద్దేశంతో ముందుకు సాగుతోంది. ఖమ్మంలో భవిష్యత్తు తరాల కోసం వినియోగించాల్సిన కాల్వలను , నాలాలను న్యూ విజన్ లాంటి సంస్థలు మింగేసాయి. ప్రస్తుతం ఖమ్మం నగరంలో హైడ్రా లాంటి సంస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఓట్ల కోసం కాకుండా భవిష్యత్ తరాల అవసరాల కోసం రేవంత్ సర్కార్ పూనుకోవడం పట్ల మేధావులు, నిపుణులు, విశ్లేషకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. న్యూ విజన్ పై చర్యలు తీసుకోని పిల్లలు ప్రాణాలను కాపాడడంతో పాటు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# అక్రమ మద్యం వ్యాపారంపై ఎస్పీ ఉక్కు పాదం

- రూ.21.51 లక్షల మద్యం ధ్వంసం



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూలై 2 ( జనం సాక్షి) :** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో ఇటీవల నియమితులైన జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) కాంతిలాల్ పాటిల్ అక్రమ మద్యం వ్యాపారంపై ఉక్కుపాదం మోపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా చింతలమానేపెల్లి మండలం గూడెం గ్రామంలోని మద్యం షాపును ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. కానీ సంబంధిత వైన్ షాప్ నిర్వాహకులు అక్రమంగా మద్యం అమ్ముతూ.. పెద్ద మొత్తంలో అనుమతి లేకుండా మద్యం నిల్వలు చేశారు. దీంతో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు సమాచారం చేరింది. రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ అక్కడ ఒక రూమ్ లో అక్రమంగా నిల్వ ఉంచిన 10,152 బీరు సీసాలు,870 మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నారు. బుధవారం రోడ్డు రోలర్ ద్వారా తొక్కించి ధ్వంసం చేయించారు. స్వయంగా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో చింతల మానేపల్లి మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ మద్య ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా అక్రమ కార్యకలాపాలు నిర్వహించి వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కౌటాల, బెజ్జూర్, సిర్పూర్ టి మండలాల పోలీస్ స్టేషన్ లను సందర్శించి తనిఖీలు చేశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని, సంఘ విద్రోహులు, నేరస్థులపై ఎప్పటికప్పుడు నిఘా వేసి ప్రజలకు నమ్మకమైన సేవలు అందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డిఎస్పి రామానుజం, కౌటాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్యం రమేష్, జిల్లా ఎక్సై జ్ సూపర్డెంట్ జ్యోతి కిరణ్, కాగజ్ నగర్ ఎక్సైజ్ రవి తదితరులు పాల్గొన్నారు.

# సైడ్ కాలువ నిర్మాణం చేయాలని వినతి



**నర్సంపేట జూలై 2 (జనం సాక్షి) :** నర్సంపేట మున్సిపాలిటీ లోని 20 వ డివిజన్ లో చుక్క కనుకయ్య ఇంటి వద్ద నుండి గిరగాని మల్లయ్య ఇంటి వరకు సైడ్ కాలువ నిర్మాణం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి మాజీ ఎంపీటీసీ రామగోని సౌందర్య-సుధాకర్ గౌడ్ బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా సౌందర్య మాట్లాడుతూ సైడ్ కాలువ ద్వంసం కావడం వల్ల ఇండ్ల లోని మురికి నీరు ప్రవహించడం జరుగుతుంది. దీంతో దుర్గంధం కావడం, దోమలు స్వయరవిహారం చేస్తున్నాయన్నారు. ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు. ప్రజల బాధ గుర్తించి దయామయులైన ఎమ్మెల్యే సైడ్ కాలువ నిర్మాణం, సీసీ రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని, అలాగే మిషన్ భగీరధ శాంతి నగర్ వాటర్ ట్యాంక్ నుండి మంచినీటి సరఫరా చేయాలని. వారు కోరారు

# ప్రైవేటు బడి వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు..

- ప్రైవేట్ స్కూల్ బస్సులను అడ్డుకున్న గ్రామస్తులు



**రేగొండ, జూలై 02(జనం సాక్షి):** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో యువకులు, వివిధ పార్టీ నాయకులు,గ్రామస్తులు బుధవారం ప్రైవేట్ స్కూల్ బస్సులను గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు.ప్రైవేట్ బడి వద్దు- ప్రభుత్వ బడే ముద్దు అంటూ పలు నినాదాలతో స్కూల్ బస్సులను ఆపి నిరసన వ్యక్తం చేశారు.గ్రామంలోని విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా గ్రామ ప్రభుత్వ పాఠశాలలోకి పంపి విద్యను అభ్యసించేలా విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు.వేలకు వేలు ఫీజులు చెల్లించి జేబులు గుల్ల చేసుకోవద్దని ప్రభుత్వ పాఠశాలలో అన్ని ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కాదని ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులను వారు కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ స్కూల్ చైర్మన్ ఊకంటి నిర్మల,ప్రైమరీ స్కూల్ చైర్మన్ మచ్చిక వసంత,నాయకులు నిమ్మల విజేందర్, రొంటాల వెంకటస్వామి,జున్నుపాల కుమారస్వామి,అకుతోట తిరుపతి, దేశ్మీ కిరణ్,మచ్చిక శివ శంకర్,గ్రామస్తులు కోడారి సురేష్,ఈర సతీష్,సుంకరి వినయ్,భాషబోయిన ఓదాకర్,లాంచాని శివ,సుంకరి శ్రీధర్,కుక్కల రమేష్, గంగదారి తిరుపతి, తదితరులు ఉన్నారు.

# పక్కాగా ఆన్లైన్ జీరో పర్మిట్ విధానం

- టీజీఎండీసీ ద్వారానే ఇసుక కొనుగోలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి, జులై 2 (జనంసాక్షి) :** జిల్లా లో ఆన్‌లైన్ జీరో పర్మిట్ సిస్టమ్‌ని పక్కాగా అమలు చేయాలనీ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇసుక, కంకర, తదితర ఖనిజ వనరులకు సంబంధించి ఆన్లైన్ జీరో పర్మిట్ సిస్టం, టీజీ ఎండిసి ద్వారా ఇసుక అనుమతులు తీసుకునే విధానంపై మైనింగ్, టీజీ ఎండిసి, ఇరిగేషన్ పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా లికలెక్టర్‌లి మాట్లాడుతూ... ఇసుక అక్రమ రవాణా పైన ప్రభుత్వం కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి చిన్న తరహా ఖనిజాలైన కంకర, మట్టి, ఇసుక కోసం ఆన్లైన్ జీరో పర్మిట్వి ధానం ద్వారా అనుమతులు తీసుకునే విధంగా కాంట్రాక్టర్లకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఆన్లైన్ జీరో పర్మిట్ ను అధికారులు తప్పకుండ అమలు చేయాలని, ప్రభుత్వ పనులను చేపట్టిన కాంట్రాక్టర్లు ఆన్లైన్ జీరో పర్మిట్ కు దరఖాస్తు చేసినట్లయితే వెంటనే ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఆమోదించాలన్నారు. తద్వారా జీరో ఆన్లైన్ పర్మిట్ విధానం ఏర్పరచి.. ఎక్కడ కూడా అక్రమ ఖనిజ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నట్లవుతుందన్నారు. వివిధ నిర్మాణాలకు ఇంజనీరింగ్ శాఖలకు ఎంత మేరకు ఇసుక అవసరం అవుతుందో వివరాలను విధిగా టీజీ ఎండిసికి సమర్పించాలన్నారు. ఎక్కడ కూడా ఇష్టారీతిన ఇసుకను, చిన్న తరహా ఖనిజాలు తీయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇసుక విధానం, అనుమతులు ఉండాలన్నారు. వర్ష కాలం ప్రారంభం అయినందున... ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రహదారుల రిపేర్ లు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఏడీ విజయ్ కుమార్ వివిధ ఇంజనీరింగ్ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మైనింగ్ అధికారులతో రివ్యూ మీటింగ్

- మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి



**చెన్నూర్,జూలై 2 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కార్మిక గనుల శాఖ మంత్రి డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి మైనింగ్ అధికారులతో పున సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ అధికారులు నియమ నిబంధనలు పాటిస్తూ పనులు నిర్వహించే సమయంలో భద్రత ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించే దిశగా మైనింగ్ రంగాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మైనింగ్ శాఖ అధికారులతో పాటు వివిధ జిల్లాల మైనింగ్ విభాగాలు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

# పట్టుబడ్డ మద్యం భూమిపాలు



**చింతలమానేపల్లి జూలై 2 (జనం సాక్షి) :** తెలంగాణలో ఎమ్మెల్సీ ఎలక్షన్స్, మహారాష్ట్రలో అసెంబ్లీ ఎలక్షన్స్ సమయంలో గూడెం గ్రామ శివారు లలో నిల్వచేసిన మద్యంపై విశ్వసనీయ సమాచారం మేరకు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. పెద్ద మొత్తంలో మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆదిలాబాద్ జిల్లా ఎక్సైజ్ కమీషనర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్ మరియు రెవెన్యూ శాఖ అధికారులు ఇంచార్జ్ తహసిల్దార్ మడవి దౌవులత్, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, పంచులు స్థానిక పోలీసుల సమక్షంలో 21,50,890 విలువైన మద్యాన్ని, రోడ్డు రోలర్ ద్వారా పూర్తిగా ధ్వంసం చేసారు. అంతకుముందు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పటేల్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, పోలీస్ స్టేషన్ అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులను, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాగాజ్ నగర్ డీఎస్పీ రామానుజన్, కౌటాల సిఐ రమేష్, ఎక్సైజ్ సిఐ రవి, ఎస్సై ఇస్లావత్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక లోడింగ్ చేస్తలేరని లారీ డ్రైవర్ల నిరసన



**మహదేవపూర్, జూలై 2 (జనంసాక్షి) :** లారీలు బెగ్లూర్ 1ఇసుక క్వారీ కి వచ్చి 8 రోజులు గడుస్తున్నప్పటికీ లారీలకు ఇసుక లోడింగ్ చేయడం లేదని క్వారీకి సంబంధించిన కాంట్రాక్టర్ కానీ టీజీఎండిసి పిఓ పట్టించుకోవడంలేదని సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని లారీ డ్రైవర్లు మహదేవపూర్ ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు రోడ్డుపై బెటాయించి నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడుతూ.. బెగ్లూర్ 1ఇసుక క్వారీకి లారీలు ఇసుకలోడుకోవచ్చు 8 రోజులు గడుస్తున్నప్పటికీ కానీ ఆ క్వారీకి చెందిన కాంట్రాక్టర్ కాని టిఎస్ఎండిసిపిఓ కానీ ఇసుక లోడింగ్ చేయడం లేదని బుధవారం రోజున లారీ డ్రైవర్ లంతా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడానికి వచ్చినట్లు డ్రైవర్లు తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఏమీ ఉండదని పోలీసులు తెలుపగా డ్రైవర్లకు సరైన సమాధానం దొరకకపోవడంతో మహదేవపూర్ ప్రధాన రహదారిపై లారీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేస్తు క్వారీలో ఉన్న లారీలు ఇసుకలోడు చేయాలంటూ రహదారిపై బెటాయించారు. కొద్దిసేపు వచ్చిపోయే వాహనాలు నిలిచిపోయాయి. లారీ డ్రైవర్లు రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో ఎస్సై పవన్ కుమార్ కు సమాచారం తెలవగానే సంఘటన స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్లకు సమాధానం చెప్పి టీజీఎండిసి పీ ఓ తో మాట్లాడుతానని డ్రైవర్లకు చెప్పి ఆందోళనను విరమిం పజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో 200 లారీ మంది డ్రైవర్లు పాల్గొన్నారు.

# అనధికార లేఅవుట్ తొలగింపు

- తిమ్మాపూర్ శివారులో అనధికార లే ఔట్ తొలగింపు



**వరంగల్ ఎంజీఎం, జూలై 2(జనంసాక్షి):** బల్దియా పరిధి లోని తిమ్మాపూర్ శివారు ప్రాంతం సర్వేనెంబర్ 125 లో అనధికారికం గా ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్ ను తొలగించినట్టు బల్దియా అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఖలీల్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో తిమ్మాపూర్ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్ నిర్మాణాలను తొలగించడం జరిగిందని, ఏమైనా నిర్మాణాలు చేపట్టాలంటే కచ్చితంగా బల్దియా అనుమతులు తప్పనిసరి అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టి పి ఎస్ లు అనిల్, అవినాష్, టి పి బి ఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### సెయింట్ మేరీ పాఠశాలను మూసివేయాలి




**రాయపర్తి,జులై 02(జనంసాక్షి):** రాయపర్తి మండలంలోని సెయింట్ మేరీ పాఠశాల వెంటనే మూసి వేయాలని టిఎస్ఎఫ్,బిఎస్ఎఫ్,టీజీవిపి విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ముందు బుధవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు టిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నం సునిల్,టీజీవిపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడ రంజిత్,బిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాడపాక రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా కనీస వసతులు,అర్హత కలిగిన బోధన సిబ్బంది లేకుండా,వ్యవసాయ భూమిలో డిటిసిపిఓ నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండ ఎకరం ఇరవై ఐదు గుంటలలో రేకుల షెడ్డులల్లో పాఠశాల నడుపుతున్నారని,రేకుల షెడ్డులలో విద్యార్థులకు జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు అన్నారు.ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం ప్రైవేట్ పాఠశాలకు గుర్తింపు ఇవ్వాలంటే పక్కా బిల్డింగ్ తప్పనిసరని కానీ సెయింట్ మేరీ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని,కావున జిల్లా కలెక్టర్,డీఈవో వెంటనే కాట్రపల్లి సెయింట్ మేరీ పాఠశాల గుర్తింపు రద్దుచేసి యాజమాన్యం మీద క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జరిపోతుల వంశీకృష్ణ,నాగారం మణితేజ,రామంచ శ్రీను, నాగరాజు, విజయ్, రవి, రమేష్, కార్తీక్, బన్నీ ,అరుణ్,రాంబాబు,రాజా రవి,చందు,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ రాజు

**గద్వాల నడిగడ్డ, జూలై 2 (జనం సాక్షి) :** సాంకేతిక పరిజ్ఞానం తో కొత్త కొత్త మార్గాలలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, ఆశ,అత్యాశ లే సైబర్ నేరగాళ్ల పెట్టుబడి అని జోగులాంబ గద్వాల సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిఐ రాజు అన్నారు. జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు సైబర్ జాగృతి దివాస్ సందర్భంగా బుధవారం గద్వాల పట్టణం లో కొట్టం కాలేజ్ విద్యార్థుల కు, సైబర్ అవేర్నెస్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానం తో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. డబ్బుల పోయాక బాధపడటం కంటే అవగాహనా తో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజలనూ మోసం చేస్తున్న విధానాన్ని సీఐ కళాశాల యువతకు తెలియజేశారు. జంప్డ్ డిపాజిట్ స్కీం, డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, సైబర్ బుల్లింగ్ గురించి విద్యార్థులకు సీఐ అవగాహన కల్పించారు.మన ఆశ, అత్యాశ లే సైబర్ నేరగాళ్ల పెట్టుబడి అని, డబ్బులు ఎవ్వరు ఉరికే ఇవ్వరు అనే విషయాన్నీ ప్రజలు గ్రహించాలని అన్నారు. అలాగే బ్యాంక్ అదికారులు ఎవరు కూడా ఫోన్ చేసి ఓటీపీ వివరాలు అడగరు అనే విషయాలను గుర్తించాలని ,బ్యాంక్ వారు ఏలాంటి మెసేజ్ లు గాని, లింక్స్ పంపరని ఇట్టి విషయాలు యువత కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, ఏమైన సందేహాలు ఉంటే బ్యాంక్ కు వెళ్లి నిర్ధారించుకోవాలి అని అన్నారు.అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం అంటూ ఏదైనా ప్రభుత్వ శాఖ వారు అని ఫోన్ చేసి ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దు అని అలాంటి వారు




ఓటీపి అడుగరనే విషయన్ని గ్రహించాలని అన్నారు. ప్రజలు, గ్రూప్‌లలో లేదా వ్యక్తిగత నెంబర్ లకు అపరిచిత వ్యక్తుల నుండి ఎస్ ఎమ్ ఎస్ ఈ మెయిల్స్ ద్వారా గాని, వాట్సాప్ ట్యీట్టర్ ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్ ను క్లిక్ చేసి మోసపోవద్దని, అలా వచ్చే మెసేజ్ లకు స్పందించవద్దు, చిన్న చిన్న తప్పిదాలతో తాము కష్ట పడి సంపాదించిన డబ్బును పోగొట్టుకోవద్దని విద్యార్థులకు సూచించారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే స్పందించి 1930కి సమాచారం అందించి ఎన్ సి ఆర్‌పి పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారు. తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో కానిస్టేబుల్ రమేష్ ఆచారి, గద్వాల టౌన్ సైబర్ వారియర్ బి రాజు, కలశాలల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పేరిట కోట్లు దండుకున్నది కల్వకుంట్ల కుటుంబం

- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



**కొల్చారం, జూలై 2 (జనం సాక్షి) :** తెలంగాణ సెంటిమెంటుతో ప్రజలను నట్టేట ముంచి కాళేశ్వరం పేరిట కోట్లు దండుకున్న కల్వకుంట్ల కుటుంబం ప్రజలలో అస్తిత్వం కోల్పోయిందని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ లు ఆరోపించారు. బుధవారం నాడు మండల పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొల్చారం, అప్పాజీపల్లి, రంగంపేట, తుక్కాపూర్,పైతర, కోనాపూర్, ఎనగండ్ల గ్రామాలలో మంజూరై నటువంటి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాజిరెడ్డి, ఆంజనేయులు గౌడ్ లు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో గతం లో డబుల్ షూటర్ అని చెప్పుకున్న నాటి ఆర్థిక మంత్రి హరీష్ రావు ఏ ఒక్కరి పేదోడి కైనా ఇల్లు ఇచ్చిన పాపాన పోలేరని వ్యాఖ్యనించారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి, మహాలక్ష్మి,రైతు భరోసా రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను చూసి ఓర్వలేక నే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది ఏళ్లలో కేవలం రైతు బంద్ పథకం తో ప్రజలలో పబ్బం గడుపుకోగా విరక్తిచెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని స్పష్టం చేశారు.మాట తప్పని మడమ తిప్పని కాంగ్రెస్ ప్రభుత్వంను ఆశీర్వదిస్తూ స్థానిక ఎన్నికలలో అత్యధికంగా సర్పంచ్, ఎంపీటీసీ లను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సోమన్న గారి రవీందర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, యెల్లు గారి శ్రీనివాస్ రెడ్డి, మరెల్లి అనిల్,మాజీ సర్పంచ్ లు మాదవి శ్రీశైలం, నాయిని వెంకట్ గౌడ్( గజిని), శ్రీశైలం, మన్నే శ్రీనివాస్, నర్సిములు, వడ్ల లక్ష్మి పతి, బండి రమేష్, శేఖర్, మహేశ్వర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి,బాల్ రాజ్, జయరాం రెడ్డి,అక్రమ్, గోవర్ధన్, లింగన్న గారి ప్రవీణ్ రెడ్డి, పాండు రంగారెడ్డి, అశోక్, దన్ రాజ్,ఆగం గౌడ్, రవీందర్ గౌడ్, బండి మల్లేశం, పాపయ్య, మన్నెకిష్టయ్య పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలి



**తలకొండపల్లి, జూలై 2 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకొని బిల్లులను పొందాలని డిఈ సురేష్ అన్నారు.బుధవారం తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో ఏఈ రాంచంద్రయ్య అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం సూచనల మేరకు ఇంటి నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు.త్వర్తి గతిన బేస్మెంట్ కంప్లీట్ చేసుకున్న వారికి బిల్లులు చెల్లిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అజీజ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు హీనా ఆరిఫ్,పులిజాల విష్ణు,గ్రామపంచాయతీ కారోబార్ జి.రవి తదితరులు ఉన్నారు.

## నిర్వాసితుల తరలింపు పట్ల అప్రమత్తంగా ఉండాలి



**పినపాక, జూలై 2 (జనం సాక్షి) :** వర్షాకాలం ప్రారంభమైనందున జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోదావరి వరదలు మరియు స్థానిక వాగుల వలన ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలో శాఖల వారీగా తీసుకోవలసిన ముందస్తు చర్యల పై పినపాక మండల కేంద్రంలో ఎంపీడీఓ అధ్యక్షతన సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. అన్నీ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీల్ కుమార్,ఇంచార్జ్ తహశీల్దార్ గోపాల కృష్ణ, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎంపీవో వెంకటేశ్వరరావు లు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదావరి, పెద్ద వాగు ముంపు ప్రాంతాలలో, కట్టుదిట్టమైన భద్రత చర్యలను చేపట్టాలని, వరదలు పట్ల అప్రమత్తం గా ఉంటూ ఎప్పటికప్పుడు మండల కేంద్రంలోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని, లోతట్టు, ముంపు ప్రాంత నిర్వాసితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, వారికి అవసరమైన భోజన వసతులు సిద్ధం చేసుకోవాలని సమావేశం లో సూచించారు. అలాగే ముంపు ప్రాంతాల్లో హెల్త్ క్యాంపు ల నిర్వాహణ, శానిటేషన్, తాగునీరు విద్యుత్, సౌకర్యాలు కల్పన, ప్రత్యమ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ముంపు ప్రాంతాల బాధ్యులు ఆయా గ్రామాల్లోనే బస చేయాలని, అక్కడి సమస్యలు, ఇబ్బందులపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లకు సమాచారం ఇచ్చేందుకు సిద్ధంగా వుండాలన్నారు. ఉదాసీనంగా వ్యవహరించే అధికారుల పట్ల చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్ జిల్లా బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన స్థానిక శాసన సభ్యులు మైనం పల్లి రోహిత్ రావు. ఈ సందర్భంగా మైనం పల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధిపరిచేందుకు 30 కోట్ల రూపాయల తో మెదక్ చర్చి, అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశామన్నారు. ఈరోజు మెదక్ మున్సిపాలిటీ పరిధిలో. 03 కోట్ల 65 లక్షలు రూపాయలతో సుభాష్ నగర్ కాలనీలో కోటి 40 లక్షల రూపాయల తో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేశామని,2 కోట్ల 13 లక్షల వ్యయంతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చర్చిలో మేన్ గేట్ నుండి చర్చి వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. 8 లక్షల రూపాయల వ్యయంతో వెంకట్రావు నగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంనిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు.



వచ్చే నాలుగేళ్లలో మెదక్ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామన్నారు. ఇది వరకు కాలనీలలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో అభివృద్ధి దిశగా ముందుకు పోతున్నామన్నారు. అనంతరం మున్సిపాలిటీలో శానిటేషన్ వర్కర్లకు శానిటేషన్ పరికరాలు రైన్ కోట్స్, మాస్కులు, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్స్,ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవ ప్రతీక

**మెదక్ జిల్లా బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** నిరుపేద కుటుంబాలకు ఇంటి కలను నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం హవేలీ ఘన్పూర్ మండలం లోని రాజపేట్ మరియు కొత్తపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను, గ్రామ పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి పథకాలు పారదర్శకంగా అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ఇల్లు అన్నది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రధానమైన అవసరమని..ఇది కేవలం గృహం కాదు, ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చే ఆశ్రయమన్నారు అలాగే, లబ్ధిదారులు పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటి నిర్మాణంలో పారదర్శకత, నాణ్యత కచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వ నిధులు నిజంగా అర్హులైన వారికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు . ప్రతి లబ్ధిదారుడూ తమ హక్కుగా మంజూరైన ఇల్లు నిర్మించుకునే వరకు అధికారులు పర్యవేక్షణ



చేస్తున్నారని చెప్పారు. గ్రామాలకు పరిశుభ్రంగా ఉంచాలని మురుగనీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని,ప్రజలు పరిసరాలు వ్యక్తిగత శారీరక పరిశుభ్రతపై దృష్టి సారించాలని, ప్రజలు వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, దోమల నిర్మూలనకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తద్వారా డెంగ్యూ మలేరియా విష జ్వరాలు సోకకుండా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

- పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు 143 మంది
- గుర్తించలేని మృతదేహాలు 20, గల్లంతైనవారు 10 మంది
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 2 (జనం సాక్షి) :** ఇస్నాపూర్ మండలం పాశ మైలారంలోని సిగాచి పరిశ్రమలో రిస్క్యూ ఆపరేషన్, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, బాధిత కుటుంబాలకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. మూడు రోజులపాటు పరిశ్రమలలో కలెక్టర్ పి. ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ లు సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఘటనా స్థలాన్ని వారు తరచూ సందర్శించి సహాయక బృందాలకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....బాధిత కుటుంబాలకు భోజనం, తాత్కాలిక నివాసం, రవాణా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. బాధిత కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు.బాధితులు వారి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు అవసరమైన రవాణా ఏర్పాట్లు చేసామన్నారు. ఓడిశా, బీహార్ రాష్ట్రాల అధికారులు కూడా సహాయక చర్యలు అందిస్తున్నారని తెలిపారు.

సిగాచి పరిశ్రమ అధికారికంగా అందిన వివరాల ప్రకారం పరిశ్రమలో మొత్తం 143 మంది ఉద్యోగులు ఉన్నట్లు వివరాలు అందించారన్నారు. సురక్షితంగా ఉన్నవారు 60,గాయపడి చికిత్సపొందుతున్నవారు 35, గుర్తించబడిన మృతుల సంఖ్య 18, గుర్తించలేని మృతదేహాలు 20, గల్లంతైనవారు 10, మంది ఉన్నారు.కుటుంబాలకు అప్పగించిన మృతదేహాలు 18, ప్రయోగశాలలో డిఎన్ఏ ఫలితాల కోసం పెండింగ్‌లో 18 నమూనాలు ఉనాయన్నారు.ఇంకా సేకరించాల్సిన మృతదేహాల నమూనాలు 2, పరీక్షించాల్సిన కుటుంబ సభ్యుల రక్త నమూనాలు 25, ఇంకా 5 కుటుంబాల నుండి సేకరించాల్సి ఉంది.గుర్తించలేని కుటుంబాల సంఖ్య 3, డిఎన్ఏ ద్వారా మ్యాచ్ అయిన నమూనాలు 5,పూర్తయిన పోస్టుమార్టం 36,

### మృతుల కుటుంబాలకు రూ.1 లక్ష మంజూరు..

మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ. 1 లక్ష మంజూరు అయినట్టు కలెక్టర్ తెలిపారు.గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున మంజూరయ్యాయని తెలిపారు.18 మృతుల కుటుంబాలకు రూ.1,00,000 చొప్పున,గాయపడిన 34 మంది కి రూ.50,000 చొప్పున తాత్కాలిక సహాయం అందజేశారు.మిస్సింగ్ అయిన 10 కార్మికుల కుటుంబాలకు రూ.10,000 చొప్పున తాత్కాలిక సహాయం అందించడం జరుగుతుందన్నారు.బాధిత కుటుంబాలు లేదా వారి బంధువులు సమాచారం కోసం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్ 08455-276155 ను సంప్రదించవచ్చు. ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా వారి అవసరాలపై సత్వర స్పందించడానికి సిబ్బంది కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలిపారు.

# డ్రాప్ అవుట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి

- విద్యార్థుల నమోదును మెరుగుపరచాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, జూలై 2 (జనం సాక్షి) :** డ్రాప్ అవుట్స్ సమస్యను పరిష్కరించడానికి, విద్యార్థుల నమోదును మెరుగుపరచడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నోడల్ అధికారులకు, ఎం.ఈ.ఓ లకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్ నందు ఇంటర్మీడియట్ అధికారిని మాధవి, జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, నోడల్ అధికారులు ఎంఈఓ లతో కలిసి ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి ఇంటర్మీడియట్ ఉత్తమ ఫలితాలు, డ్రాప్స్ ఎన్రోల్మెంట్ పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల నమోదును పెంచడం, డ్రాప్ అవుట్స్ యొక్క కారణాలను గుర్తించడం మరియు పరిష్కరించడం, విద్యార్థులకు మరింత మద్దతు మరియు ప్రోత్సాహాన్ని అందించడం, తల్లిదండ్రులను మరియు సమాజాన్ని డ్రాప్ అవుట్స్ సమస్యపై చైతన్యపరచడం. వంటి అంశాలపై చర్చించడం జరిగిందని తెలిపారు. ఉన్నతమైన విద్యా ప్రమాణాలతో విద్యా సంవత్సరం పదవ తరగతి ఇంటర్మీడియట్ ఫలితాలు మరింత మెరుగుపడే దిశగా కృషి చేయాలన్నారు. కష్టమైన సబ్జెక్టులపై మరింత శ్రద్ధ పెట్టాలనిలిఈసారి పదవ తరగతి ఫలితాల్లో ఇంటర్మీడియట్లో జిల్లాకి మొదటి స్థానం రావాలన్నారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులను తప్పనిసరిగా ఇంటర్మీడియట్లో నమోదు, ఇంటర్మీడియట్ పాస్ అయిన




వారిని డిగ్రీలు ఎన్రోల్మెంట్ తప్పనిసరిగా చేయించాలని, ఇందుకోసం పటిష్ట కార్యచరణ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు, సమన్వయం చేసుకొని ముందుకు పోవాలన్నారు. పదవ తరగతి పాస్ అయిన బాలికలకు తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేస్తారని ఎట్టి పరిస్థితుల్లోనూ జరగడానికి వెళ్లేదని ప్రతి విద్యార్థిని విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత తెలియజెప్పాలన్నారు. గ్రామీణ పేద విద్యార్థుల ప్రయోజనం కోసం ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా అమలు చేస్తున్న విద్యా ప్రమాణాలతో వారు లబ్ధి పొందాలన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు ఎంఈఓ లు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి పోలీసులు హత్య కేసు ఛేదన

- ముగ్గురు నిందితులు అరెస్ట్

**కూకట్‌పల్లి, జూలై 2 (జనంసాక్షి) :** కూకట్‌పల్లి పోలీసులు ఒక దారుణ హత్య కేసును ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన సంఘటన బుధవారం కూకట్పల్లి పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశంలో వెల్లడించారు. వివరాల్లోకి వెళితే 26 ఏళ్ల వ్యాపారవేత్త సయ్యద్ షాహెద్ హత్య కేసులో నిందితులైన వై. హనాక్ అలియాస్ మున్నా, ఎం.డి. సాజిద్, ఎం.డి. సమీర్ ఖాన్‌లను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయపరమైన కస్టడీకి పంపించారు. బోరబండకు చెందిన సయ్యద్ షాహెద్‌కు నిందితుల్లో ఒకరైన సమీర్‌తో గతంలో నుంచి విరోధం ఉంది. సామాజిక మాధ్యమాల్లో పరస్పర విమర్శలు, టెర్రిటరీ ఆధిపత్య పోరు నేపథ్యంగా షాహెద్ హత్యకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. షాహెద్‌కు పరిచయమున్న నిందితులు ముగ్గురూ కలిసి ప్లాన్ చేసి, జూన్ 29, 2025న పావన్ అనే వ్యక్తి పుట్టినరోజు సందర్భంగా దేవ్ ఇస్తానా హోమ్స్ వెనక ఉన్న ఓ ఓపెన్ గ్రౌండ్‌కు షాహెద్‌ను తీసుకెళ్లారు. అక్కడ మద్యం సేవల అనంతరం సాజిద్ షాహెద్ గొంతు కత్తితో కోసగా, మిగిలిన ఇద్దరూ రాళ్లతో తలపై దెబ్బలు కొట్టి హత్య చేశారు.

నిందితుల వివరాలు : వై. హనాక్ అలియాస్ మున్నా, వయసు 25, ప్రైవేట్ ఉద్యోగి, ఎం.డి. సాజిద్, వయసు 24, ఏసీ టెక్నీషియన్, ఎం.డి. సమీర్ ఖాన్, వయసు 25, ఫాల్స్ సీలింగ్ పని చేసేవాడు. సమీర్



ఖాన్ గతంలో జూబ్లీహిల్స్, సనత్ నగర్ , ఎస్ ఆర్ నగర్, బాలానగర్ పోలీస్ స్టేషన్లలో 379, 420, 354, 302 సెక్షన్ల కింద కేసులకు పాల్పడ్డాడని పోలీసులు వెల్లడించారు. అతనిపై బోరబండ పోలీస్ స్టేషన్‌లో యాక్టివ్ రౌడీ షీటర్‌గా ఉన్నాడు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన స్పెషల్ టీం, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో గట్టి విచారణ చేపట్టి తక్కువ సమయంలోనే కేసును ఛేదించింది. నిందితుల అరెస్టుతో హత్య కేసును పరిష్కరించడమే కాక, ప్రజల్లో భద్రతపై నమ్మకాన్ని నెలకొల్పారని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ కె. సురేశ్ కుమార్, ఐపీస్ తెలిపారు.

## మధ్యతరగతికి త్వరలో ఊరట: జీఎస్టీ తగ్గింపు?




కేంద్ర ప్రభుత్వం మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలకు ఊరట కల్పించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచిన తర్వాత, ఇప్పుడు మధ్యతరగతి, పేదలు ఎక్కువగా వినియోగించే వస్తువులపై జీఎస్టీ రేట్లను తగ్గించే యోచనలో ఉంది. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ శ్లాబును పూర్తిగా తొలగించడం లేదా ఈ శ్లాబులోని చాలా వస్తువులను 5 శాతం జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తోంది. దీనివల్ల ఈ వర్గాలపై ఆర్థిక భారం తగ్గనుందని అధికార వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

పేద, మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా ఉపయోగించే వస్తువులైన టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెజర్ కుక్కర్లు, వంటగది పాత్రలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మిషన్లు, సైకిళ్లు, రూ.1000 పైబడిన రెడీమేడ్ దుస్తులు, ఫుట్‌వేర్, స్టేషనరీ, వ్యాక్సిన్లు, సెరామిక్ టైల్స్, వ్యవసాయ ఉపకరణాలపై జీఎస్టీ తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రతిపాదన అమలైతే, ఈ వస్తువులు తక్కువ ధరకే లభ్యమవుతాయి.

ఈ నిర్ణయం వల్ల కేంద్ర ఖజానాపై రూ.40,000 నుంచి రూ.50,000 కోట్ల వరకు అదనపు భారం పడవచ్చని అంచనా. అయితే, జీఎస్టీ తగ్గింపు వల్ల వినియోగం పెరిగి, ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని, పన్ను వసూళ్లు దీర్ఘకాలంలో పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించి, దిగువ, మధ్యతరగతి వర్గాలకు ఊరట కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను అమలు చేయాలంటే, జీఎస్టీ కౌన్సిల్‌లో ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంటుంది. ఈ నెలాఖరులో జీఎస్టీ మండలి సమావేశం జరిగే అవకాశం ఉందని సమాచారం.

## ప్రీమియంతో హెచ్‌డిబీ ఫైనాన్షియల్ లిస్టింగ్




ముంబయి: హెచ్ఎఫ్డీసీ బ్యాంక్కు చెందిన హెచ్‌డిబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ బుధవారం స్టాక్ మార్కెట్లలోకి ఎంట్రీ ఇచ్చింది. దాదాపు 13 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యింది. ఇష్యూ ధర రూ.740తో పోలిస్తే ఎన్ఎస్ఈలో ఈ కంపెనీ షేరు 12.84 శాతం లాభంతో రూ.835 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టింది. బీఎస్ఈలోనూ ఇదే ప్రీమియంతో నమోదయ్యింది. అనంతరం ఈ షేర్లు ఫ్లాట్గా కొనసాగుతున్నాయి. హెచ్ఎబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రూ.12,500 కోట్ల మెగా ఐపీఓకు విశేష స్పందన లభించిన సంగతి తెలిసిందే. ఐపీఓలో భాగంగా 13 కోట్ల షేర్లు (13,04,42,855) విక్రయానికి ఉంచగా.. 217 కోట్ల షేర్లకు (2,17,67, 62,140) బిడ్లు దాఖలయ్యాయి. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్ల కోటా అత్యధికంగా 55.47 రెట్లు ఓవర్ సబ్స్క్రైబ్ కాగా.. సంస్థాగతేతర మదుపర్ల కేటగిరీలో 9.99 రెట్లు సబ్స్క్రైబ్ అయ్యింది. రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.41 రెట్లు సబ్స్క్రిప్షన్ అందుకుంది. ఈ ఏడాదిలో ఇంతపెద్ద ఐపీఓ ఓవర్ సబ్బ్రైట్ అవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే రిటైల్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 1.41 రెట్లు సబ్స్క్రిప్షన్ అందుకుంది. ఈ ఏడాదిలో ఇంత పెద్ద ఐపీఓ ఓవర్ సబ్స్క్రైబ్ అవ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.3,369 కోట్లను హెచ్బీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సమీకరించింది. ప్రస్తుతం హెచ్ఎబీ ఫైనాన్షియల్ సర్వీసెస్లో హెచ్ఎఫ్డీసీ బ్యాంక్కు 94.36% వాటా ఉంది. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులతో కంపెనీ తమ టైర్-1 క్యాపిటల్ బేస్ ను బలోపేతం చేసుకోనుంది. భవిష్యత్ వ్యాపార వృద్ధికి కొంత మొత్తాన్ని వినియోగించనుంది.

**సంభవ్ స్టీల్ 34 శాతం ప్రీమియంతో..**

సంభవ్ స్టీల్ ట్యూబ్స్ కూడా 34 శాతం ప్రీమియంతో లిస్ట్ అయ్యింది. ఐపీఓ లిస్టింగ్ ప్రైస్ రూ.82 కాగా.. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో రూ.110 వద్ద ఎంట్రీ ఇచ్చింది. రూ.540 కోట్ల ఈ ఐపీఓలో రూ.440 కోట్లు తాజా షేర్లు జారీ చేయగా.. రూ.100 కోట్ల విలువైన షేర్లు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించారు.

## జెఫ్ బెజోస్: రూ.6,300 కోట్ల విలువైన షేర్ల విక్రయం



అమెజాన్ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన జెఫ్ బెజోస్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల వివాహం చేసుకున్న ఆయన, అమెజాన్‌లో తన వాటాలో కొంత భాగాన్ని విక్రయించారు. 33 లక్షల షేర్లను, సుమారు 736.7 మిలియన్ డాలర్ల (రూ.6,300 కోట్లకు పైగా) విలువతో అమ్మేశారు. అయినప్పటికీ, 241.4 బిలియన్ డాలర్ల నికర సంపదతో ప్రపంచ ధనవంతుల జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ఈ ఏడాది బెజోస్ షేర్ల విక్రయం ఇదే తొలిసారి. తన ట్రేడింగ్ ప్రణాళికలో భాగంగా 25 మిలియన్ షేర్లను విక్రయించాలని ఈ ఏడాది మార్చిలో ప్రకటించారు. అప్పటి నుంచి అమెజాన్ షేరు విలువ 8 శాతానికి పైగా పెరిగింది. గత ఏడాది కూడా బెజోస్ 13.6 బిలియన్ డాలర్ల విలువైన 75 మిలియన్ షేర్లను విక్రయించారు.2002 నుంచి బెజోస్ ప్రతి ఏడాది తన షేర్లలో కొంత భాగాన్ని విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 44 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను అమ్మారు. ఈ నిధులను తన అంతరిక్ష సంస్థ బ్లూ ఆరిజిన్ కార్యకలాపాలకు, అలాగే దాతృత్వ కార్యక్రమాల కోసం వినియోగిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో 9,30,000 షేర్లను స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చారు. 61 ఏళ్ల జెఫ్ బెజోస్ గత వారం ఇటలీలోని వెనిస్‌లో తన ప్రియురాలు లారెన్ శాంచెజ్‌ను వివాహం చేసుకున్నారు. ఈ వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు, దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# బాదుడుకు కేంద్రం పచ్చజెండా

### క్యాబ్ సంస్థలు రద్దీ ఉంటే రేట్లు పెంచుకోవచ్చు..




యాప్ ఆధారంగా క్యాబ్ సర్వీసులు అందిస్తున్న ఉబర్, ఓలా వంటి సంస్థలకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. రద్దీ ఉంటే రేట్లు పెంచుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈమేరకు మోటార్ వెహికిల్ అగ్రిగేటర్ గైడ్లైన్స్ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం నామమాత్రంగా రద్దీ ఉన్న సమయాల్లో బేస్ ఛార్జీల్లో సగం సర్చార్జీ కింద పెంచుకునేందుకు వీలు కల్పించింది. అలాగే ఒకవేళ రద్దీ విపరీతంగా ఉంటే 200 శాతం పెంచుకునేందుకు అనుమతిచ్చింది. అంతకుముందు ఈ వెలుసుబాటు 150 శాతంగా ఉండేది. ఇక, మూడు కిలోమీటర్ల లోపు ప్రయాణానికి ఎలాంటి అదనపు ఛార్జీలు విధించకూడదన్న షరతు విధించింది.

యాప్ ద్వారా రైడు అంగీకరించిన తర్వాత సరైన కారణం చెప్పకుండా డ్రైవర్ క్యాన్సిల్ చేస్తే.. ఛార్జీలో 10 శాతం పెనాల్టీ (రూ.100 మించకుండా) పడుతుంది. దానిని డ్రైవర్, అగ్రిగేటర్ ప్లాట్ఫామ్ (ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థలు) చెరి సమానంగా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ, సరైన కారణం చెప్పకుండా ప్రయాణికులు రైడ్ క్యాన్సిల్ చేసినా ఇదే పెనాల్టీ వర్తిస్తుంది. అలాగే కేంద్రం డ్రైవర్ల సంక్షేమంపై ప్రధానంగా దృష్టిసారించింది. ఈ అగ్రిగేటర్ ప్లాట్ఫామ్లతో అనుబంధంగా ఉన్న ప్రతి డ్రైవర్కు కనీసం రూ. 5లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల మేర టర్మ్ ఇన్సూరెన్స్ కవరేజ్ను ఆ క్యాబ్ సంస్థలు తప్పనిసరిగా అందించాలని పేర్కొంది. అలాగే ఈ వేదికల ద్వారా ప్యాసింజర్ రైడ్స్ కోసం ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి అనుమతించింది.

ఇటీవల కర్ణాటక వ్యాప్తంగా బైక్ ట్యాక్సీలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేకపోవడంతో ఈ సేవలను నిలిపివేయాలంటూ కర్ణాటక హైకోర్టు సింగిల్ బెంచ్ గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 15 వరకు గడువు ఇచ్చింది. ఈ అంశంపై క్యాబ్ సర్వీసు సంస్థలు సవాలు చేయగా.. డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ ఆదేశాలను సమర్థించింది. దాంతో వాటి సేవలు నిలిచిపోయాయి. బైక్ ట్యాక్సీలపై నిషేధం వల్ల గిగ్వర్కర్ల జీవితాలు రోడ్డునపడతాయంటూ తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ మోటార్ సైకిళ్లను ఉపయోగించడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. ఆటోలు, బైక్ ట్యాక్సీలు, సహా ఇతర వాహనాలకు బేస్ ఛార్జీలను నిర్ణయించే అధికారాన్ని కేంద్రం రాష్ట్రాలకు అందించింది. ఒకవేళ రాష్ట్రాలు బేస్ ఛార్జీలను అధికారికంగా నోటిఫై చేయకపోతే.. ఆ ధరలను ప్రకటించే బాధ్యత అగ్రిగేటర్లదేనని వెల్లడించింది. అలాగే ఆ వివరాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అందించాలని చెప్పింది.

ఇక డ్రైవర్ పికప్పాయింట్కు చేరుకోవడానికి ప్రయాణించే దూరం అంటే డెడ్ మైలేజ్కు ఛార్జీ విధించకూడదని మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే పికప్ పాయింట్ మూడు కిలోమీటర్ల కంటే తక్కువ దూరం ఉన్నప్పుడే ఈ మినహాయింపు వర్తిస్తుంది. అలాగే ప్రయాణికుల భద్రతను నిర్ధరించేందుకు ఈ క్యాబ్ సంస్థల కింద సేవలు అందించే వాహనాలకు వెహికిల్ లొకేషన్, ట్రాకింగ్ పరికరాలు అమర్చడాన్ని తప్పనిసరి చేసింది. ఈ డేటా ఫీడ్.. ఆ సంస్థలతో పాటు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లకు అందుబాటులో ఉండాలి. దాంతో అత్యవసర పరిస్థితుల్లో సత్వర స్పందనకు వీలు కలుగుతుందని పేర్కొంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 610 | ₹ 59.2 |
| వరంగల్ | ₹ 612 | ₹59.4 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

| | |
|---|---|
| ₹1,01,400 (24 క్యారెట్లు) | ₹ 92,950 (22 క్యారెట్లు) |

చెన్నై

| | |
|---|---|
| ₹ 99,200 (22 క్యారెట్లు) | ₹1,01,200 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹1,20,000

## 25,500 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా విధించిన టారిఫ్ డెడ్లైన్ జులై 9 సమీపిస్తున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ముఖ్యంగా హెచ్ఎఫ్డీసీ బ్యాంక్, ఎల్అండ్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు ఒత్తిడి సూచీలపై కనిపించింది. దీంతో సూచీలు ఆరంభలాభాలను కోల్పోగా.. నిఫ్టీ 25,500 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 83,790.72 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,697.29) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,935.01 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకుంది. చివరికి 287 పాయింట్ల నష్టంతో 83,409.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88.40 పాయింట్ల నష్టంతో 25,453. 40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.68గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్సర్వ్, ఎల్అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్ఎఫ్డీసీ బ్యాంక్, బీఈఎల్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటి జాబితాలో ఉన్నాయి. టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.70 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3352 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ట్రంప్ బహిష్కరణ వ్యాఖ్యలపై తీవ్ర నిరసన

### ఆయన కుటుంబంపై సంతకాల సేకరణ



అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్, వలసదారులపై కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో, అమెరికా పౌరులైనప్పటికీ కొందరిని బహిష్కరించాల్సిన అవసరం ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర నిరసనలకు దారితీశాయి. ఆన్‌లైన్ వేదికగా నిరసనకారులు ట్రంప్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని సంతకాల సేకరణ చేపట్టారు. 'ముందుగా మెలానియా ట్రంప్‌ను బహిష్కరించాలి' అని పేర్కొన్న పిటిషన్‌కు వేలాది మంది సంతకాలు చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ ఉద్యమాన్ని పబ్లిక్ పాలసీ అడ్వకసీ గ్రూప్ ప్రారంభించింది.

పిటిషన్‌లో, 'సహజసిద్ధ పౌరసత్వం పొందిన వారిని బహిష్కరించాలని ట్రంప్ భావిస్తున్నారు కాబట్టి, మెలానియా మరియు ఆమె తల్లిదండ్రులను మొదట బహిష్కరించాలి. బారన్ ట్రంప్ కూడా వెళ్లాలి, ఎందుకంటే ఆయన అమ్మమ్మ విదేశంలో జన్మించారు. ట్రంప్ వాదన ప్రకారం, అమ్మమ్మ అమెరికాలో జన్మించి ఉండాలి. కానీ, మెలానియా తల్లి విదేశీయురాలు. బహిష్కరణలో మినహాయింపులు ఉండకూడదు. జాతీయ భద్రత, వలస విషయంలో ట్రంప్ సీరియస్‌గా ఉన్నట్లయితే, ఆయన కుటుంబానికి మినహాయింపు ఇవ్వకూడదు' అని పేర్కొన్నారు.

మెలానియా ట్రంప్ 1970లో యుగోస్లేవియాలో జన్మించారు. ఆమె అసలు పేరు మెలానిజా క్నావ్స్. మోడలింగ్ కెరీర్ కోసం 1996లో అమెరికాకు వచ్చారు. 2001లో గ్రీన్‌కార్డ్ పొంది, 2006లో అమెరికా పౌరసత్వం సంపాదించారు. ఆమె అమెరికా వెలుపల జన్మించిన రెండో ప్రథమ మహిళ. ట్రంప్ తాజా వ్యాఖ్యల నేపథ్యంలో, మెలానియా అమెరికాకు వచ్చినప్పుడు చెల్లుబాటు అయ్యే వీసా కలిగి ఉన్నారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. లాస్ ఏంజిల్స్‌లో ఇటీవల జరిగిన ర్యాలీలో యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు మాగ్జిన్ వాటర్స్ ఈ అనుమానాన్ని వ్యక్తం చేశారు. ట్రంప్ పౌరులు మరియు వారి తల్లిదండ్రుల పత్రాలను పరిశీలించాలనుకుంటే, ముందుగా మెలానియా పత్రాలను తనిఖీ చేయాలని ఆమె డిమాండ్

### ట్రంప్ హెచ్చరికలతో మస్క్ వెనక్కి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు దేశంలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్ మస్క్ మధ్య 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' విషయంలో వివాదం ముదిరింది. పన్ను కోతలు, ప్రభుత్వ వ్యయంపై ట్రంప్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ బిల్లుపై ఇద్దరూ ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే, మరుసటి రోజే అమెరికాలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవిస్తుందని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రకటించారు. దీనిపై స్పందించిన ట్రంప్, తాము అందిస్తున్న సబ్సిడీలను కోత విధిస్తే మస్క్ తన వ్యాపారాలను మూసివేసి దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. మస్క్‌ను బహిష్కరించే అంశాన్ని పరిశీలిస్తున్నామని ట్రంప్ పేర్కొనడంతో, మస్క్ కాస్త వెనక్కి తగ్గారు. ఈ వివాదాన్ని మరింత రెచ్చగొట్టడానికి తాను ఉత్సాహంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఏమీ చేయబోనని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'దీన్ని మరింత పెంచడానికి చాలా ఉత్సాహంగా ఉంది. కానీ, ప్రస్తుతానికి నేను ఏమీ చేయబోను' అని ఆయన పేర్కొన్న ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. మస్క్ మొదటి నుంచి 'బిగ్ బ్యూటిఫుల్ బిల్'ను వ్యతిరేకిస్తున్నారు, ఇదే ట్రంప్‌తో విభేదాలకు కారణమైంది.

సెనేట్‌లో ఈ బిల్లుపై ఓటింగ్ జరుగుతున్న నేపథ్యంలో, మస్క్ తన ఎక్స్ ఖాతాలో సెనేట్ సభ్యులను టార్గెట్ చేస్తూ వరుస పోస్టులు చేశారు. ఈ బిల్లు అమెరికన్ల రుణ భారాన్ని పెంచుతుందని, దీనికి ప్రజామోదం లేదని, ఇది అత్యంత మూరపు బిల్లని విమర్శించారు. 'ఈ పిచ్చి బిల్లు ఆమోదం పొందిన మరుసటి రోజే అమెరికన్ పార్టీ ఆవిర్భవిస్తుంది. డెమోక్రాట్-రిపబ్లికన్ పార్టీల ఏకచ్ఛత్రాధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజల గొంతుకు ప్రతినిధిగా కొత్త పార్టీ అవసరం' అని ట్వీట్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గిస్తామని చెప్పిన రిపబ్లికన్లు ఇప్పుడు ఈ బిల్లుకు మద్దతిస్తున్నందుకు సిగ్గుతో తలదించుకోవాలని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

### దుకాణం మూసివేయి : ట్రంప్



మస్క్ వ్యాఖ్యలకు ట్రంప్ తీవ్రంగా స్పందిస్తూ, టెస్లా అధినేత తన వ్యాపారాలను మూసివేసి దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. 'విద్యుత్తు వాహనాలకు నేను వ్యతిరేకమని మస్క్‌కు తెలుసు. ఎలక్ట్రిక్ కార్లు మంచివే, కానీ అందరినీ వాటిని కొనమని బలవంతం చేయకూడదు. మస్క్ చరిత్రలో ఎవ రూ పొందనంత సబ్సిడీలను పొందుతున్నారు. ఆ సబ్సిడీలు లేకపోతే, ఆయన దుకాణం మూసుకొని దక్షిణాఫ్రికాకు వెళ్లాల్సి ఉంటుంది' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. 'రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు, విద్యుత్తు కార్ల ఉత్పత్తి లేకపోతే మన దేశానికి ఎంతో ధనం మిగులుతుంది' అని మరో పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన మస్క్, దమ్ముంటే తన కంపెనీలకు ఇస్తున్న సబ్సిడీలను కోత విధించాలని సవాల్ విసిరారు.

## అంతర్జాతీయ తనిఖీలు నిలిపేసిన ఇరాన్..!



తమ దేశంలో చేపట్టే అణు కార్యక్రమాలను తనిఖీలు చేయకుండా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) పూర్తిగా ద్వారాలు మూసివేసింది. ఆ సంస్థకు ఇక ఏమాత్రం సహకరించకూడదని పార్లమెంట్ చేసిన బిల్లుకు ఇరాన్ దేశాధ్యక్షుడు మసౌద్ పెజష్కియాన్ తుది ఆమోదముద్ర వేశారు. ఈ విషయాన్ని ఆ దేశ మీడియా బుధవారం ప్రకటించింది. "ఐఏఈఏకు సహకరించకూడదని పార్లమెంట్ తీసుకొన్న నిర్ణయాన్ని అధ్యక్షుడు పెజష్కియాన్ అధికారికంగా ప్రకటించారు" అని వెల్లడించింది.

మరోవైపు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఓ ఆంగ్ల వార్తాసంస్థతో మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. నష్టాన్ని ఎవరూ కచ్చితంగా చెప్పలేరని వెల్లడించారు. ప్రస్తుతం ఇరాన్ అటామిక్ ఎనర్జీ ఆర్గనైజేషన్ నష్టాన్ని అంచనా వేస్తోందన్నారు.

ఇక మరోవైపు అమెరికా దాడుల్లో దెబ్బతిన్న ఫోర్డో అణుకేంద్రంలో తిరిగి తవ్వకాల ప్రక్రియ చేపట్టినట్లు ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్నాయి. ఈవిషయాన్ని అమెరికా పత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. తాజాగా ఈ అణుకేంద్రంలోకి దారితీసే కొత్త మార్గంలో పెద్దసంఖ్యలో వాహనాలు, తవ్వకాలు జరిపే భారీ యంత్రాలు, క్రేన్లు బారులుదీరి ఉన్నాయి. దీనిపై ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ విశ్లేషణ ప్రకారం.. బాంబులు పడినచోట ఏర్పడిన గొయ్యి లోపలికి మనుషులను, లేదా యంత్రాలను పంపించి.. పేలుడు తీవ్రతను అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించింది. ఆ సంస్థ అధ్యక్షుడు డేవిడ్ అల్రైట్ మాట్లాడుతూ బాంబులు పడిన రెండుచోట్ల పరిశీలనకు ఏర్పాటు జరుగుతున్నట్లు ఉపగ్రహ చిత్రాలను చూస్తే అర్థమవుతోందన్నారు. అక్కడ నేల అస్థిరంగా ఉండటంతో.. వారికి భారీ క్రేన్ అవసరం పడిందని చెప్పారు. అక్కడ రేడియేషన్ లీకేజీలను కూడా ఇరాన్ పరిశీలించవచ్చన్నారు. గత నెల చివర్లో ఇజ్రాయెల్ తో కలిసి సమన్వయం చేసుకొంటూ అమెరికా ఈ అణుకేంద్రంపై భారీ దాడి చేసింది. దీనిపై ఏకంగా 12 బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించిన విషయం తెలిసిందే. ఇక నతాంజ్పై 2 రెండు బాంబులు జారవిడిచింది. ఇస్ఫహాన్లో పరిశోధనశాలలను కూడా క్షిపణులతో ధ్వంసం చేసింది.

# విద్యార్థి వీసాలకు టైం లిమిట్




అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థులపై కొత్త ఆంక్షలు విధించేందుకు అగ్రరాజ్యం సిద్ధమవుతోంది. ఇప్పటికే సోషల్ మీడియా వెట్టింగ్‌తో వీసా జారీని కఠినం చేసిన అమెరికా, ఇప్పుడు విద్యార్థి వీసాలకు (ఎఫ్-1, జె-1) పరిమిత కాల గడువు విధించే ప్రతిపాదనలను డిపార్ట్మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ సిద్ధం చేసింది. దీంతో విదేశీ విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది.

ప్రస్తుతం ఎఫ్-1, వీసాలపై అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులు, జె-1 వీసాలపై వచ్చే ఎక్స్ఛేంజ్ విజిటర్లు (విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, ట్రైనీలు, ఇంటర్న్లు, ఫిజీషియన్లు) 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' సౌలభ్యంతో, చదువు లేదా ఇంటర్న్‌షిప్ కొనసాగినంత కాలం అమెరికాలో ఉండొచ్చు. అయితే, ఈ సౌలభ్యాన్ని సవరించి, విద్యార్థి వీసాలకు నిర్ణీత గడువు విధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ప్రకారం, వీసా గడువు ముగిసిన తర్వాత విద్యార్థులు పొడిగింపు కోసం మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం ఆఫీస్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ బడ్జెట్‌కు సమీక్ష కోసం పంపబడ్డాయి. తదుపరి ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించబడి, 30 నుంచి 60 రోజుల పాటు ప్రజాభిప్రాయాలు స్వీకరించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోబడుతుంది. అయితే, ప్రజాభిప్రాయాలు తీసుకోకుండానే మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

ఈ మార్పులపై న్యాయ నిపుణులు, విద్యార్థు ల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిబంధనలు విద్యార్థులపై అదనపు భారం మోపడమే కాక, గందరగోళానికి దారితీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, అమెరికా విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటు న్న 3.3 లక్షలకు పైగా భారతీయ విద్యార్థులపై ఈ నిర్ణయం గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలతో సంబంధం లేదు



ఆకస్మిక మరణాలకు కరోనా టీకాలకు ఎలాంటి సంబంధం లేదని భారత వైద్య పరిశోధన మండలి మరియు ఎయిమ్స్ సంయుక్త అధ్యయనంలో తేలింది. కరోనా మహమ్మారి తర్వాత 40 ఏళ్లలోపు వయస్సు గలవారిలో హార్ట్ ఎటాక్ కేసులు పెరిగినట్లు నివేదికలు వెల్లడించినప్పటికీ, ఇవి వ్యాక్సిన్ కారణంగా కాదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

కర్ణాటకలోని హాసన్ జిల్లాలో ఇటీవల పలువురు యువకులు హార్ట్ ఎటాక్‌తో మరణించడంపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ, కొవిడ్ టీకాల వేగవంతమైన పంపిణీ కారణం కావొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను ఖండించింది.

ఐసిఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ నిర్వహించిన సమగ్ర అధ్యయనం, 2023 మే నుంచి ఆగస్టు వరకు 19 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 47 ఆసుపత్రుల సహకారంతో 18-45 ఏళ్ల వయస్సు గలవారిపై జరిగింది. 2021 అక్టోబర్ నుంచి 2023 మార్చి వరకు సంభవించిన ఆకస్మిక మరణాలను విశ్లేషించగా, హార్ట్ ఎటాక్ కేసుల పెరుగుదలకు జన్యు మార్పులు ప్రధాన కారణంగా గుర్తించారు. ప్రస్తుతం ఎయిమ్స్, ఐసిఎంఆర్, నిధులతో మరో పూర్తిస్థాయి అధ్యయనం కొనసాగుతోంది. అధ్యయనం ప్రకారం, ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలు కారణం కాక, జీవనశైలి, మునుపటి ఆరోగ్య సమస్యలు, కొవిడ్ ఇన్ఫెక్షన్ తర్వాత సమస్యలు, జన్యు కారణాలు దోహదపడుతున్నాయని తేలింది. కరోనా టీకా మానవాళిని మహమ్మారి నుంచి కాపాడిందని, దీనిపై అనవసర ఆరోపణలు ప్రజల్లో భయం మరియు టీకాపై అపనమ్మకాన్ని కలిగిస్తాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. హాసన్ జిల్లాలో గత నెలలో 20 మందికి పైగా ఆకస్మిక మరణాలు సంభవించినట్లు సీఎం పేర్కొనగా, ఈ ఘటనలపై పరిశోధనలు జరుగుతున్నట్లు కేంద్రం తెలిపింది.

## 'ఐ లవ్ యూ' చెప్పడం లైంగిక వేధింపు కాదు

### బాంబే హైకోర్టు సంచలన తీర్పు

బాంబే హైకోర్టు ఒక పదేళ్ల నాటి లైంగిక వేధింపుల కేసులో సంచలన తీర్పు వెలువరించింది. 'ఐ లవ్ యూ' అని చెప్పడం లైంగిక వేధింపులకు సమానం కాదని కోర్టు స్పష్టం చేసింది. 2015 అక్టోబర్‌లో 17 ఏళ్ల బాలిక (11వ తరగతి విద్యార్థిని)కి ఓ యువకుడు 'ఐ లవ్ యూ' అని చెప్పడంతో, ఆమె తల్లిదండ్రులు యువకుడిపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారించిన నాగ్‌పూర్ సెషన్స్ కోర్టు 2017 ఆగస్టులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధించింది.

అయితే, నిందితుడు సెషన్స్ కోర్టు తీర్పును బాంబే హైకోర్టులో సవాల్ చేశాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 'ఐ లవ్ యూ' అని నోటితో చెప్పడం లైంగిక వేధింపు కాదని తీర్పు ఇచ్చింది. బాలికపై నిందితుడు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. బాలికను అసభ్యంగా తాకడం, అసభ్యకరమైన మాటలు పలకడం, లైంగిక సైగలు చేయడం వంటి చర్యలు జరిగితేనే లైంగిక వాంఛతో కూడిన వేధింపులుగా పరిగణించవచ్చని, కేవలం 'ఐ లవ్ యూ' చెప్పడాన్ని లైంగిక వేధింపుగా భావించలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

# అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూలై 2 (జనంసాక్షి):** తమిళనాడు రాష్ట్రంలోని అరుణా చల క్షేత్రానికి వేములవాడ డిపో నుండి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆషాఢ శుక్ల పౌర్ణమి (గురుపౌర్ణమి) అరుణాచలగిరి ప్రదక్షిణకు వేములవాడ డిపో నుండి సూపర్‌లగ్జరీ బస్సు ఈనెల 8న సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి కరీంనగర్, హైదరాబాద్ మీదుగా కాణిపాకం , గోల్డెన్ టెంపుల్ దర్శనం పిదప 9 బుధ వారం రాత్రి అరుణా చలం చేరుకుంటుందన్నారు. తిరిగి10 గురువారం సాయ త్రం అరుణాచలంలో బయ లుదేరి 11న ఉదయం గద్వాలలోని జోగులాంబ టెంపుల్‌కు చేరు కుంటుందనీ, దర్శన అనంతరం బయలుదేరి, సాయంత్రం హైదరాబాదు, కరీంనగర్ మీదుగా వేములవాడ చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు చార్జి పెద్దలకు రూ 4700, పిల్లలకు రూ 3550గా నిర్ణయించబడినదన్నారు. అడ్వాన్స్ బుకింగ్ కొరకు ఫోన్ నెంబర్లు 995922 5926, 9440521412, 9440227866 ,7989946545 సంప్రదించగలరని డిపో మేనేజర్ తెలిపారు.

# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రైతులకు ఏం చేసింది?



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 02 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతులకు ఏం చేసిందని, అందులో మంత్రిగా ఉండి ప్రశాంత్రెడ్డి రైతులకు చేసిందేమీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం అయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు బోర్డును పదేపదే అవహేళన చేస్తూ మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డి, కవితలు వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో 176 మంది పసుపు రైతులు ఎన్నికల్లో పోటీ చేసి కేసీఆర్ బిడ్డ కవితను ఓడగొట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో వారికే అర్థం కావాడం లేదన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఇప్పటి వరకు లెటర్ ప్యాడ్ లేకపోవడం దారుణమని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి క్యాంప్ కార్యాలయం ఎక్కడుందో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే తెలియదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన జాతీయ బోర్డులకు జిల్లా నుంచి ఒక్క ఛైర్మన్ను అయినా నియమించారా అని ప్రశ్నించారు. రూరల్ క్యాంపు కార్యాలయం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారితే ప్రజలకు ఉపయోగపడే విధంగా బీజేపీ చేసిందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు పాల్గొన్నారు.

# కార్మికులు మద్యపాన వ్యసనం నుండి విముక్తి పొందాలి



**సిరిసిల్ల టౌన్, జూలై 2 (జనంసాక్షి) :** మద్యపానాన్ని కార్మికులు పూర్తిస్థాయిలో తగ్గించాలని, సైకాలజిస్ట్ డాక్టర్ పున్నమి చందర్ అన్నారు. మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ కార్మికులకు మనో వికాస సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ.. కార్మికులు మద్యపాన వ్యసనం నుండి విముక్తి పొందాలన్నారు. మద్యపాన వ్యసనం సైకో సోమాటిక్ డిసార్డర్ వ్యాధి అని తెలుపుతూ... శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. మద్యపాన వ్యసనం నుండి బయటపడేందుకు మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్‌లో సైకాలజిస్ట్, సైకియాట్రస్ట్ లను ఏర్పాటు చేసిందని తెలిపారు. మద్యపాన వ్యసనపరులకు కౌన్సిలింగ్, చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ ద్వారా మద్యపాన వ్యసనం నుండి బయట పడవచ్చని అన్నారు. మైండ్ కేర్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కార్మికులు పాల్గొన్నారు.

# ఇందిరా సౌర గిరిజల వికాస పథకం ఎంతో తోడ్పడుతుంది



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 2 (జనంసాక్షి):** బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధ్యక్షతన ఇందిర సౌర గిరిజల వికాసం పథకం పై సమావేశం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్వో ఎఫ్ ఆర్ పట్టాలను కలిగి పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనుల పంట భూములను లాభసాటి వ్యవసాయానికి అనుకూలంగా మలిచేందుకు ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ఎంతో తోడ్పడుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో గిరిజన పోడు పట్టాలు పొందిన లబ్ధిదారులకు బోరు మోటర్, సోలార్ పంప్ సెట్లు మంజూరు చేసి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి వాటి ద్వారా కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసుకుని అభివృద్ధి చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఈ పథకము కొరకు సంబంధిత మండల అభివృద్ధి అధికారి కార్యాలయ మునందు దరఖాస్తు చేసుకోవలసినదిగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి భోగా నికిత అదనపు కలెక్టర్ చందర్ నాయక్, కామారెడ్డి ఆర్డీఓ వీణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సతీష్ యాదవ్, డిఆర్‌డిఓ సురేందర్,డిపిఓ మురళి, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యుత్ శాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అనుమతికి విరుద్ధంగా క్షత్రియ జూనియర్ కళాశాల


- డిఐఈఓ కు ఫిర్యాదు చేసిన కె.గిరిరాజ్




**ఆర్మూర్, జులై 2 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డులో కొనసాగుతున్న క్షత్రియ జూనియర్ కళాశాలకు ప్రభుత్వ అనుమతి లేదని, అనుమతి ఉండగా చేపూర్ లో ఉండగా అనుమతికి విరుద్ధంగా కొనసాగిస్తున్నారని ఆర్మూర్ ప్రాంతవాసి కే గిరిరాజ్ ఆరోపించారు. బుధవారం ఆర్మూర్ ప్రెస్ క్లబ్ భవన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.గత మూడు సంవత్సరాలుగా పట్టణ కేంద్రంగా అనుమతి లేకుండా కొనసాగిస్తున్న క్షత్రియ జూనియర్ కళాశాలపై డిఐఈఓ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నాలుగంతస్తుల భవనంలో క్రింది ఫ్లోర్ కమర్షియల్ కాంప్లెక్స్,పైన మూడు ఫ్లోర్లలో కళాశాల తరగతులు,హాస్టల్, హాస్టల్ వంటగది, అనుమతులు లేకుండా కొనసాగుతుందని తెలిపారు.ఏదైనా ప్రమాదం సంభవిస్తే విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు.క్షత్రియ జూనియర్ కళాశాల తరగతులు యధావిధిగా అనుబంధంగా అనుమతి పొందిన ప్రాంతంలోనే జరిగే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.లేనియెడల ఫిర్యాదును రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

# జంగాలపల్లిలో మౌలిక వసతులకు శంకుస్థాపన

- రూ.10 కోట్లతో అనుసంధాన రహదారులు.అంతర్గత రహదారులు.
- రామగుండం శాసనసభ్యులు మక్కాన్..



**గోదావరిఖని జులై 02 (జనంసాక్షి) :** జంఘాల పల్లిలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులకు అన్ని రకాల మౌళిక వసతులు త్వరలోనే అందుబాటులోకి తీసుకు వస్తామని రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు రూ.3 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో సెప్టిక్ ట్యాంక్ , సీవరేజ్ పైప్ లైన్ తో పాటు మరో రూ.3 కోట్ల 10 లక్షల అంచనా వ్యయంతో మంచి నీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు జంఘాల పల్లిలో బుధవారం ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జంఘాల పల్లిలో నిర్మించిన 2 బిహెచ్‌కె ఇండ్లు మౌళిక వసతుల కొరతతో నివాసయోగ్యంగా లేవని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళిన వెంటనే ఆయన స్పందించి వసతులు కల్పించడానికి రూ .10 కోట్ల రూపాయలు మంజూరు చేశారని అన్నారు. ఈ నిధులతో ప్రదాన రహదారి నుండి 2 బిహెచ్‌కె కాలనీ కి చేరుకోవడానికి అనుసంధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు , మంచినీటి సౌకర్యం , విద్యుత్ , వీధి దీపాలు , డ్రైనేజ్ తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. పేద వారికి అన్యాయం జరగవద్దనే కాంక్షతో గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్దిదారులను మార్చకుండా వారికే ఈ ఇండ్లను డ్రా ద్వారా కేటాయించడం జరిగిందని అన్నారు. అభివృద్ది పనులు పూర్తయిన వెంటనే సంబందిత మంత్రులను ఆహ్వానించి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అందరం కలిసి పండుగలా జరుపుకుందామని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , సూపరింటెండింగ్ ఇంజనీర్ శివానంద్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ , గృహ నిర్మాణ విభాగం అధికారులు, తాజా మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి , బొంతల రాజేష్ పాల్గొన్నారు.

2. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాన్ని నెరవేర్చాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె.అరుణ శ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి వ్యాపారుల కామన్ ఇంటరెస్ట్ గ్రూప్‌లు , నూతన స్వయం సహాయక సంఘాలు, స్లమ్ లెవెల్ ఫెడరేషన్‌లను ఏర్పాటు చేయడంపై వంద రోజుల కార్యాచరణలో విధించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి మెప్మా సిబ్బంది మరింత చురుగ్గా పని చేయాలని అన్నారు. రుణాలను రికవరీ చేయించడంలోనూ చొరవ తీసుకోవాలని అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు నిర్మాణ పురోగతికి అనుగుణంగా ప్రభుత్వం దశల వారీగా సొమ్ము విడుదల చేయనున్నందున త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి కావడానికి లబ్దిదారులకు ముందుగా బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారం అందేలా చూడాలని అన్నారు. ఇందిరమ్మ మోడల్ కాలనీ నిర్మించడానికి అనువుగా ఉండే ప్రాంతాలను గుర్తించి సమాచారం ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, మెప్మా టిఎంసి మౌనిక , సిఓలు , ఆర్‌పిలు పాల్గొన్నారు.

3. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా బుధవారం పలు డివిజన్లలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. విలేజ్ రామగుండంలో శిధిలమైన భవనాన్ని కూల్చివేశారు. కల్యాణ్ నగర్‌లోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. ఎఫ్‌సిఐ రోడ్డులో ఖాజీపల్లి వద్ద రహదారి ప్రక్కన మెరిగిన ముళ్ళ పొదలు , తుప్పలు తొలగించారు. సంజయ్ గాంధీ నగర్‌లో రోడ్డు పై గుంతలను పూడ్చారు. కూరగాయల మార్కెట్ లో చిరువ్యాపారులకు పి ఎం స్వనిధి తదితర పథకాల పై అవగాహన కల్పించారు. ఆస్తి పన్ను సమస్యల పరిష్కారానికై నగర పాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహించారు. రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి ఆయా కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించగా సంబందిత సిబ్బంది పాల్గొన్నారు.

# డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం సిద్ధం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 2(జనంసాక్షి):** వర్షాకాలం దృష్ట్యా భారీ వర్షాలు,వరదలు,ఇతర ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా 12 మందితో కూడిన జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) బృందం 24/7 అందుబాటులో ఉండి తక్షణ సహాయక చర్యలు చేపడుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.బుధవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపెల్లి గ్రామంలో గల చెరువులో భారీ వర్షాలు,వరదలు,ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై ఇస్తున్న శిక్షణలో పాల్గొని డిఆర్ఎఫ్ బృంద సభ్యులతో కలసి బోటు నందు ప్రయాణించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చి అత్యవసర సమయంలో వెంటనే స్పందించేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా వరదలు,ప్రకృతి వైపరీత్యాలు,అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే స్పందిచే అందుకు జిల్లా పోలీస్‌తో పాటుగా అందుబాటులో జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందం సిద్ధంగా ఉంటుందన్నారు.జిల్లా డిఆర్ఎఫ్ బృందం వద్ద రెస్క్యూ బోటు,మోటార్ మిషన్, మెడికల్ స్ట్రక్చర్, లైఫ్ జాకెట్స్, లైఫ్ బాయ్స్,వుడ్ కట్టర్స్ మిషన్ లాంటి ఆధునిక పరికరాలతో ప్రజలకు ఆపత్కాల సమయంలో ప్రాణనష్టం ఆస్తి నష్టం సంభవించకుండా 24/7 జిల్లా పోలీసు యంత్రాంగం బృందం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలియజేసారు.ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు, డయల్100కి ఫోన్ చేసి సమాచారం అందిస్తే తక్షణమే సహాయక చర్యలు చేపడుతమన్నారు. ఆయన వెంట వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఆర్ఐలు రమేష్,యాదగిరి, ఆర్ఎస్ఐలు శ్రవణ్ యాదవ్, సాయికిరణ్, రాజు,ఎస్.ఐ ఎల్లగౌడ్, డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సివిల్ సప్లై అధికారికి సమ్మె నోటీసు అందజేత




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 2 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో.ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం సివిల్ సప్లై అధికారి బిక్షపతికి సమ్మె నోటీసు ఇచ్చిన ఏఐటీయూసీ. సివిల్ సప్లై హమాలి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ. కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి బాలరాజు మాట్లాడుతూ దేశ వ్యాప్త సార్వత్రికసమ్మె 9న భారతదేశంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని ఈ సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, పాల్గొని విజయవంతం చేయాలని అలాగే సివిల్ సప్లై హమాలి కామారెడ్డి జిల్లా కామారెడ్డి, ఎల్లారెడ్డి, దోమకొండ, సదాశివ నగర్, బాన్సువాడ, బిచ్కుంద, పిట్లం, 7 ఎంఎల్ఎస్ పాయింట్స్ ఈ సమ్మెలో పాల్గొంటారని ఆయన అన్నారు. ఈ సమయం కార్మికులకు కనీస వేతనాలు పని భద్రత పిఎఫ్, ఈఎస్ఐ, మరియు మహిళా కార్మికులకు పని భద్రత అట్లాగే జిల్లాలో సొంత గోదాములు నిర్మించాలని గోధుమల దగ్గర కార్మిక వర్గానికి సరైన సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. అలాగే సివిల్ సప్లై అమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ విధానం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికులకు ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని ఎనిమిది గంటల నుండి పని 12 గంటలు పెంచుతున్న పనిభారాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రైవేటు రంగాలకు వ్యవసాయ రంగం కూడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వము అడుగులు ముందుకు వేస్తుందని అందులో భాగంగా అన్ని రంగాలు 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అమాలి ఏఐటీయూసీ అనుబంధం. సంఘం జిల్లా అధ్యక్షులు. ఎల్ దశరథ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలరాజు, సివిల్ సప్లై హమాలీ కామారెడ్డి జిల్లా నాయకులు బాజీ మైపాల్, భీమయ్య, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచేవారికి శిక్షణ

- కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి
- ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జులై 4 కాంగ్రెస్ బహిరంగ సభ



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 02 (జనంసాక్షి) :** జూలై 4న ఎల్.బి.స్టేడియంలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి గాను కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి బుధవారం నగరంలోని హోటల్ వి పార్క్‌లో సన్నాహక సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఒక సోదరుడిగా మీతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జులై 4న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు తరలి వెళ్లే వారికి నా వంతు పూర్తి సహకారం అందిస్తానని, మనలో విభేదాలు ఉండకూడదు, మనకు ముగ్గురు మంత్రులు ఎంతో అవసరం అని తెలిపారు. మహిళలకు ఏసి బస్సు లేదా వాహనాలు ఏర్పాటు చేస్తానని, మనమంటే ఏమిటో ఈ బహిరంగ సభతో ప్రతిపక్షాలకు చూపించాలని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు ప్రతికార్యకర్త తరలి రావాలి. రేపు పోటీలో నిలవాలని అనుకునే వారికి నేను ప్రత్యేకంగా శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తాను..సోషల్ మీడియాను మరింత పటిష్టం చేయడానికి అన్ని రకాల కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటామన్నారు. జులై 1న డాక్టర్ డే సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరు కాలేకపోయాను అని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయ ఢంకా మోగించడానికి ఈ బహిరంగ సభ నాంది పలుకుతుంద న్నారు. అందరం కలిసి డిసిసి కార్యాలయం నుండి ఒకే సారి బయలు దేరాలి. పార్టీలో క్యాడర్ వ్యక్తుల కు కాకుండా హోదాకు గౌరవం ఇచ్చే విధంగా ప్రోటోకాల్ పాటించాలి. ఎక్కువ సంఖ్యలో పార్టీ కార్యకర్తలను క్షేత్ర స్థాయిలో తరలించే విధంగా నాయకులు కృషి చేయాలి అని అన్నారు. ఈ సన్నాహక సమావేశంలో నాయకులు వైద్యుల అంజన్ కుమార్, కొరివి అరుణ్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్, బానోత్ శ్రావణ్ నాయక్, చాడ గొండ బుచ్చిరెడ్డి, సరిల్లా ప్రసాద్, భూమా గౌడ్, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాల వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని (జనంసాక్షి) :** ప్రతి పాఠశాల వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోని, వాటి సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని మండలంలోని ప్రభుత్వ పాఠశాల నిర్వహణ పై హెడ్ మాస్టర్ లతో పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. మంథని మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ప్రతి రోజు పాఠశాలలో ఫేషియల్ రికగ్నైంట్ సిస్టం ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలని అన్నారు. టీచర్లకు సెలవులు మంజూరు విషయంలో నిబంధనలు పాటించాలని, ఒకేసారి టీచర్లు అంతా సెలవులు పెట్టకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం స్కావెంజర్స్ నిధులను ప్రభుత్వం ముందుగానే విడుదల చేస్తుందని, పాఠశాల ప్రాంగణం, పరిసరాలను క్లీన్‌గా మెయింటైన్ చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను ప్రతిరోజు పరిశీలించాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ లకు సూచించారు. పాఠశాలలోనే త్రాగునీటి సరఫరా పైప్ లైన్ సరిగ్గా ఉందో లేదో పరిశీలించాలని అన్నారు. టీచర్లు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు యూ.డి.ఐ.ఎస్.ఈ లో అప్ డేట్ చేయాలని అన్నారు. ప్రతి పాఠశాల వార్షిక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అక్రమార్కుడిపై చర్యలు తీసుకోండి

- ఓ రైతు ఆవేదన



**శంకరపట్నం జూలై 2 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఆముదాల పల్లీకి చెందిన వీరెల్లి రాజిరెడ్డి అనే రైతు తన వ్యవసాయ పొలం సర్వే నంబర్ 175 బి కాచాపూర్ శివారులోని తన పొలంలోని ఒడ్డును తన పొలం పక్క రైతు కాచాపూర్ కు చెందిన లింగంపల్లి లక్ష్మా రెడ్డి రాత్రికి రాత్రే జెసిబి సాయంతో తన పొలం ఒడ్డును తీసేసి తన పోలాన్నీ కబ్జా చేసే ప్రయత్నం చేశాడని ఆవేదన వ్యక్తము చేశాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫి ర్యాదు చేసినట్లు రైతు పెర్కొన్నాడు. తన ఫిర్యాదు పై పోలీ సులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తన ఒడ్డును చెడగొట్టి తన భూమిని కలుపుకుందామని చూస్తున్న అక్రమార్కుడి పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇదేంటి అని అడిగితే పెద్ద మనుషుల సమక్షంలో సమస్య పరిష్కరించుకోవాలని పోలీసులు పేర్కొన్నట్లు రైతు రెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా భూ కబ్జాకు పాల్పడు తున్న అక్రమార్కుడు పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

# ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి



**ఆర్మూర్, జూలై 02 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా లబ్ధిదారులు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.617 మందికి ఇళ్లను మంజూరు చేయగా, కేవలం 183 మాత్రమే గ్రౌండింగ్ జరిగాయని అధికారులు, వార్డు ఆఫీసర్ల పనితీరును ఆక్షేపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని ఎలా సాధిస్తారని నిలదీశారు. అలసత్వ వైఖరిని వీడాలని, ఇకనైనా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. అవసరమైతే ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని అన్నారు. ఇల్లు మంజూరు అయిన ప్రతి ఒక్కరూ నిర్మాణం చేపట్టేలా అవసరమైన తోడ్పాటును అందించాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మెప్మా ఆధ్వర్యంలో రుణాలు ఇప్పించేలా చొరవ చూపాలని అన్నారు. ఒకవేళ ఎవరైనా మహిళా సంఘాలలో సభ్యులుగా లేనట్లయితే, వారిని సభ్యులుగా చేర్పించి రుణాలు మంజూరయ్యేలా కృషి చేయాలన్నారు. ఇప్పటికే సభ్యులుగా ఉన్న వారికి మూడు రోజులలో, కొత్తగా సభ్యత్వం కల్పించే వారికి వారం వ్యవధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లక్ష రూపాయల వరకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. తాను వచ్చే వారం మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. తీసుకున్న రుణాన్ని ఇంటి నిర్మాణానికి వెచ్చించేలా నిశిత పర్యవేక్షణ జరపాలని సూచించారు. సమీక్ష అనంతరం కలెక్టర్ ఆర్మూర్ పట్టణంలోని 11, 12 వార్డులలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులను వారి నివాసాల వద్దకు వెళ్లి కలిశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంజూరీ లభించినందున వెంటనే పనులు ప్రారంభించాలని హితవు పలికారు. ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలు ఉంటే, మెప్మా ద్వారారుణం వని, ఉచితంగా ఇసుక సరఫరా చేయిస్తామని, ఆయా దశల నిర్మాణాలను బట్టి వెంట వెంటనే రూ.5 లక్షల ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తోందని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, ఆర్మూర్ మున్సిపల్ కమిష నర్‌రాజు ఉన్నారు.

# విద్యార్థుల విద్య కోసం ఎంతో కష్టపడ్డా

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 02 (జనంసాక్షి) :** బాన్సువాడ నియోజకవర్గంలో విద్యార్థిని, విద్యార్థుల విద్యా వసతుల కల్పనకు తాను ఎంతో కష్ట పడ్డానని, అందుకే అనేక కళాశాలలను ఏర్పాటు చేయించానని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదవి ఉన్నత శికరాను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం అయన సందర్శించారు. అనంతరం అయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంలో ఉర్దూ మీడియం డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫుడ్ టెక్నాలజీ కళాశాల, వ్యవసాయ కళాశాల, తదనం తరం జూనియర్ కళాశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. గతేడాది వచ్చిన ఫలితాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి వ్యవసా య మార్కెట్ కమిటీ ఛైర్మన్ గాయక్వాడ్ హన్మంత్, తహశీల్దార్ గంగాధర్, నాయకులు కొట్టం మనోహర్, పాల్గొన్నారు.

# లైబ్రరీ సైన్స్‌లో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సుల ప్రాముఖ్యత

లైబ్రరీ సైన్స్ అనేది సమాచార నిర్వహణ, గ్రంథాలయాల నిర్వహణ, సమాచార వనరుల సమర్థ వినియోగంపై దృష్టి సారించే ఒక విద్యా రంగం. ఈ రంగంలో డిజిటల్ యుగం ఆవిష్కరణతో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ వ్యాసంలో, కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు లైబ్రరీ సైన్స్‌లో ఎందుకు ప్రాముఖ్యమో, వాటి ప్రయోజనాలు, అనువర్తనాలు, అలాగే భవిష్యత్తు అవకాశాలను గురించి తెలుసుకుందాం.

కంప్యూటర్ డిజైనింగ్ అంటే ఏమిటి? కంప్యూటర్ డిజైనింగ్ అనేది కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ లో టెక్నాలజీని ఉపయోగించి వివిధ రకాల గ్రాఫిక్స్, డిజిటల్ కంటెంట్, మరియు వినియోగదారు ఇంటర్‌ఫేస్‌లను సృష్టించడం. లైబ్రరీ సైన్స్ సందర్భంలో, కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థల రూపకల్పన, వెబ్‌సైట్‌ల అభివృద్ధి, డిజిటల్ కంటెంట్ నిర్వహణ, అలాగే సమాచార సందర్శన కోసం ఆకర్షణీయమైన ఇంటర్‌ఫేస్‌లను రూపొందించడంపై దృష్టి పెడతాయి. ఇవి గ్రంథాలయ సేవలను ఆధునికీకరించడంలోనూ వినియోగదారులకు సేవలు అందించే ప్రక్రియను సులభతరం చేయడంలో సహాయపడతాయి.

లైబ్రరీ సైన్స్‌లో కంప్యూటర్ డిజైనింగ్ ప్రాముఖ్యత

**డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థల రూపకల్పన :**

ఆధునిక గ్రంథాలయాలు భౌతిక పుస్తకాలతో పాటు డిజిటల్ వనరులను కూడా అందిస్తున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు డిజిటల్ లైబ్రరీ ఇంటర్ఫేస్‌లను రూపొందించడంలో సహాయపడతాయి. ఉదాహరణకు, వినియోగదారులు సులభంగా సమాచారాన్ని శోధించగలిగేలా ఆకర్షణీయ మైన వెబ్‌సైట్‌లు లేదా ఆన్‌లైన్ కేటలాగ్‌లను రూపొందించడం కంప్యూటర్ డిజైనింగ్ ద్వారా సాధ్యమవుతుంది. ఇలాంటి వ్యవస్థలు వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరుస్తాయి.

**సమాచార సందర్శనలో సౌలభ్యం:**

కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు వినియోగదారు ఇంటర్‌ఫేస్ (యూజర్ ఇంటర్‌ఫేస్) మరియు వినియోగదారు అనుభవం (యూజర్ ఎక్స్‌పీరియన్స్) రూపకల్పనలో నైపుణ్యం కల్పిస్తాయి. గ్రంథాలయ వెబ్‌సైట్‌లు లేదా డిజిటల్ యాప్‌లు సులభంగా నావిగేట్ చేయగలిగేలా, ఆకర్షణీయంగా ఉండేలా రూపొందించడం ద్వారా, వినియోగదారులు తమకు కావలసిన సమాచారాన్ని త్వరగా పొందగలుగుతారు.

**డిజిటల్ కంటెంట్ నిర్వహణ:**

లైబ్రరీ సైన్స్‌లో డిజిటల్ కంటెంట్‌ను నిర్వహించడం ఒక ముఖ్యమైన అంశం. ఈ-బుక్స్, ఆన్‌లైన్ జర్నల్స్, మరియు డిజిటల్ ఆర్కైవ్‌లను రూపొందించడంలో కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు ఉపయోగపడతాయి. ఉదాహరణకు, డిజిటల్ ఆర్కైవ్‌ల కోసం ఆకర్షణీయమైన గ్రాఫిక్స్ లేదా ఇన్ఫోగ్రాఫిక్స్ రూపొందించడం ద్వారా సమాచారాన్ని మరింత ఆసక్తికరంగా అందించవచ్చు.

**సాంకేతిక నైపుణ్యాల అవసరం:**

ఆధునిక గ్రంథాలయాలు ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మరియు డేటా ఎనలిటిక్స్ వంటి సాంకేతికతలపై ఆధారపడుతున్నాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు ఈ సాంకేతికతలను అర్థం చేసుకోవడానికి వాటిని గ్రంథాలయ సేవలలో అనుసంధానం చేయ డానికి సహాయపడతాయి. ఉదాహరణకు, డేటాబేస్ డిజైన్ లేదా కంటెంట్ మేనేజ్‌మెంట్



సిస్టమ్స్ (సీఎంఎస్) రూపకల్పనలో ఈ నైపుణ్యాలు కీలకం.

**మార్కెటింగ్, ఔట్‌రీచ్ :**

గ్రంథాలయ సేవలను ప్రచారం చేయడానికి డిజిటల్ మార్కెటింగ్ అవసరం. కంప్యూటర్ డిజైనింగ్ నైపుణ్యాలు సోషల్ మీడియా పోస్ట్‌లు, బ్రోచర్‌లు, మరియు ప్రమోషనల్ వీడియోలను రూపొందించడంలో సహాయపడతాయి. ఇవి గ్రంథాలయ సేవలను వినియోగదారులకు మరింత ఆకర్షణీయంగా చేరవేస్తాయి.

కంప్యూటర్ డిజైనింగ్ కోర్సుల ప్రయోజనాలు

ఈ కోర్సు వల్ల సమాచార సౌలభ్యం ఉంటుంది. డిజైనింగ్ నైపుణ్యాలు గ్రంథాలయ వనరులను సులభంగా అందుబాటులో ఉంచేలా చేస్తాయి. వృత్తిపరమైన అవకాశాలు మెరుగు పరుస్తాయి. ఈ కోర్సులు లైబ్రరీ సైన్స్ విద్యార్థులకు డిజిటల్ లైబ్రరీ నిర్వహణ, కంటెంట్ క్రియేషన్, అలాగే ఐటీ రంగాలలో ఉద్యోగ అవకాశాలను అందిస్తాయి. నవీన సాంకేతికతలతో అనుసంధానం కావటం తో కృత్రిమ మేధస్సు, డేటా విజువలైజేషన్ వంటి ఆధునిక సాంకేతికతలతో గ్రంథాలయ నిర్వహణను మెరుగుపరుస్తాయి. వినియోగదారులకు ఆకర్షణీయమైన డిజైన్‌ల ద్వారా గ్రంథాలయ సేవలను మరింత జనాదరణ పొందేలా చేయవచ్చు.

**భవిష్యత్తు అవకాశాలు**

డిజిటల్ యుగంలో గ్రంథాలయాలు కేవలం పుస్తక నిల్వలుగా కాకుండా సమాచార కేంద్రాలుగా మారాయి. కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు లైబ్రరీ సైన్స్ నిపుణులకు డిజిటల్ లైబ్రరీలు, ఆన్‌లైన్ డేటాబేస్‌లు, మరియు వర్చువల్ లైబ్రరీ సేవలను నిర్వహించే సామర్థ్యాన్ని అందిస్తాయి. భవిష్యత్తులో, ఈ నైపుణ్యాలు గ్రంథాలయ నిర్వాహకులను డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌లు, డేటా క్యూరేటర్‌లు, అలాగే ఐటీ కన్సల్టెంట్‌లుగా రూపొందించే అవకాశం ఉంది. చివరిగా...లైబ్రరీ సైన్స్‌లో కంప్యూటర్ డిజైనింగ్ కోర్సులు ఆధునిక గ్రంథాలయ నిర్వహణలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయి. ఇవి సమాచారాన్ని సులభంగా, ఆకర్షణీయంగా, మరియు సమర్థవంతంగా అందించడంలో సహాయపడతాయి. విద్యార్థులు ఈ కోర్సుల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను సంపాదించడం ద్వారా గ్రంథాలయ రంగంలో మరియు ఇతర డిజిటల్ రంగాలలో ఉన్నతమైన వృత్తిపరమైన అవకాశాలను పొందవచ్చు. ఈ కోర్సులు లైబ్రరీ సైన్స్‌ను ఆధునిక యుగానికి అనుగుణంగా మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.



డా. రాధికా రాణి,
అసిస్టెంట్ ప్రొఫెసర్ ,
హెచ్. ఓ.డీ. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్,
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

# భారీగా తెల్లచందనం చెక్కల స్మగ్లింగ్

- రూ.30 నుండి 35 లక్షల తెల్ల చందనం పట్టుకున్న ఎస్ఓటి పోలీస్‌లు
- ముగ్గురు అరెస్టు ఇద్దరూ పరార్




**చేవెళ్ల, జూలై 02 (జనంసాక్షి):** తెల్ల చందనం చెక్కలను అక్ర మంగా రవాణా చేస్తున్న ముగ్గురిని మాదాపూర్ ఎస్వోటీ, చేవెళ్ల పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఏసీపీ కిషన్ చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని సంగ్లి జిల్లా ఉంత్వాడి గ్రామం నుంచి రంగారెడ్డి జిల్లా షాబాద్ మం డలం తాళ్ల పల్లిలో ఉన్న ఆంధ్రా పర్ఫ్యూమ్ ఫ్యాక్టరీకి అక్రమంగా తెల్ల చందనం గంధం చెక్కలు తరలిస్తున్న ట్లు మాదాపూర్ ఎస్వోటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే చేవెళ్ల పోలీసులతో కలిసి మండలంలోని బస్తేపూర్ వద్ద నేషనల్ హైవే 163పై వాహ నాల తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రకు చెందిన ఐషర్ డీసీఎం నం. ఏమ్ హెచ్25 ఏజే 3689 ను ఆపి చెక్ చేయగా.. మొదట ఖాళీగా కనిపించింది. అయితే డ్రైవర్‌తో పాటు ఉన్న ఇద్దరు వ్యక్తులు పొం తన లేని సమాధానాలు చెబుతుండడంతో అనుమానం వచ్చి పూర్తిస్థాయిలో తనిఖీ చేయగా..డ్రైవర్ కేబిన్ వెనుక భాగంలో కంటైనర్ టైపులో రహస్య విభాగం కనిపించింది. దాన్ని తెరిచి చూడగా ఫర్టిలైజర్ బ్యాగుల్లో చిన్న చిన్న చెక్క ముక్కలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులు సమాచారం ఇవ్వగా... వాటిని సాంటా లమ్ అల్బమ్ శాస్త్రీయ పేరు కలిగిన తెల్ల చందనంగా నిర్ధారించారు. వెంటనే డీసీఎం డ్రైవర్ అబ్దుల్ అజీజ్, పర్ఫ్యూమ్ ఫ్యాక్టరీ సూపర్ వైజర్ కేవీపీ షుహైబ్, అమ్మిన వ్యక్తి విజయ్ హన్మంత్ మానేను అదుపులోకి తీసుకొని డీసీఎంను సీజ్ చేసి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాలుగు ఫోన్‌లను కూడా స్వాధీనం చేసుకు న్నారు. పట్టుబడ్డ తెల్ల చందనం చెక్కలు టన్ను (1000 కిలోలు) బరువున్నాయని, వీటి విలువ రూ.30 లక్షల నుంచి రూ. 35 లక్షల వరకు ఉంటుందని ఏసీపీ తెలిపారు. ముగ్గురు నిందితులతో పాటు ఫ్యాక్టరీ ఓనర్ నాగర్ గూడకు చెందిన అబ్దుల్లా కున్హి, మేనేజర్ సాదిక్ పైనా ఫారెస్ట్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని వెల్లడించారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ ఓనర్, మేనేజర్ పరారీలో ఉన్నారని త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, మాదాపూర్ ఎస్వోటీ ఇన్ స్పెక్టర్ సంజయ్, ఎస్సై సతీశ్ రెడ్డి, చేవెళ్ల ఎస్సై శీరిష, చిల్కూరు ఫారెస్ట్ ఆఫీసర్ రవి కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ లో ఏసీబీ దూకుడు

**హైదరాబాద్ , జూలై 02 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచి నట్లే కనిపిస్తుంది. 2025 సంవత్సరంలో గత ఆరు నెలలుగా పరిస్థితులను చూస్తుంటే ప్రతిరోజు ఎక్కడో ఒక దగ్గర ఏదో ఒక ప్రభుత్వ కార్యాల యం లో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు అన్న వార్తలు పతాక స్థాయి లో వినిపిస్తున్నాయి. ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి, పత్రికలకు విడుదల చేసిన నివేదికలో కూడా కేసుల తీరు చూస్తుంటే ఏసీబీ ని అభినందించకుండా ఉండలేక పోతున్నా వాళ్ల పనితీరుకు జర్నలిస్టుల తరఫున కూడా అభినందనలు వెల్లువెత్తుతు న్నాయి. ఏసీబీ అధికారులు జనవరి నుండి జూన్ వరకు జరిగిన కేసులు వాటికి సంబంధించిన వివరాలతో విడుదల చేసిన పూర్తి వివరాలు

**ఆరునెలల్లో రూ.కోట్ల కొద్దీ అక్రమాస్తుల స్వాధీనం**

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ(ఏసిబి) దూకుడు పెంచింది. 2025 జనవరి నుం చి జూన్ వరకు ఆరు నెలల్లో 126 అవినీతి కేసులను నమోదు చేసింది. ఈ కేసుల్లో 125 మంది ప్రభుత్వ ఉద్యో గులను అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలిం చారు. ఈ కాలంలో రూ.27.66 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. లంచాలు తీసుకుంటుం డగా రెడ్ హ్యాండె డ్‌గా పట్టుబడుతూ 80 కేసులు నమోద య్యాయి. ఈ కేసుల్లో వివిధ శాఖల నుంచి రూ.24.57 లక్షల నగదు స్వాధీనం చేసు కున్నారు. ఒక్క జూన్ నెలలోనే రూ.3.43 లక్షలు సీజ్ చేశారు. ఆర్‌టీఏ చెక్‌పోస్టులు, సబ్-రిజిస్ట్రార్ కార్యా లయాలపై ఆకస్మిక తనిఖీల్లో





రూ.2 .72 లక్షల అక్రమ నగదు స్వాధీనం చేశారు. 8 ఆదా యానికి మించిన ఆస్తుల కేసుల్లో రూ.13.50 లక్షలు స్వాధీనం చేసుకోగా, మరో రూ.5.22 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. ఇవే కాకుండా అదనంగా, 14 క్రిమినల్ మిస్క ండక్ట్ కేసులు, 10 రెగ్యులర్ ఎంక్వైరీలు, 11 ఆకస్మిక తనిఖీలు, 3 డిస్ట్రిక్ట్ ఎంక్వైరీ లు నమోదయ్యాయి. ఒక్క జూన్ లోనే 31 కేసులు నమోదు కాగా అందులో 15 ట్రాప్ కేసులు, 2 ఆస్తుల కేసులు, 3 మిస్‌కండక్ట్ కేసులు నమోదయ్యాయి. గడిచిన ఆరు నెలల్లో 129 కేసులను ఫైనలైజ్ చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపగా, జూ 11 కేసులు ఫైనలైజ్ అయ్యాయి. ఈ మేరకు ఏసీబీ వివరాలు విడుదల చేసింది.

# నూతన దిశలో కజకిస్తాన్, తెలంగాణ మధ్య సంబంధాలు

- భట్టి విక్రమార్క, డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ సమావేశం



**హైదరాబాద్, జూలై 02 (జనంసాక్షి) :** కజకిస్తాన్, తెలంగాణ మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు మరింత బలపడే దిశగా ఓ కీలక అడుగు పడింది. ఉప ముఖ్యమంత్రి అధికార నివాసంలో భట్టి విక్రమార్క మల్లు, కజకిస్తాన్ ఆం ధ్రప్రదేశ్, తెలంగాణ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ సమావేశమయ్యారు. ఈ భేటీలో కజకిస్తాన్, తెలంగాణ మధ్య వ్యాపార సహ కారం, పెట్టుబడుల అవకాశాలు, ఇతర అనేక అంశాలపై చర్చ జరిగింది. త్వర లో హైదరాబాద్ - కజకిస్తాన్ మధ్య నేరుగా విమాన సర్వీసులపై కూడా ప్రకట న ఉండొచ్చన్న సంకేతాలు వెలువడ్డాయి. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్యం, ఆరోగ్య సేవలు, విద్య, రవాణా కనెక్టివిటీ విస్తరణపై ప్రధా నంగా చర్చించారు. ఇటీవల కజకిస్తాన్‌లో ఔషధ తయారీ కేంద్రాన్ని స్థాపిం చేందు కు హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ లాబొరేటరీస్, కజక్ ఇన్వెస్ట్ మధ్య జరిగిన ఒప్పందం గురించి వివరించారు. ఇది భారత - కజకిస్తాన్ మధ్య ఓ కీలక మైలురాయిగా చెప్పవచ్చు. హైదరాబాద్ - అల్మాటీ (కజకిస్తాన్) నడుమ నేరుగా విమాన సేవలు ప్రారంభించాలన్న ప్రతిపాదనపై చర్చ జరిగింది. జీఎంఆర్ ఎయిర్ పోర్ట్‌లో ఎయిర్‌లైన్ మార్కెటింగ్, రూట్ డెవలప్‌మెంట్ హెడ్ ఆనంద ఆచార్యతో జరిగిన సమావేశం తెలిపారు. త్వరలో ఈ విమాన సర్వీసు ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఇది పర్యాటకం, వాణిజ్యం, సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహించనుంది. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సీఎండీ డాక్టర్ శ్రీనివాస్ రావుతో కజకిస్తాన్‌లో ఒక వైద్య విద్యా సంస్థ, ప్రపంచ స్థాయి హాస్పిటల్ ఏర్పాటు చేయాల న్న అంశంపై చర్చలు జరుగుతున్నట్లు తెలిపారు. కజకిస్తాన్ కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ ఖాన్ ఇచ్చిన కజకిస్తాన్ సంద ర్శన ఆహ్వానా న్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క కుటుంబం, డాక్టర్ ఖాన్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక విందు ఇచ్చారు. ఇది తెలంగాణ - కజకిస్తాన్ మధ్య ఉన్న స్నేహభావాన్ని, గౌరవాన్ని ప్రతిబింబించింది. పరస్పర మైత్రికి చిహ్నంగా నిలిచింది.

# అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి

- 24 ఇంటూ 7 మాదిరి పని చేయాలి
- ఎంఈటీలకు హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం



**హైదరాబాద్ , జూలై 02 (జనంసాక్షి) :** వర్షాకాలం పని చేసే మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్(ఎంఈటీ)లు 24 ఇంటూ 7 మాదిరి పనిచేయడమే కాకుండా అను నిత్యం అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. వాతా వరణ హెచ్చరికలను క్షుణ్ణంగా పరిశీలించి.. వర్షానికి ముందే సన్నద్ధ మవ్వాలన్నారు. జులై 1వ తేదీ నుంచి రంగంలోకి దిగిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల కాంట్రా క్టర్లతో పాటు.. హైడ్రా మార్షల్స్, డీఆర్ ఎఫ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లతో బుధవా రం ఏర్పాటు చేసిన సమావేశంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడారు. వర్షం పడితే తలెత్తే సమస్యలపై పూర్తి అవగాహన తో ఉండాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తుతుం దో.. అందుకు పరిష్కారం ఏంటో కూడా తెలియాల న్నారు. వర్షం పడినప్పుడు అప్రమత్తంగా ఉండి.. రహదారులను, నివాసాలను వరద ముం చెత్తకుండా జాగ్రత్త పడాలన్నారు. వర్షం లేనప్పుడు సమస్య పరిష్కార ంపై దృష్టి పెట్టాలన్నారు.

**ప్రజాసమస్యలపై పరిధిలు వద్దు..**

వర్షాకాలం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసే బాధ్యతను హైడ్రాపై నమ్మకంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని.. అది వమ్ము కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని హైడ్రా కమిషనర్ సూచించారు. ప్రజల విశ్వాసం చూరగొనేలా మన పని విధానం ఉండాలన్నారు. ప్రజలు సమస్యల్లో ఉంటే పరిధి లు గీసుకొని ఉండాల్సిన పని లేదని.. పక్క సర్కిల్‌లో సమస్య ఉంటే వెంటనే అంద రూ చేతులు కలపాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జీహెచ్ ఎంసీ, జలమండలి, హైడ్రా, ఇరిగేషన్ ఇలా సంబంధిత శాఖలన్నిటితో అధికారులు సమన్వయం ఏర్పాటు చేసి.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యం కావాలన్నారు. వాహ నాలు మొరాయించడం, నీటిని తోడే పంపులు పని చేయడంలేదు ఇలాంటి సమస్య లు రాకుండా జాగ్రత్త పడాలి. ఎవరికైనా ఇబ్బంది ఉంటే..వెంటనే సంబంధిత అధికారి దృష్టికి తీసుకువస్తే ఆ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నా రు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాలు ఫిర్యాదు చేసి నప్పుడు వాటి పరిష్కారానికి ఎంతో బాధ్యత పడాలన్నారు.

# 9 రోజుల్లో 9000 కోట్ల రైతు భరోసా


- 25 లక్షల మంది రైతులకు 20 వేల కోట్ల రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే..
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**బోయిన్ పల్లి జూలై 02 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయిన్ పల్లి మండల కేంద్రంలో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే రైతుల పక్షాన నిలిచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బోయిన్‌పల్లి మండల కేంద్రంలోని శివాజీ నగర్ హై స్కూల్ నుండి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ విగ్రహం వద్ద ముగిసింది. అనంతరం కాంగ్రెస్ నాయకులు, మహిళలు, రైతులు కలిసి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం, మాట్లాడుతూ కేవలం 9 రోజుల్లోనే 9,000 కోట్ల రైతు భరోసా అందించిన ప్రభుత్వం కాంగ్రెస్‌దే. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు 20 వేల కోట్ల రుణమాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దిట్టమైన వ్యవసాయ బాగోగులపైన ఉన్న నిబద్ధతను చాటుతోంది అని తెలిపారు. ఇటీవలె జరిగిన రైతు భరోసా సంబరాల సందర్భంగా జిల్లా ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఒక్క సంవత్సరంనర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష కోట్లు రైతాంగం కోసం ఖర్చు పెట్టింది. ఇది దేశంలోని మరే రాష్ట్రం చేయని రికార్డు, అని అన్నారు. అంతేకాదు, 2004లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దేశవ్యాప్తంగా 72,000 కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని గుర్తు చేశారు. రైతు బీమా, రైతు భరోసా వంటి పథకాలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఉమ్మడి జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు జోగినపల్లి వెంకట రామారావు, వెసిరెడ్డి దుర్గారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

# గల్ఫ్ బాధిత కుటుంబాలకు అండ

## బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ బ్యూరో,జూలై 2(జనం సాక్షి)నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని టెంబూర్ని గ్రామానికి చెందిన బొగుడమీది సంతోష్ (36) ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లిన కొద్ది రోజులకే అనుమానాస్పద స్థితిలో మరణించడంతో మండల నాయకులు బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కి తెలపడంతో,మృత దేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చే దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వీలైనంత త్వరగా సదరు వ్యక్తి మృత దేహాన్ని స్వదేశానికి చేర్చాలని ఉన్నతాధికారులతో విదేశాంగ శాఖ,రాష్ట ఎన్ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడారు. అదేవిధంగా మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన గొర్రె రాజేందర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి పలు కారణాలతో దుబాయ్ లో చిక్కుకోవడంతో సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు,మండల నాయకులు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకు రావడంతో గల్ఫ్‌లో చిక్కుకున్న రాజేందర్ ను స్వదేశానికి తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వ,విదేశాంగ శాఖ,రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా వ్యక్తికి స్వదేశానికి తీసుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

నిర్మల్ పట్టణం లోని మంజులాపూర్‌కు చెందిన పన్నాల శ్రీనివా స్ అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి (సౌదీ అరేబియా)లో తప్పి పోవడంతో కుటుంబ సభ్య లు స్థానిక పట్టణ నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించగా ,ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి విదేశాంగ శాఖ అధికారుల తో ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై సెల్ అధికారులతో మాట్లాడి సదరు వ్యక్తి ఆచూ కీ కోరారు. చర్యలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# సమ సమాజ స్వాప్నికుడు సామాజిక విప్లవకారుడు

## పట్టువదలని ప్రజాసేవకుడు ఎమ్మెల్యే బాలు నాయక్

**కొండమల్లేపల్లి, జూలై 2 (జనంసాక్షి) :** ఎంత ఎదిగినా ఒదిగేతత్వం.. క్రమశిక్షణ లో ఆణిముత్యం.. రాజకీయాల్లో అజాత శత్రుత్వం.. శిఖర సమానం ఆయన వ్యక్తిత్వం. ప్రజలందరూ మెచ్చిన ప్రజాసేవ స్వాప్నికూడు.. కోట్లు ఆర్జించే అవకా శం ఉన్నా ధనవ్యామోహం లేదు. సిరిసంపదల విలువ తెలిసినా కూడపెట్టాలన్న ఆశ లేదని ఆయన ఎమ్మెల్యే బాలునాయక్. దేవరకొండ నియోజకవర్గ గిరిజన ముద్దుబిడ్డ, రైతు బాంధవుడు.. ప్రజలందరూ అభిమానంగా ఆరాధించే ప్రజానేత జన్మదినం సందర్భంగా జనంసాక్షి కథనం..

అభివృద్ధికి సంక్షేమానికి సమ ప్రాధాన్యం ఇస్తామని పెండింగ్ ప్రాజెక్టులు తొందరగా పూర్తి చేసి యువకులకు విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి ఆరు గ్యారెంటీలతో పాటు అర్హులందరికీ కాంగ్రెస్ పథకాలు అమలు చేసి ప్రజలందరి సమస్యలు పరిష్కరిస్తానని ఎన్నికల బరిలో దిగి దేవరకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నేనావత్ బాలు నాయక్ అఖండ మెజారిటీతో ఎన్నికయ్యారు. జడ్పీటీ సీగా ప్రారంభమైన తన రాజకీయ జీవితం ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా ప్రస్తుతం మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గిరిజన కోటాలో బాలు నాయక్ మంత్రి పదవి వచ్చే అవకాశం ఉందని జోరుగా చర్చ జరుగుతోంది. సీఎల్పీ సమావేశంలో ఇప్పటికే ఒకరిద్దరి పేర్లు కూడా మంత్రి పదవులకు ప్రపోజల్ చేసి అధిష్టానానికి పంపినట్టు అంతర్గత సమాచారం. నేనావత్ బాలు నాయక్ విద్యార్థి దశ నుండే కాంగ్రెస్ పార్టీపై అభిమానం పెంచుకొని కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం అయిన ఎన్ఎస్ యుఐలో చురుకుగా పని చేశారు. తన రాజకీయ ప్రస్థానం ఎంపిటిసిగా ప్రారంభించి పోటీ చేసిన మొదటిసారి ఎంపిటిసి ఎన్నికల్లో ఓడిపోయారు. ఓడిపోయిన బాధ పడకుండా మొక్కవోని దీక్షతో కాంగ్రెస్ జెండా పట్టుకొని అంచలంచెలుగా ఎదుగుతూ జడ్పిటిసిగా మార్కెట్ కమిటీ చైర్మన్ గా, జడ్పీ చైర్మన్ గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాక్షేత్రంలో ప్రజలకు తమ విలువైన సేవలు ప్రజలకు అందిస్తున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలు నాయక్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉంటూ కార్యకర్తలకు మనో ధైర్యాన్ని కల్పిస్తూ కార్యకర్తలు పిలిస్తే పలికే బలమైన నేతగా బాలు నాయక్ ఎదిగారు. అభివృద్ధిలో రాజీ లేకుండా అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదిం చుకున్నారు. బాలు నాయక్ మాటిస్తే తప్పని నాయకుడిగా ప్రజలందరూ ఆరాధిస్తారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే బాలు నాయక్ సమర్థవంతుడు, అభివృద్ధి చేసే సత్తాగల నాయకుడని ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం కీర్తిస్తుంటారు. బలమైన రాజకీయ నేతగా ఎదిగిన ఎమ్మెల్యే బాలు నాయక్ గిరిజన ప్రాంతమైన దేవరకొండలో పెండింగ్ ప్రాజెక్టులైన నక్కల గండి, ఎస్ఎల్బీసీ, పెండ్లిపాకల రిజర్వాయర్ లు పూర్తి చేయాలని మొక్కవోని దీక్షతో ఉన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి అయితే సాగు త్రాగునీరుకు ఇబ్బం దులు ఉండవని దీంతో నల్లగొండ జిల్లా నీటి సమస్య తీరుతుందని దేవరకొండ నియోజకవర్గం సస్యశ్యామల మవుతుందని బాలు నాయక్ ఆశాభావం.



పారిశ్రామికంగా, విద్య, వైద్య, ఆరోగ్యపరంగా, నియోజకవర్గం అభివృద్ధి చేయాలని పారిశ్రామికంగా పలు కంపెనీలు వస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయని తద్వారా దేవరకొండ నియోజకవర్గం మోడల్ సిటీగా అభివృద్ధి చెందుతుందని నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రజలందరూ ఆరాధించే ఆత్మీయ నేత ఎమ్మెల్యే బాలునాయక్ నిండు నూరేళుఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రజాక్షేత్రంలో వారి విలువైన సేవలు ప్రజలకు అందిస్తూ రాజకీయాల్లో వారు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న నియోజక వర్గవాసులు ఎమ్మెల్యేకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# అపర్ణ జెనాన్ లో అనుమానిత హత్య



**రాజేంద్రనగర్,జులై2(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, పుప్పలగూడ గ్రామంలోని అప ర్ణ జెనాన్ లేబర్ కాలనీలో అను మానిత హత్య జరిగింది. ఎస్సై మునీందర్ ప్రకారం పుప్పలగూడ గ్రామంలోని అపర్ణ జెనాన్ లేబర్ కాలనీ ఆవరణలోని ఆర్ఓ ప్లాంట్ ఆపరేటర్ సోను కుమార్ ఫోన్ ద్వారా నంబర్ ఈ 114 వెలుపల ఒక వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు సమాచా రం అందింది. వెంటనే, అపర్ణ జెనా న్ హెచ్ఆర్ పడాల పవన్ కుమార్ డయల్ 100కు డయల్ చేయడంతో వెంటనే స్పందిం చిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తనిఖీలో మృతుడు పశ్చిమ బెంగాల్ లోని అసన్సోల్‌కు చెందిన రోషన్ హేలా,(43)పెయింటర్‌గా గుర్తించారు. అతని గొంతుపై తీవ్రమైన గాయం కనిపించింది. ఇది పదునైన ఆయుధం ,కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటన స్థలంలో పోలీసులు పరువుపై విచారణ జరుపగా మృతుడు ఇటీవలే కాంట్రాక్టర్ మురళీధర్ ద్వారా అసన్సో ల్‌కు చెందిన రంజిత్ పండి ట్(34) భృగు పండిట్‌తో కలిసి ఆస్థలంలో పెయింట ర్‌గా చేరాడని ప్రాథమిక విచారణలో తేలింది. మృతుడి కుటుంబస భ్యులకు న్యాయం చేయాలని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
03 జూలై 2025

# మరోమారు పాశమైలారానికి మంత్రి దామోదర

## మీనాక్షి, మహేశ్ కుమార్ గౌడ్‌ల రాక

## మంత్రిని నిలదీసిన బాధిత కుటుంబాలు



**సంగారెడ్డి, జులై2 (జనంసాక్షి) :** సిగాచి పరిశ్రమ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహను బాధితులు నిలదీసారు. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుధవారం ఉదయం ఘటనా స్థలికి చేరుకున్నారు. మంత్రి వెంట తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలిని వారు పరిశీలించారు. అయితే అధికారుల ముందు బాధితుల బంధువులు ఆందోళనకు దిగారు. మంత్రి దామోదరతో బాధితులు వాగ్వాదానికి దిగారు. మూడు రోజులైనా తమ వారి ఆచూకీ చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు చేపడతామంటూ బాధితులను మంత్రి దామోదర రాజనర్సింహ సముదాయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సిగాచి ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని.. 13 మంది మిస్సింగ్‌లో ఉన్నారని తెలిపారు. 11 మంది మృతదేహాలను అప్పగించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని అన్నారు. ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని స్పష్టం చేశారు. కంపెనీ యజమాని అందుబాటులోకి వచ్చారని.. ఇప్పటికే కంపెనీపై కేసు నమోదు చేయించామన్నారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 11 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందని మంత్రి దామోదర వెల్లడించారు. ఈ ఘటనను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సీరియస్‌గా తీసుకున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. బాధితులకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందని.. కంపెనీ నుంచి కూడా బాధితులకు నష్టపరిహారం అందజేసేలా చూస్తామని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే కమిటీ వేశామని మీనాక్షి తెలియజేశారు.

ముఖ్యమంత్రి , మంత్రులు ఈ ఘటనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని చెప్పారు. మృతదేహాలను ప్రత్యేకంగా ఫ్రీజర్లలో మార్చురీలో భద్రపరిచామన్నారు. గాయపడిన వారికి కంపెనీ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమలో మూడోరోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ క్రేన్లు, జేసీబీలతో శిథిలాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. అయితే తమ వారి ఆచూకీ తెలియడంలేదంటూ ఘటనా స్థలిలో బంధువుల ఆందోళనకు దిగారు.

# బిసి రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు

## 17న రైలురోకో చేసి తీరుతాం

## ఖమ్మంలో పోస్టర్ ఆవిష్కరించిన కవిత



**ఖమ్మం, జులై 2 (జనంసాక్షి) :** 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆమోదం పొందిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు జులై 17వ తేదీన రైలు రోకో కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. ఈ రైలు రోకోలో అత్యధిక సంఖ్యలో పాల్గొని.. బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి మద్దతు తెలపాలంటూ ఖమ్మం జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా ఆమె పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క బీసీ బిడ్డ పాల్గొనాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుదే బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైలు రోకోకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు నిచ్చింది. అందులోభాగంగా ఇటీవల అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు.

ఖమ్మం జిల్లా అంటేనే ఉద్యమాల ఖిల్లా అని గుర్తు చేశారు. అయితే వైరా నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించండి.. అంతేకానీ బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసుల గురించి కాదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు కవిత చురకలంటించారు. పోలవరం - బనకచర్ల నీటి విషయంలో ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు మాట్లాడాలని ఈ సందర్భంగా కవిత డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఇస్తామని అనేక సభలలో ఆ పార్టీ నేతలు హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మరణం బీఆర్ఎస్ పార్టీతోపాటు ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. మదన్ లాల్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని చెప్పారు. మదన్‌లాల్ కుటుంబానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా కవిత భరోసా ఇచ్చారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన సీపీఎం నేతలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నవ తెలంగాణ దినపత్రిక ఎడిటర్ రమేష్, సీజీఎం ప్రభాకర్ సీఎంను కలిసారు. ఆగస్టు 1 న జరిగే నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

## మాజీమంత్రి, గిరిజన నేత కవాసీ లఖ్మాకు సీతక్క పరామర్శ

**రాయపూర్, జులై 2 (జనంసాక్షి) :** చత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ సెంట్రల్ జైలులో ఆ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మాజీ మంత్రి కవాసీ లఖ్మాను మంత్రి సీతక్క పరామర్శించారు. మంత్రి సీతక్క వెంట ట్రైకార్ చైర్మన్, ఆదివాసి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ ఇతర నేతలు జైలులో లఖ్మాను పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు, అనుచరులకు సంఘీభావం తెలిపారు. అనంతరం స్థానిక మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. మాజీ మంత్రి ఆరు సార్లు ఎంఎల్ఎ, ఆదివాసీల అగ్రనేత కవాసీ లఖ్మాని అకారణంగా అరెస్టు చేశారన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే లఖ్మాని బిజెపి ప్రభుత్వం అక్రమ కేసులతో వేధిస్తోందని ఆరోపించారు. నిరాధారమైన కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఏలాంటి సాక్షాధారాలు లేకుండానే తప్పుడు కేసులతో ఆరు నెలలుగా జైలులో పెట్టారని ఆరోపించారు. బస్తర్‌లో ఆదివాసీల గొంతుకగా ఉన్న లఖ్మా అక్రమ అరెస్టును ఖండిస్తున్నామన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలను బిజెపి ప్రభుత్వం బలవంతంగా తరిమి వేస్తోందని విమర్శించారు. ఆదివాసీల అణిచివేతలో భాగంగానే లఖ్మాపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

## ఫిష్ వెంకటేశ్ ఆరోగ్యం విషమం

### వైద్యానికి ఆదుకోవాలని కూతురు వినతి

**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** తన తండ్రి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, దీనస్థితిలో ఉన్న తమను ఆదుకోవాలంటూ ఫిష్ వెంకట్ కుమార్తె స్రవంతి కోరుతున్నారు. నాలుగేళ్లుగా రెండు కిడ్నీలూ చెడిపోవడం తో డయాలసిస్ ద్వారా చికిత్స పొందుతున్నారు వెంకట్. ప్రస్తుతం బోడుప్పల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. రెండు కిడ్నీలు మార్చిడి చేయాలని, ఆరోగ్యం క్షీణిస్తోందని వైద్యులు చెప్పినట్లు స్రవంతి తెలిపారు. వైద్య సేవలు పొందలేని దీన స్థితిలో ఉన్నామని, దాతలు ఎవరైనా సాయం చేయాలని ఆమె కోరుతున్నారు. 'ఆది', 'దిల్', 'అత్తారింటికి దారేది', 'డీజే టిల్లు' వంటి పలు హిట్ సినిమాల్లో వెంకట్ నటించిన విషయం తెలిసిందే.

# పుష్ప తరహాలో గంధం చెక్కల తరలింపు

- ముఠాను అరెస్ట్ చేసిన ఎస్ఓటి పోలీసులు

**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** శ్రీ గంధం చెక్కలను అక్రమ రవాణా చేస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటి, చేవెళ్ల పోలీసులు అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని బస్తేపూర్‌లో సోదాలు నిర్వహించిన పోలీసులు వెయ్యి కిలోల శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చెక్కలను తరలిస్తున్న డిసిఎంను సీజ్ చేశారు. మహారాష్ట్ర నుంచి రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నాగర్‌గూడలోని ఓ పర్ఫ్యూమ్ ఫ్యాక్టరీకి ఈ చెక్కలను తరలిస్తున్నారు. 'పుష్ప' సినిమా తరహాలో డిసిఎంలో చెక్కలను దాచారు. వీటి విలువ రూ.30 లక్షలు ఉంటుందని చేవెళ్ల ఎసిపి కిషన్ తెలిపారు. డిసిఎం డ్రైవర్ అబ్దుల్ అజీజ్, సూపర్‌వైజర్ సోహెబ్, రైతు విజయ్ హనుమంతును పోలీసులు అరెస్ట్ చేశారు. ఫ్యాక్టరీ యజమాని అబ్దుల్ కుర్వి, మేనేజర్ సిద్ధిఖ్ పరారీలో ఉన్నారు. పట్టుకున్న ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు.. పరారీలో ఉన్నా వాళ్ల కోసం గాలిస్తున్నారు.

# ఫిలిప్పీన్స్‌లో కామారెడ్డి జిల్లా వైద్య విద్యార్థి మృతి

- గుండెపోటుతో కుప్పకూలినట్లు స్నేహితుల వెల్లడి

**కామారెడ్డి, జులై 2 (జనంసాక్షి) :** ఫిలిప్పీన్స్‌లో కామారెడ్డి జిల్లాకు చెందిన వైద్య విద్యార్థి వడ్ల యోగి (23) మృతిచెందాడు. గుండెపోటుతో చనిపోయినట్లు అతడి బంధువులు తెలిపారు. పుట్టినరోజు నాడే మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వివరాల్లోకి వెళితే.. దోంగ్లీ మండలం కుల్లెం గ్రామానికి చెందిన యోగి.. మూడేళ్ల క్రితం ఎంబీబీఎస్ కోసం ఫిలిప్పీన్స్ వెళ్లాడు. కళాశాలకు సెలవులు ఇవ్వడంతో 3 నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి 15 రోజుల కిందటే తిరిగి అక్కడికి చేరుకున్నాడు. బుధవారం యోగి పుట్టినరోజు కావడంతో ఉదయం 8 గంటలకు అతడి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఛాతీలో నొప్పి వస్తుందని యోగి తన తండ్రికి ఫోన్ చేసి చెప్పగా.. ఆస్పత్రికి వెళ్లాలని ఆయన సూచించారు. స్నేహితుల సాయంతో ఆస్పత్రికి వెళ్తుండగా మెట్లు దిగే క్రమంలో యోగి కుప్పకూలిపోయాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధరించారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు అతడి స్నేహితులు తెలిపారు. కుమారుడి మరణవార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమారుడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

# పాపికొండల విహారయాత్ర నిలిపివేత

**అల్లూరు, జూలై2 (జనంసాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో అల్లూరి జిల్లాలోని దేవీపట్నం నుంచి పాపికొండల విహారయాత్రను జలవనరుల శాఖ తాత్కాలికంగా నిలిపివేసింది. వర్షంతో పాటు గోదావరిలో నీటిమట్టం పెరుగుతున్న కారణంగా అధికారులు ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు దేవీపట్నం మండలం దండంగి, డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై గోదావరి వరద ప్రవాహం పెరిగింది. దీంతో గండి పోచమ్మ ఆలయం వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పాటు నదీ పరివాహక ప్రాంతాల నుంచి నీరు భారీగా గోదావరిలోకి వచ్చి చేరుతోంది. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే వద్ద నీటిమట్టం 27.16 మీటర్లకు పెరిగింది. ఇదిలావుంటే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని డుడుమ జలాశయం వద్ద నీటిమట్టాలు ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 2,590 అడుగులు కాగా.. ప్రస్తుతం 2588.3 అడుగులకు చేరుకుంది. దీంతో ఏడో నంబరు గేటు ద్వారా వెయ్యి క్యూసెక్కుల వరద నీటిని దిగువన బలిమెల జలాశయానికి విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి తగ్గకపోతే మరిన్ని గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

# ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

## ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, జులై 2(జనంసాక్షి) :** అధికారంలో ఉన్నా లేకపోయినా, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. పేదల ఆకలి తీర్చడం, బడుగు బలహీన వర్గాల అవసరాలను తీర్చడమే కాంగ్రెస్ అసలైన లక్ష్యమని అన్నారు. ప్రతి బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచన మేరకు మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించామని చెప్పారు.ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ అభిమతాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 90 వినతులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో అధికంగా ధరణి బాధితుల సమస్యలే ఉన్నాయని చెప్పారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వమంతా కృషి చేస్తోందని తెలిపారు. ఓ పేదవాడు నేరుగా మంత్రిని కలిసి సమస్య వినిపించడం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుం దన్న సంగతి ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. అలాగే, బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో హరీష్ రావు తడబడినట్లు స్పష్టంగా అర్థమవుతోందని శ్రీహరి పేర్కొన్నారు. 100 టీఎంసీల నీరు వృథాగా పోతుందన్న వార్తలు మీడియాలో వచ్చినట్లు తెలిపారు. ఈ అంశంపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని అన్నారు. వచ్చే వారం కృష్ణ నదీ జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



రాష్ట్ర బీజేపీ నేతలపై కూడా మంత్రి శ్రీహరి తీవ్ర విమర్శలు చేశారు. బీసీల పట్ల బీజేపీ అనుసరిస్తున్న వైఖరి మరోసారి బయటపడిందన్నారు. గతంలో బండి సంజయ్‌ను తొలగించి కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవిని అప్పగించిన తీరు ఈ విషయాన్ని స్పష్టంగా చూపుతుందని విమర్శించారు. కుల గణన సర్వే అనంతరం కూడా బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కవితకు కీలక పదవి ఇవ్వాలన్న సూచన చేస్తూ, రైల్ రోకో కార్యక్రమం చేపట్టేముందు పార్టీలో బీసీలకు ప్రాధాన్యత కలిగిన పదవి ఏర్పాటు చేయాలని అన్నారు.

## తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

### వారికి నల్లా, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయాలి

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్

**హైదరాబాద్, జులై 2 (జనంసాక్షి) :** ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారంటూ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాళ్లే అని విమర్శించారు. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండని విజ్ఞప్తి చేశారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళ్లు మాట వినరు అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. 'బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్యేగా ఒక సూచన చేస్తున్నా. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదు. సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాళ్లే. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండి. ఇరిగేషన్ ప్రాజెక్టు పైసలు ఒక్క రూపాయి ఇవ్వకండి. వాళ్లే చంద్రబాబు వద్దకు వెళ్లి కాళ్లు పట్టుకొని బనకచర్ల బంద్ పెట్టిస్తారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళ్లు మాట వినరు' అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.




# మాజీ ప్రధాని షేక్ హసీనాకు 6నెలల జైలుశిక్ష




**ఢాకా, జులై 2 (జనంసాక్షి) :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ 6 నెలల జైలుశిక్ష విధించింది. ఐసీటీ చైర్మన్ జస్టిస్ ఎండీ గోలం మోర్తుజా మొజుందార్ నేతృత్వంలో త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పును వెలువరించినట్లు 'ఢాకా ట్రిబ్యూన్' తెలిపింది. సుమారు ఏడాది క్రితం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా పదవీచ్యుతురాలయ్యారు. వెంటనే దేశం వదిలిపెట్టి భారతదేశంలో ఆశ్రయం పొందుతున్నారు. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రిబ్యునల్ షేక్ హసీనాకు గత జూన్‌లో అరెస్టు వారెంట్ చేసింది. బంగ్లాలోని తాత్కాలిక ప్రభుత్వం సైతం షేక్ హసీనాను రప్పించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కింద ఐసిటీ 6 నెలల జైలు శిక్ష విధించింది. బంగ్లా నుంచి పారిపోయిన 11 నెల తర్వాత హసీనాకు ఒక కేసులో జైలుశిక్ష పడటం ఇదే మొదటిసారి. కాగా, ఇదే కేసులో హసీనాతో పాటు గోవిందగంజ్‌కు చెందిన రాజకీయ నేత షకీల్ అకాండ్ బుల్బుల్‌కు కూడా ట్రిబ్యునల్ రెండు నెలల జైలుశిక్ష విధించింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి, ఆందోళనలు పతాక స్థాయికి చేరుకోవడంతో 2024 ఆగస్టు 5న షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసారు. ఢాకాలోని అధికార నివాసాన్ని ఖాళీ చేసి దేశం వదిలిపెట్టారు. అనంతరం క్రమంలో ఆమె న్యూఢిల్లీ చేరుకున్నారు. సురక్షిత ప్రాంతంలో ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నారు. స్వదేశంలో రిజర్వేషన్ ఆందోళనలు చెలరేగడం, ఆ తర్వాత జరిగిన అల్లర్లలో 1,400 మంది ప్రాణాలు కోల్పోయారని షేక్ హసీనాపై నేరాభియోగాలు నమోదయ్యాయి. అయితే తనపై వచ్చిన ఆరోపణలను షేక్ హసీనా తోసిపుచ్చారు.

# బిజెపి అధ్యక్ష ఎన్నికకు సమాయత్తం

- పలు రాష్ట్రాల్లో పూర్తియన అధ్యక్షుల ఎన్నిక

**న్యూఢిల్లీ, జులై 2 (జనంసాక్షి) :** బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ మరింత వేగవంతమైంది. ఇందులో భాగంగా 7 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ అధ్యక్షులను బీజేపీ నియమించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మిజోరం, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌కు కొత్త అధ్యక్షులను నియమించింది. బీజేపీ సంఘటన్ పర్వ్ (ఆర్గనైజేషనల్ డ్రైవ్) రెండో దశలో భాగంగా మొత్తం తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. రాబోయే రెండు రోజుల్లో పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల కొత్త అధ్యక్షులను ప్రకటించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో ఇంతవరకూ 28 రాష్ట్రాల్లో విజయవంతంగా అంతర్గత సంస్థాగత ఎన్నికలు పూర్తయ్యాయి. జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియకు కనీసం 19 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షుల ఎన్నిక తప్పనిసరి. ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ, హర్యానా వంటి కీలక రాష్ట్రాల్లో ఇంటర్నల్ ఎలక్షన్ పూర్తికాగానే బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఎపికి మాధవ్, తెలంగాణకు రామచంద్రరావులు ఎన్నికైన సంగతి తెలిసిందే.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370